# కథామంజరి

## పది కథల సమాహారం



**సెప్టెంబర్ 2023**

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త



**సెప్టెంబర్ 2023**

సంపుటి : 4 ♦ సంచిక : 9

ఈ నెల కథామంజరి సంచికకి

చేయూతనిచ్చినవారు

## శ్రీ పరిగి మదన్‌మోహన్
## శ్రీమతి పరిగి మీనా

వారికి మా హృదయపూర్వక

## కృతజ్ఞతలు



# కథామంజరి

## శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక "దీపావళి కథల పోటీ"

సాహితీప్రియులకు సాహితీ పండగ దీపావళి. ఎప్పటిలాగే ఈ పండగకి దీపావళి ప్రత్యేకసంచికని తెలుగువారి ముంగిట అందించాలనే సంకల్పంతో, కథామంజరి కథలపోటీని నిర్వహిస్తూ, బహుమతులు పొందిన కథలతో నవంబరు 2023 సంచికను దీపావళి ప్రత్యేకసంచికగా విడుదల చేస్తోంది. ఈ దీపావళి కథల పోటీకీ కథలను ఆహ్వానిస్తున్నాం.

| ప్రథమ బహుమతి | ద్వితీయ బహుమతి | తృతీయ బహుమతి |
|---|---|---|
| ₹5116/- | ₹ 3116/- | ₹ 2116/- |
| 10 ప్రత్యేక బహుమతులు ₹ 516/- చొప్పున | | |

### - నిబంధనలు -

- ఇతివృత్తం ఏదైనా పర్వాలేదు. 1200 పదాల కంటే మించరాదు.
- కథను వర్డ్‌లో యూనికోడ్‌లో టైపు చేసి పంపాలి. పిడియఫ్‌లో పంపే కథలు అనుమతించబడవు.
- కథతో పాటు హామీ పత్రం జత చెయ్యాలి. ఆ పత్రంలో.. కథ స్వీయరచన అని, మరే ఇతర పత్రికలకు పంపలేదని, సాంఘికమాధ్యమాలలో గాని, బ్లాగులలో గాని ప్రచురణ/ప్రసరణ జరగలేదని, సుస్పష్టంగా పొందుపరచాలి.
- పోటీకి వచ్చిన కథలలో సాధారణ ప్రచురణకు కూడా కొన్ని కథలు ఎంపిక చేసుకుని, వీలువెంబడి ప్రచురణ చేస్తాము. అలా ప్రచురణకు తీసుకునే కథలను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి పంపడం జరగదు. దయచేసి రచయితలు "పోటీలో బహుమతులు పొందకపోతే మా కథని తిప్పి పంపమని" మాకు అభ్యర్థనలు పంపవలదు. ఈ విషయం ప్రత్యేకంగా గమనించవలసిందిగా కోరుతున్నాం.
- కథ హామీపత్రంలో "దీపావళి కథల పోటీకి" అని వ్రాసి పంపాలి.
- కథలను *submit@kathamanjari.in* కు మెయిల్ ద్వారా **30.09.2023** తేది **రాత్రి 10 గంటల** లోగా చేరేటట్టు పంపాలి. ఆ తర్వాత వచ్చే కథలను పోటీకి పరిగణించడం జరగదు.
- కథలపోటీ నిర్వహణ, ఎంపిక విషయంలో కథామంజరిదే తుది నిర్ణయం.

ఈ కథలపోటీ ఫలితాలు అక్టోబర్ 2023 మూడవవారంలో తెలియచేయగలం. దీపావళి ప్రత్యేకసంచిక నవంబరు ఒకటో తారీఖున మీ నట్టింట వెలుగుతుంది.

ఈ పోటీలో విరివిగా ఉత్సాహంగా పాల్గొనమని రచయిత(త్రి)లను మనసారా ఆహ్వానిస్తున్నాం.

**కథామంజరి బృందం**

# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నందూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# శ్రీరమణ గార్కి నివాళి




తెలుగువారికి పరిచయం అక్కరలేని రచయిత శ్రీరమణ గారు! ఆయన రాసిన ప్రతి అక్షరం ఓ అణిముత్యమనే చెప్పాలి! ఆ అక్షరంలో తెలుగుదనం, తెలుగు వెటకారం, మమకారం, హాస్యం, వ్యంగ్యం.. ఒకటేమిటి అన్నీ ఉంటాయి.

“బంగారుమురుగు” కథతో బంగారంలా మెరిసి, “మిథునం” కథతో ఆకాశమంత ఎత్తు ఎదిగిపోయి, ఏవో కొంపలు అంటుకుపోయినట్టు అ నింగికి ఎగిరిపోయిన తెలుగువారి ‘తెలుగుకథ’కి మారుపేరు శ్రీరమణగారు! కథామంజరి, ఏప్రిల్ 2021 ఉగాది ప్రత్యేక సంచికకి కథామార్గదర్శిగా, కథలపోటీకి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కథామంజరి ముందడుగుకు ఆప్యాయతతో ప్రోత్సాహం అందించిన శ్రీరమణగారి మరణం తెలుగువారికి తీరని లోటే!

తెలుగులో పేరడీలు రాసిన జరుక్‌శాస్త్రిగారి తర్వాత, ఇటీవల కాలంలో అంతటి ప్రాచుర్యాన్ని పొందిన పేరడీలు రాసింది శ్రీరమణగారని అంటే అతిశయోక్తి కాదు! వాటిలో ప్రముఖులు ప్రేమలేఖ రాస్తే ఎలా ఉంటాయో ఆయన రాసిన పేరడీలు .. ఎన్నిసార్లు చదివినా, మళ్ళీ చదివిస్తాయి. వాటిలో మచ్చుకి కొన్ని ... శ్రీరమణ గారికి నివాళిగా అందిస్తున్నాం!!

★★★

### *మునిమాణిక్యం గారి ప్రేమలేఖ*

ప్రియమైన కాంతానికి,

శుభాశీస్సులతో వ్రాయు లేఖాంశములు. ఉభయకుశలోపరి. నీవు వ్రాయించిన జాబు అందినది. సంగతులు తెలిసినవి. ఎదురింటి మీనాక్షికి మళ్లీ ఆడపిల్లే! ఈ విషయం నీకు సంతోషం కలిగించగలదని తెలపడం అయినది. మీ జానకమ్మ పిన్ని గారింట్లో అంతా కులాసాగానే ఉన్నారు. కనకమహాలక్ష్మి నీ రాకకు ఎదురు చూస్తున్నది. వారి పెద్దమ్మాయికి సీమంతం చేస్తారట. నువ్వు చెప్పిన ప్రకారం పనిమనిషి దగ్గరున్న పెద్ద దబరాగిన్నె తెప్పించాను. పాతకాగితాలవాడు అమ్మగారు ఎప్పుడొస్తారని రోజూ వాకబు చేస్తున్నాడు.

నువ్వు మడిగా కాక విడిగా చిన్న జాడీలో తీసివెళ్లిన ఆవకాయ అయిపోయింది. నువ్వు వెళ్లినప్పటి నుంచి అదే కదా ఆధరువు! మరి పెద్దజాడీలోంచి తీసుకోమంటావా? ఏ సంగతి జాబు వ్రాయించవలెను. వచ్చే తదియా గురువారం దివ్యంగా ఉంది. ఒకవేళ నువ్వు బయలుదేరితే ప్రయాణంలో జాగ్రత్త! మన బందరు రైల్వే స్టేషన్ లో నువ్వు కాపురానికి

వచ్చినప్పటి నుంచి గుర్తుగా ఉన్న రావిచెట్టుని మొన్నీమధ్య నరికి పోగులు పెట్టారు. మరి నువ్వు స్టేషను ఎట్లా గుర్తుపడతావోనని బెంగగా ఉంది. నీ నోట్లో మాట దాగనట్టే, మన పెద్ద బాల్చీలో నీళ్లు ఆగటం లేదు నువ్వు రాగానే మాటు వేద్దాం.

### ముళ్ళపూడి వెంకటరమణగారి "బుడుగు" ప్రేమలేఖ

సీగాన పెసునాంబలు గారుకు,

ఇది లౌ లెటర్ రాస్తున్నానన్నమాట. బాబాయి ఇచ్చిరా అంటే రెండుజెళ్ళ సీతకి ఇచ్చేనే అలాంటిదన్నమాట. బాబాయికి కూడా కుంచెం రాయడం వచ్చునుకో.. నేను వచ్చినంత కాదనుకో.. అయినా నేనేం చిన్నవాడినా! లేకపోతే చితకవాడినా!

నీ కసలేం రాదు కదా! నీకు బాహా రావడం కోసం కుంచెం కుంచెం రాస్తాను. లేపోతే బోలెడు ఇంకా చాలా రాసేయగలను.

లౌ లెటర్ అంటే ప్రేమించుకోవడంట. బాబయి చెప్పాడు. నాకు తెలియదు అనుకో.

బామ్మ రామకోటి రాస్తుంది.. ఏమి తోచక. బాబాయి లౌ లెటరులు రాస్తాడు. బాబాయికి పని దొరకలేదుట కదా! ఇలా అని నాన్న అన్నాడు. అయినా పని దొరుకుతుందేమిటి? గోళీలు అయితే దొరుకుతాయి గాని. బామ్మ బొత్తిగా మతిమరుపు మనిషి. అట్లా అని బామ్మే అంటుంది. అంటే మనం ఓకులు బొత్తిహా పెడతామె... అట్టా అన్నమాట. మర్చిపోకుండా రాసిన మాటే సాయంఖాలం దాకా రాసుకుంటుంది. అందుకని రామకోటి అంటారు దాన్ని.

అమ్మ ఏమి రాయలేదు. అమ్మకి పాపం గుణింతాలు కూడా రావు. అందుకని రోజు నాన్న తలకి బొబ్బర్నానె రాస్తుంది. నేను వద్దన్నా "ఊహు" వినదు. ప్రైవేటు చెప్పి అయినా రాస్తుంది. పాపం చదువు రాదు కదా, అందుకని నేను ఊరుకుంటాను

ప్రేమ గుడ్డిదని బాబాయ్ చెప్పాడు. బామ్మ కళ్ళజోడు నేను పెట్టుకునేప్పుడు తీసుకెళ్లిపోతానే .. అప్పుడు బామ్మ గుడ్డిది అయిపోతుంది కదా.. అట్లాంటిదన్నమాట. మనం ప్రేమించుకోకపోతే నారాయణ కొట్టు దారి కూడా గుడ్డి అవుతుంది.

బాబాయి కాగితాల మీద రాస్తాడు అనుకో! నేను పలక మీద గుండ్రంగా రాయాలిట. ప్రేమించుకునే ఉత్తరాలు తీసుకోరుట... ప్రేమంటే అచ్చంగా ఇచ్చేయడంట, ఒఠొఠిగా కాదు... నిఝుంగా అన్నమాట.

ఇహ ప్రైవేట్ మాస్టారు వచ్చినా, పలక ఉండదన్న మాట. నువ్వు అవకతవకగా రాసి, నా పలక ఇచ్చేకూడదు సిన్మాలోలాగా త్యాగం ఇచ్చేయడం అన్నమాట

(పలక రెండువైపులా నిండిపోయిందోచ్)

★★★

**తెలుగుకథకి 'బంగారుమురుగు' తొడిగిన శ్రీరమణగారికి నివాళిగా**
**ఈ సంచికని వారికి అంకితం ఇస్తున్నాం!**

# ఇదీ వరస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం ... ... ... ... ... ... | i |
| విశిష్ట అతిథి ... ... ... ... ... ... | iii |
| కథా మార్గదర్శి ... ... ... ... ... ... | v |
| కథా పరిచయం ... ... ... ... ... ... | vii |
| కథాపుస్తక పరిచయం ... ... ... ... ... .. | x |
| వినదగునెవ్వరు చెప్పిన ... ... ... ... ... .. | xii |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| అనామతరువు ... | అనిల్ ప్రసాద్ లింగం ... ... | 1 |
| రంగస్థలం ... | సి. యమున ... ... ... | 5 |
| నిన్నటిదాకా శిలనైనా ... ... | సుందరీ నాగమణి నండూరి ... | 11 |
| స్క్రీన్ ప్లే ... | చాగంటి ప్రసాద్ ... ... ... | 17 |
| ఇచ్చుటలో ఉన్న హాయి ... | డా. మజ్జి భారతి ... ... ... | 23 |
| నేను, నాన్న, బంగారం! ... | శ్రీసుధామయి ... ... ... | 28 |
| శతమానం భవతి ... | పి. రాజేంద్రప్రసాద్ ... ... | 34 |
| విగ్రహ సంకల్పం ... | దేవులపల్లి దుర్గాప్రసాద్ ... ... | 38 |
| ఆ ఇంట్లో ఒకరోజు ... | సాయి బ్రహ్మానందం గొర్తి ... | 43 |
| బోన్‌సాయి బ్రతుకు ... | కీ. శే. అబ్బూరి ఛాయాదేవి ... | 49 |



Cover Page Credit : Karl Hedin, Sweden
Inset Drawing : Sri Surampudi

ఈ రోజుల్లో మనం 'పోటీ ప్రపంచం' లో ఉన్నాం! ఈ మాట ఎలా, ఎక్కడ పుట్టిందో గాని నిజంగానే మనిషి జీవితం పూర్తిగా పోటీలతోనే నడుస్తోంది. 'పోటీ ఉంటేనే, నాణ్యమైన ఉత్పత్తి వస్తుందని' ఆర్థిక శాస్త్రవేత్తలు ఏ సందర్భంలో, ఏ విషయాలను పరిగణలోకి తీసుకుని అన్నారో గాని, ఈ పోటీలు జీవితంలో నిత్యకృత్యంగా మారిపోయాయి. ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే.. మన కథాప్రపంచం కూడా దీనికి మినహాయింపు కాదు! ఇది ఓ విధంగా మంచిదే!

అసలు కథల విషయంలో ఈ పోటీల జననం ఎప్పుడా అని కొంత ప్రయత్నం చేసినా, ఎక్కడా వివరాలు లభ్యమవలేదు. మన పెద్దలతో మాట్లాడం జరిగింది. ఎప్పుడో 1881 లో చింతామణి అనే పత్రిక వారు కథలపోటీ పెట్టారని, అలాగే 1950 దశకంలో ఆంధ్రపత్రిక వారు 'కథలపోటీ'ని నిర్వహించారనే విషయం, ఎక్కడో ఒకట్రెండు కథాసాహిత్య విశ్లేషణ పుస్తకాలలో ఉటంకించారనే విషయం తెలిసింది. అదే ఆరంభమా అంటే... అంతకు ముందు కూడా పోటీలు నిర్వహించారనే మాట ఏ గ్రంథాలలోను కనబడలేదు. బహుశా కథలకి ఇచ్చే ప్రాముఖ్యత, గుర్తింపు... కథల పోటీలకి ఆ రోజుల్లో ఇవ్వలేదెమో అని చెప్పొచ్చు! లేదా పోటీలు నిర్వహించినా, వాటి సంగతులు ఎక్కడా నిక్షిప్తం కాలేదేమో కూడా! తర్వాత రోజుల్లో ఆంధ్రప్రభ వారపత్రిక వారు కూడా పోటీలు నిర్వహించారు. పత్రికల సంఖ్య పెరిగిన తర్వాత... అంటే 1960 దశకం తర్వాత పత్రికలు పండగలకి ప్రత్యేకసంచికలను ప్రతిష్ఠాత్మకంగా విడుదల చేసేవారు. ఆ సంచికలలో లబ్ధప్రతిష్టులైన రచయితల దగ్గర్నుంచి కథలను ఆహ్వానించి ప్రచురించేవారు. ఆ సంచికలలో ప్రచురించే కథా రచయితలకు ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉండేది. ఎంత తీరిక లేకపోయినా సరే, ఆ సంచికల కోసం ప్రత్యేకంగా కథలు వ్రాయడం, అవి కూడా పాఠకుల ఆదరణ పొందేలా వ్రాసేవారు! ఆ ప్రత్యేకసంచికలు కాకుండా, కొన్ని పత్రికలు పండగల సందర్భంగా కథల పోటీలను నిర్వహించడం, వాటిలో బహుమతులు పొందిన కథలే కాకుండా, సాధారణ ప్రచురణకు కొన్ని కథలను ఎంపిక చేసేవారు. వందల్లో పోటీ కోసం వచ్చే కథల్లో, బహుమతి కథలను లబ్ధప్రతిష్టులైన సాహితీవేత్తలే ఎంపిక చేసేవారు. ఆ పరిస్థితులు ఓ అర్ధశతాబ్దం బాగానే నడిచాయి. గత ఐదారేళ్ళుగా ముద్రణలో వచ్చే పత్రికలు మూతపడిన తర్వాత, అంతర్జాలంలో పత్రికల జననం ఓ మంచి శుభపరిణామమేనని చెప్పాలి. పాఠకుల సంఖ్య గణనీయంగా తగ్గిన మాట వాస్తవమే గాని, కథకుల ఆలోచన సరళిలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. రాసేవారి సంఖ్య కూడా బాగానే ఉంది. వచ్చిందల్లా.. రాసేవారి, చదివేవారి వయసు మాత్రం ఏభై పైమాటే! అయితే గత ఐదారేళ్ల కిందట కంటే, ఇప్పుడు కథల పోటీలు నిర్వహించే అంతర్జాల పత్రికలు, స్వచ్ఛంద సాహితీసంస్థలు, కొంతమంది సాహితీప్రియులు... బాగానే కనబడుతున్నాయి. సంవత్సరం పొడవునా ఒకటో రెండో కథల పోటీల ప్రకటనలు కనబడుతున్నాయి. పండగల్లో వాటి సంఖ్య కూడా గణనీయంగా ఉంది!

ఇక్కడో ముఖ్యవిషయాన్ని గుర్తించాలి. పత్రికలుగాని, సాహితీసంస్థలు గాని కథలపోటీలు నిర్వహించడానికి ప్రధానమైన కారణం... మంచి కథలు రావాలనే! వాటితో పాటు, ఈ తరంలో కూడా మంచి కథకులు రావాలనీ, కథలు వ్రాసేవారికి ప్రోత్సాహం కలగచేయాలనే తాపత్రయం కనబడుతుంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలో వంటి దేశాలలో కూడా తెలుగు కథలపోటీలు చాలా ఉత్సాహంగా నిర్వహిస్తున్నారంటే... ఈ రోజు తెలుగు కథ ప్రపంచవ్యాప్తంగా కనబడుతున్నదని ఆనందంగా చెప్పుకోవచ్చు! పత్రికలవారు నిర్వహించే కథలపోటీలో ఎంపికైన కథలు, ఆ పత్రికలలో వస్తాయి. ఇతర సాహితీసంస్థలు నిర్వహించే పోటీలలో ఎంపికైన కథలు.. ఆయా సంస్థల హౌస్ మాగజైన్‌లో వస్తాయి. అవి లేకపోతే.. ఆ కథల పరిస్థితి ఏమిటో తెలియదు. ఏది ఏమైనా స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే పోటీలలో కథలను, వారి పేరు మీదే

ఏదో పత్రికలలో ప్రచురిస్తే, అవి చాలామంది పాఠకుల దగ్గరకు వెళతాయి. ఈ విషయాన్ని ఆయా సంస్థల నిర్వాహకులు ఆలోచించాలి!

ఇకపోతే.. ఇంకో నిజం కూడా చెప్పుకోవాలి! పత్రికలకు పోటీలకు తప్పితే మిగతా సమయాలలో కథలు అంతగా రావడం లేదు. పోటీలకు పుంఖానుపుంఖాలుగా వచ్చే కథల్లో కొన్ని సాధారణ ప్రచురణలకు ఎంపిక చేసి, వాటిని సంవత్సర పొడుగునా ప్రచురిస్తున్నారు. ఒక పోటీలో ఎంపిక కాని కథ, మరో పోటీలో ఎంపికవుతున్నదనే ఓ మాట, ముఖ్యంగా కథకుల నుంచి వినబడుతుంది. కాని రాసే ప్రతీ కథకి బహుమతులు వస్తాయని ఊహించడం మంచిది కాదు. ఈ రోజుల్లో పోటీ నిర్వాహకులు తమకు అందుబాటులో ఉన్న సీనియర్ రచయితల చేతనో, కథాసాహిత్యం మీద కొంత పట్టు ఉన్నవారి చేతనో.. ఎంపిక చేయిస్తున్నారు. అయితే... ఎంపిక చేయడంలో కృషి చేస్తున్నవారి ఆలోచనలు, భావజాలాలు... వంటివి వేరువేరుగా ఉండటం సహజం! ఆ కోవలోనే కథలు ఎంపిక జరుగుతాయి. ఈ విషయం కథకులు దృష్టిలో పెట్టుకోవాలి. వ్రాసే ప్రతీ కథా, మొత్తం అందర్నీ మెప్పించ లేకపోవచ్చు.. అలాగే ఒకరికి నచ్చిన కథ, ఇంకొకరికి నచ్చక పోవచ్చును. ఇంత పెద్ద కథాప్రపంచంలో ఇది సహజం అనే వాస్తవాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి! అలాగే ప్రముఖ కథారచయితలు ఎప్పుడూ చెప్పే మాటలు కూడా గుర్తుంచుకోవాలి... “కథ పోటీ గురించి వ్రాయకండి! కథ గుండెలో గూడు కట్టుకున్నప్పుడే రాయండి!”

ముక్తాయింపుగా.. “రచయిత ఎవరైనా తాను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో ఏ చెడ్డకి ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హాని, చెడ్డకి సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను!” రావిశాస్త్రి గారి ఈ మాటలను కథకులు శిరోధార్యం కావాలి!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**శ్రీ సాయి బ్రహ్మానందం గొర్తి**

తెలుగు కథలకు, కథకులకు తెలుగురాష్ట్రాలలో గుర్తింపు, ఆదరణ ఉండటం సహజమే! అలాగే ఇతర ప్రదేశాలలో కూడా ముఖ్యంగా ముంబాయి, చెన్నయ్, పుణె, బెంగుళూరు, న్యూఢిల్లీ వంటి నగరాల్లో నివసించే తెలుగువారిలో కథకులు ఉన్నారు, వారికి, వారి కథలకు గుర్తింపు ఉండటం కూడా సహజమే! అయితే సప్తసముద్రాలు దాటి .. కూటి కోసం పరుగులు పెట్టిన ప్రవాసభారతీయుల విషయంలో మాతృభాష, సంస్కృతుల మీద గతంలో కంటే, ఇప్పుడు మమకారం పాలు ఎక్కువగా ఉందని చెప్పాలి! గత నాలుగైదు దశాబ్దాలుగా, మిగతా దేశాల కన్నా, అమెరికా వెళ్ళి, అక్కడ స్థిరపడిపోయిన తెలుగువారిలో గణనీయమైన కథకులు ఉద్భవించారు. తెలుగు భాష, సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు, తెలుగు కథ కూడా బాగా ఆదరింపబడుతోంది. అలా అమెరికా వెళ్లి, స్థిరపడి కలం ఝుళిపించి శ్రేష్ఠమైన కథలను అందించిన కథకులలో చెప్పుకోవలసిన కథా రచయిత శ్రీ సాయి బ్రహ్మానందం గొర్తి గారు!

చిన్నప్పుడే దక్షిణ భారత ప్రచారసభ వారు నిర్వహించే హిందీ పరీక్షలన్నీ పూర్తి చేస్తున్నప్పుడు... వాటి పాఠ్యాంశాల ద్వారా హిందీ సాహిత్యంతో పరిచయం, వివిధ సాహిత్య ప్రక్రియలంటే ఏమిటో తెలిసాయి. కథ, కవిత, నాటకం, నవల.. వీటిలో ఉండే ప్రధాన అంశాల గురించి మాష్టారు పాఠాలు చెప్పేటప్పుడు, కూలంకషంగా బోధపరిచేవారు. ఆ ప్రభావంతో తెలుగు సాహిత్యం మీద మక్కువ ఏర్పడింది! దానికి తోడు హైస్కూలులో సంస్కృతం నేర్పిన మాష్టారు కూడా సాహిత్యాభిలాష కలగించేలా పాఠాలు చెప్పేవారు. ఆ స్ఫూర్తితో స్కూల్లో నాటకాలు రాయడంతో పాటు, వాటిని ప్రదర్శించడంతో రచనావ్యాసంగంలో అరంగేట్రం చేసిన బ్రహ్మానందంగారు, ఆ రోజుల్లో రచించిన రెండు కథలు, ఆంధ్రప్రభ వారపత్రిక, బాలప్రభలో ప్రచురితమయ్యాయి. తర్వాత రోజుల్లో కాలేజీ చదువులప్పుడు చదవడం తగ్గలేదు గాని, రాయడం తగ్గిందిట. పేజీల పేజీల ఉత్తరాలు మిత్రులకు రాయడం తప్ప కథల జోలికి వెళ్ళలేదు.

కోనసీమ నడిబొడ్డున ఉన్న అమలాపురంలో జన్మించిన బ్రహ్మానందంగారు వైజాగ్‌లో చదువుతున్నప్పుడు 'రావిశాస్త్రి గారిని కలవడం... గొప్ప అనుభవమని' ఆనందంగా అంటారు. 1991 లో ఉద్యోగరీత్యా అమెరికా వెళ్ళిపోవడంతో పదేళ్ళు సాహిత్యం వైపు చూసే అవకాశం రాలేదు కాని.. పుస్తకాలు చదవడం మాత్రం తగ్గలేదుట! ఆ తర్వాతే అక్కడ

తెలుగు సంస్థలకి నాటకాలు రాసారు. ఆ నాటకాలు అమెరికాలోనే కాకుండా ఆంధ్రరాష్ట్రంలో కూడా పలు పరిషత్ పోటీలలో ప్రదర్శింపబడ్డాయి. వీరి "పంచమధర్మం" పద్యనాటకం నంది నాటకోత్సవాల్లో ప్రదర్శింపబడింది. ఇక వెనుకకు చూడకుండా.. కర్ణాటక సంగీతం మీద, సంగీతానికి త్యాగరాజు చేసిన కృషి మీద, వారిపై వచ్చిన పుక్కిటి పురాణగాథల మీద.... వ్యాసాల పరంపరలు బ్రహ్మానందంగారి కలం నుండి జాలువారాయి. ఈ వ్యాసాలు చదివి బాపుగారు మెచ్చుకుని, మరలా త్యాగరాజు తీయాలనుందని కితాబు కూడా ఇచ్చారు.

ఇక కథారచనల విషయానికి వస్తే, సరళమైన భాష, చక్కని చిక్కని శైలితో, తను పుట్టి పెరిగిన కోనసీమ నేపథ్యంలో కథాసాహిత్యం వైపు అడుగులు వేసారు. గోదావరి, కోనసీమ అంటే వేరే చెప్పాలా.. బ్రహ్మానందంగారి కథలు చదువుతుంటే, బాపుగారి సినిమా చూస్తున్నట్టు ఉంటుంది. మరోవైపు తాను మెట్టింటి నేపథ్యంలో (డయాస్పోరా) కథలు రాస్తూ మెప్పుపొందారు కూడా! ఏ కథ వ్రాసినా కథాలక్షణాల విషయంలో రాజీపడరు. కథలలోని పాత్రలు, సంఘటనలు, మానసిక సంఘర్షణలు, సంస్కృతి, పాత్రల ఆలోచనా సరళి.. వంటి విషయాల మీద లోతుగా పరిశీలించి, పరిశోధించి, తీవ్రమైన కృషిచేసి వాటికి అక్షరరూపం ఇస్తారు. అందుకే బ్రహ్మానందంగారి కథలు చిన్నవైనా, పెద్దవైనా పాఠకుడ్ని రంజింప చేస్తాయి. కథావస్తువుని అపురూపంగా వాడుకుంటారు. అరవై డెబ్బై ఆణిముత్యాల లాంటి కథలు వ్రాసిన బ్రహ్మానందంగారు.. 1400 శతాబ్దంలో విజయనగర రాజ్యకాలంలో జరిగిన ఓ యదార్థ సంఘటన ప్రేరణతో "నేహల" అనే చారిత్రాత్మక నవల వ్రాసారు. "యదార్థ చక్రం" నవలిక, "అంతర్జ్వలన" నవలలు, సరిహద్దు, కోనసీమ కథలు, క్విల్ట్.. అనే కథాసంపుటాలు వీరివి వెలువడ్డాయి. బ్రహ్మానందంగారి.... మారని మనసు, బుచ్చిగాడి మళ్ళీ పెళ్లి, ఊర్మిళ రేఖ, బహు'మతులు', అబద్ధంలో నిజం, గాలిపటం, ఆకాశంవారి మేడ, పిండంతే నిప్పటి, రెండో రుమాలు, సంస్కృతం మాష్టారు, ఇస్మాయిల్, పచ్చబొట్ల కాఫీ కప్పు... వంటి ఎన్నో కథలు చాలా ప్రాచుర్యం పొందాయి. వీరి కథలు తమిళ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో అనువదింపబడ్డాయి. ముఖ్యంగా చెప్పుకోవలసి విషయం... వీరి నవల "అంతర్జ్వలన" తమిళ భాషతో పాటు, సంస్కృత భాషలోకి కూడా అనువదించబడింది.

"ప్రతి రచయితా నాకు గురువే.. కాళిదాసు నుంచి, యండమూరి వరకు అందరి రచనలు ఇష్టపడతాను... అలాగే వారి కొన్ని రచనలు నాకు నచ్చలేదు కూడా! కథలు వ్రాయమని నన్ను ప్రేరేపించింది మా చిన బావగారు శేషనారాయణరావు గారు! వయసుతో పాటు అనుభవం పెరిగాక, రచయిత దృష్టికోణం మారుతుంది. రచయిత కథకు ఊపిరి పోస్తాడు, పాఠకులు ఆ రచన జీవితకాలాన్ని నిర్ణయిస్తారు. ఇది నా గట్టి నమ్మకం!" అని ఆనందంగా చెప్పే బ్రహ్మానందంగారు కథలు, కవితలు, వ్యాసాలు, విశ్లేషణతో పాటు... సవ్యసాచిలా సంగీతం, చిత్రలేఖనము, ఫోటోగ్రఫీలలో కూడా ప్రావీణ్యత సంపాదించారు. భార్య లలిత, పిల్లలు హర్ష, సుజయ్‌లతో కాలిఫోర్నియాలో నివసించే శ్రీ సాయి బ్రహ్మానందంగారు, ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియచేసుకుంటూ, మరో ఇన్ని కథా ఆణిముత్యాలను వారి నుంచి ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



**కీ.శే. అబ్బూరి ఛాయాదేవి గారు**

సాధారణ స్త్రీల సమస్యలను కథావస్తువుగా స్వీకరించి, రచనలు చేసిన తెలుగు రచయిత్రులు చాలా తక్కువమంది కనబడతారు. అదీ ఏడు దశాబ్దాల క్రిందట అంటే... అతి తక్కువలో తక్కువ కనబడేవారు. అసలు ఆ కాలంలో... అభ్యుదయ భావాలతో సమాజాన్ని చైతన్యం చేయడానికి రచనలు చేయడం గాని, పదిమంది ముందు మాటలాడే పరిస్థితి గాని స్త్రీలకు ఉండేది కాదు. అలాంటి రోజుల్లో... అంటే స్త్రీవాద ఉద్యమ సాహిత్యం ఇంకా కానరాని రోజుల్లో.. స్త్రీవాద తెలుగు కథలతో ముందుకు అడుగులు వేసిన రచయిత్రి అబ్బూరి ఛాయదేవి గారు. ఈ పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే కథ 'బోన్సాయ్ బ్రతుకు'. అతి సామాన్యంగా కనబడే కుటుంబంలోని ఓ స్త్రీ సాధారణ జీవితంలో నుంచి స్త్రీవాద ఉద్యమ ఆవశ్యకతను ఎత్తి చూపారు. మన మధ్య జరిగే వాస్తవ స్థితిగతుల్లోంచి రచనలు చేసిన ఛాయదేవి గారి కథల ముడిసరుకులు స్వీయ జీవితానుభవాలే! ఊహాత్మకమైన విషయాలను గాని, తనకు తెలియని జీవితాలను గాని ఏ కథలోను చెప్పలేదు. ఇది ఛాయాదేవి గారి నిజాయితీకి, నిబద్ధతకు నిదర్శనం అని చెప్పాలి. అలాగే... అలనాటి కుటుంబ వ్యవస్థలో పురుషాధిక్యత, తర్వాత కాలంలో ఉద్యోగం చేసే స్త్రీలు, ఈ మధ్య కాలంలో చోటుచేసుకున్న ప్రపంచీకరణలో స్త్రీవాదం... ఈ మార్పులకు అనుగుణంగా కాలంతో పాటు దృక్పథంలో కూడా మార్పులు సాధించి రచనలు చేసారు. వీటితో పాటు ఛాయదేవి గారి కథల్లో చక్కటి తెలుగు భాష కనబడుతుంది. తెలుగు నుడికారం, సంభాషణలు, సహజరీతిలో పరుగులు పెట్టే కథనం, కళ్ళకు కనబడే కథాశిల్పం, చక్కటి శైలి... కనబడతాయి. కథల్లో తిరుగుబాట్లు, ఉద్యమించడాలు కనబడవు. కాని పాఠకులను ఆలోచనలతో కట్టిపడేసి, మార్పు తీసుకొచ్చే ఓ అనిర్వచనీయమైన ఆయుధం కనబడుతుంది. అందుకేనేమో... ఆవిడ కథలను ఈ రోజు చదివినా నిత్య నూతనంగా కనబడతాయి.

1933లో రాజమండ్రిలో సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1953లో నిజాం కాలేజి, హైదరాబాదులో ఎం.ఏ. చదువుకుంటున్న రోజుల్లోనే మొదటి కథ "అనుభూతి" వ్రాసారు. ఆ రోజుల్లోనే "కవిత" అనే పత్రికకు సంపాదకురాలుగా పనిచేసారు. ప్రముఖ తెలుగు రచయిత, అధికార భాషా సంఘానికి అధ్యక్షులుగా పనిచేసిన శ్రీ అబ్బూరి వరదరాజేశ్వరరావు గారు వీరి భర్త! ప్రముఖ తెలుగు భావకవి బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహితీవేత్త శ్రీ అబ్బూరి

రామకృష్ణారావు గారు వీరి మామగారు! ఇక వారింట్లో తెలుగు సాహిత్యం నిత్యం తాండవిస్తూనే ఉంటుందనే విషయం వేరే చెప్పక్కర్లేదు! ఆంధ్రా యూనివర్సిటీ నుంచి లైబ్రరీ సైన్స్‌లో కూడా డిప్లొమా చేసి, న్యూఢిల్లీలో ముందు.. యునైటెడ్ సర్వీస్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియాలో... తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ లో డిప్యూటీ లైబ్రేరియన్‌గా పనిచేసారు. ఉపగ్రహం, సుఖాంతం, వెండి పండుగ, ఉడ్ రోజ్, విమర్శకులు, గోదావరి వంటి వీరి కథలు పాఠకుల హృదయాలలో నిలిచిపోయాయి. వీరివి రెండు కథాసంపుటాలు, పలు వ్యాసాల సంపుటాలు వెలువడ్డాయి. 2005 సంవత్సరంలో "తన మార్గం" అనే కథాసంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. అలాగే 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పదవ తరగతి తెలుగు వాచకంలో "బోన్సాయ్ బ్రతుకు" కథను పాఠ్యాంశంగా చేర్చింది. అనేకమైన అవార్డులు, పురస్కారాలు అందుకున్న ఛాయాదేవి గారి కథలు హిందీ, తమిళ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లోకి అనువదించబడ్డాయి.

ఛాయాదేవిగారు ఎంతో సామాన్యంగా, మరెంతో ఆప్యాయంగా, అభిమానంగా అందర్నీ పలకరించి, స్నేహం పంచేవారు. ఆవిడలో హాస్యప్రియత్వం ఎక్కువే.. దానికి తోడు భర్తగారి హాస్య చతురతతో వారింట్లో ఎప్పుడూ నవ్వులు పూచేవి. కథలలో నేరుగా స్త్రీవాదం, తిరుగుబాటు ధోరణి కనబడదు. కాని మార్పు రావాలనే ఆలోచనని తన శైలి ద్వారా, కథలుగా అందించారు. స్త్రీవాద రచయితగా తనకి తాను ఎప్పుడూ చెప్పుకోలేదు కాని, ఛాయాదేవిగారి కథలలో ఆ వాదం ప్రస్ఫుటంగా కనబడి, అందర్నీ కదిలిస్తుంది. రిటైర్ అయిన తరువాత హైదరాబాదులో స్థిరపడి, రెండు దశాబ్దాల పాటు వేదికల పైనుండి, కింది నుండి కూడా విస్తృతంగా సాహిత్య సేవలు అందించారు. ఆ రోజుల్లో హైదరాబాదులో జరిగిన ఏ సాహితీ సభైనా అబ్బూరి ఛాయదేవి గారు లేకుండా జరగలేదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. పనికిరాని వస్తువులతో అందమైన బొమ్మలు తయారు చేస్తూ, తన చుట్టు పక్కల వారితో పుస్తక పఠనం చేయిస్తూ, వృద్ధాప్యాన్ని దగ్గరకు రానీయకుండా, 28 జూన్ 2019 తేదీన కనుమూసిన అబ్బూరి ఛాయదేవి గారిని ఈ రోజు కథామార్గదర్శిగా తలుచుకోవడం సముచితంగా భావిస్తూ, ఛాయాదేవిగారికి నివాళులు అర్పించుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

## శ్రీరమణగారి కథ "బంగారు మురుగు"

శ్రీరమణ గారనగానే మనలో చాలామందికి జ్ఞాపకానికి వచ్చేది ఆయన రాసిన, సినిమాగా తీసిన 'మిథునం'. అతి చిన్న బడ్జెట్ తో తీసిన ఆ సినిమా అంత పేరు సంపాదించడానికి కారణం ఎంతో మంది మనసుల్ని హత్తుకోగలిగే నేపథ్యం, కథ, సంభాషణ. కథలో లీనమయ్యేలా చేస్తూ ప్రేక్షకుడికి కనబడని కథకుడు శ్రీరమణ.

ఎన్నో కథలు, ప్రముఖుల రచనలకు పేరడీలు రాసారాయన. ఎన్నో పత్రికలలో శీర్షికలు నిర్వహించారు. సుమారు పదిహేడు పైన పుస్తకాలు ప్రచురించారు. శ్రీరమణ గారి పేరడీ చదివి నాకు నచ్చిందని చెబితే, తను 'మరో రాచకొండ' అన్న కలం పేరుతో ఆ పత్రికకు ఉత్తరం రాస్తే అది వేసుకున్నారని ఆయనే చెప్పారు. ఇదో తీపి గుర్తు!

గత నెల జూలైలో ఆయన మన ప్రపంచాన్ని వదిలేసి ఆయనకు ప్రియాతిప్రియమైన బాపు, రమణలను చూడకుండా ఉండలేక వాళ్ళ దగ్గరికే వెళ్ళిపోయారు. వారిద్దరితో కలసి పనిచేసి పెంచుకున్న ఆయన అనుబంధం అంత బలమైనది.

ఈనెల కథామంజరిలో శ్రీరమణ గారు రాసిన ఒక కథ 'బంగారు మురుగు' పరిచయం చేద్దామనుకుంటున్నాను. ఈ కథ 24.09.1993 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో ప్రచురించబడింది.

'బంగారు మురుగు' ఒక బంగారు మురుగు గురించి అవును, కాదు. అది బంగారు మురుగుకంటే ఎక్కువైన ఒక బామ్మ గురించి ఆమె మనవడు చెప్పిన మనసు కథ.

తల్లి, తండ్రి, పూజలూ, పునస్కారాలూ, మళ్ళూ, దేవుళ్లూ లాంటి కార్యక్రమాలలోనే తమ కాలమంతా గడుపుతూంటే కొడుక్కి నానమ్మే పోషణ. ఆ పిల్లవాడికి కావలసిన ఆప్యాయత దొరికేది ఆవిడ దగ్గరే. అప్పటికి ఆవిడకి అరవై ఏళ్ళు, ఆ అబ్బాయికి ఆరేళ్లు. బామ్మ ఆలోచనలే వేరు. "బామ్మకి యీ గొడవలేం పట్టేవి కావు. అమ్మ, నాన్న, చుట్టం, పక్కం అన్నీ నాకు బామ్మే. మా బామ్మకి కాశీ రామేశ్వరం అన్నీ నేనే. ఓ కంచంలో తిని, ఓ మంచంలో పడుకునేవాళ్ళం" అదీ సాన్నిహిత్యం. "దయ కంటే పుణ్యం లేదు. నిర్దయ కంటే పాపం లేదు. చెట్టుకి చెంబెడు నీళ్లు పోయడం, పక్షికి గుప్పెడు గింజలు చల్లడం, పశువుకి నాలుగు పరకలు వేయడం, ఆకొన్న వాడికి పట్టెడు మెతుకులు పెట్టడం — నాకు తెలిసిందివే" అన్నది ఆవిడ ఫిలాసఫీ.

బాదంచెట్టు తొర్రలో చెట్టు నుంచి పడిన బాదం కాయలు దాచి, వాటిని కొట్టి పప్పులిచ్చినా, స్కూలుకెళ్ళక మొరాయించినప్పుడు వెనకేసుకొచ్చినా, చిరుతిళ్ళు దాచిపెట్టి తనకు పెట్టినా, తెల్లారగానే నూనె రాసి, నలుగు పెట్టి కాకరపందిరి కింద ముక్కాలిపీట మీద కూచోపెట్టి వేడినీళ్ళు పోసినా, ఒంటిమీది చిన్నిదెబ్బో, గాటో, పోక్కో కనిపిస్తే గారాబంగా కేకలేసి దిగులుపడినా, పిల్లాడి క్రాపు 'తెల్లదొర క్రాపింగు'లా ఉండాలంటూ మంగలికి సలహా ఇచ్చినా అంతా బామ్మే. అప్పుడప్పుడూ తన బంగారు మురుగు తీసి మనవడికి తొడిగి మురిసిపోయేది, బామ్మే. ఇంట్లో దేవతార్చనలో ఉన్న బుల్లిగంట ఇచ్చి మనవడికి, స్కూలు మానిపించి మరీ పీచు మిఠాయి తినిపించిందీ, బామ్మే. ఇంట్లో దొరికిపోతే, "అయినా ఘంటలో వుంటాడా దేవుడు... పసివాళ్ళ బొజ్జలో వుంటాడుగాని..." సాయకారం తీసిందీ, బామ్మే.

ఓసారి ఓ స్వాములవారు ఆయన పరివార సమేతంగా వాళ్ళింటి ఆతిథ్యాన్ని స్వీకరించడానికి వచ్చారు. వాళ్ళు మాట్లాడే భాష (గృహస్తు, సామాజికులు, పూర్ణదీక్షాపరులు, శిష్యపరమాణువులు లాంటివి) అర్థం కాకపోతే మనవడికి చెప్పింది బామ్మ

"అంతా మనుషులేరా అబ్బీ – వృత్తినే... అదో ఆడంబరం..." అని. అదీ ఆ బామ్మంటే.

లోగడ విడిది చేసినపుడు ఆయన చూపు బామ్మ బంగారు మురుగు మీద పడిందిట. "తల్లి చిట్టికాసులపేరు కావాలని గోల చేస్తోంది– నువ్వు చెయ్యి విదిలిస్తే తల్లి కోరిక తీరుస్తా..." అన్నారుట స్వామి బామ్మతో. "ఒరేవ్ హనుమంతుడి ముందా కుప్పిగంతులు? ఇచ్చేదాన్నయితే ఆనాడు గాంధీగారు గుమ్మంలోకొచ్చి సొరాజ్జెమ్ కోసం జోలెపట్టిన రోజే యిద్దును కదా... మహా మహా ఆయనకే ఇవ్వలేదు... ఈ సర్కస్ కంపెనీకి యిస్తానా..." అందిట బామ్మ.

ఓరోజు తీర్థప్రసాదాల సమయంలో మనవడు చొక్కాతో వెళ్ళి ప్రసాదం అడిగాడట స్వామి వారిని. సామివారు ఉగ్రులై 'పో' అని కసరడమేకాదు, ఆ కుర్రాణ్ణి బయటకు పంపి ఇంకెవ్వరికీ కూడా ఇవ్వకుండా ధ్యానంలోకి వెళ్ళిపోయాట్ట. ఇక ఆ తండ్రికి కోపం పట్టలేక కొడుకుని పూనకం వచ్చిన మనిషిలా కొట్టాడు. ఏడుస్తున్న మనవడిని దగ్గరకు తీసుకుని, పై కొంగు కప్పుతూ, "ఆ బడుద్ధాయికి నిన్ను కొట్టేందుకు చేతులెలా వచ్చాయిరా దూర్వాసపు పుటకా వాడూనూ..." అంటూ కొడుకుని తిట్టింది. అక్కడితో ఆగితేనా? బామ్మ అనుచరుడు దీక్షితుల్ని పిలిచి ఆ బోడి సాములారిని తిట్టి, మర్నాడు అదే సాములారు మనవడిని తన వళ్ళో కూర్చోపెట్టుకుని అందరి ముందు ప్రసాదం తినిపించేలా చేసింది బామ్మ.

మనవడికి వడక ముహూర్తం పెట్టేరు. చుట్టాలందరూ వచ్చారు. అత్త, అత్త కూతురు... అందరూ. అత్త దృష్టి మురుగు మీదే. మనవడు ఎఫ్.ఏ. పూర్తి చేశాడు. బందరులో సర్కారు ఉద్యోగం వచ్చింది. దానితో పాటే పెళ్ళి సంబంధాలూనూ. మేనత్త కూతురైతే ససేమిరా వద్దంది బామ్మ. బామ్మకు నచ్చింది ఓ సంబంధం. అయితే తాంబూలాల దాకా వచ్చాక నాలుగు కాసుల బంగారం దగ్గర తేడా వచ్చింది. పిల్ల పేరు గాయత్రి. "నాలుగు కాసుల బంగారం ఒక్క ముద్దుకి చెల్లు... రోజు పదిసార్లు పిలిచినా చాలు పుణ్యం పురుషార్థం..." అంటూ మనవడిని ప్రోత్సహించింది బామ్మ. అయితే ఎలా? అమ్మా, నాన్న కూడా విసిగిపోయి ఉన్నారు... వాళ్ళనుకున్న కట్న కానుకలు లేవని. ఉద్యోగం కోసం వెళ్ళిన తర్వాత ఆ సంబంధమే ఖాయం చెయ్యమని ఉత్తరం రాశాడు మనవడు. వెనువెంటనే అదే సంబంధం ఖాయం చేశామని, ఉన్నపళంగా పదిహేను రోజులు సెలవు తీసుకుని పెళ్ళికి రమ్మనమని టెలిగ్రామ్. బామ్మ చెప్పింది మన నరసింహం సంబంధం సానుకూలం చేసేదని సంబరపడిపోతూ.

కలతలూ, కలహాలూ లేకుండా పెళ్ళయిపోయింది. బందరులో కాపురం.

బామ్మ చివరి క్షణాల్లో చూడ్డానికి వెళ్ళాడు మనవడు భార్యను తీసుకుని. ఆ సమయంలో కూడా బామ్మ అన్న మాటలకు దుఃఖం పొర్లుకొచ్చింది. "నిన్ను వదలి ఎక్కడికి పోతాన్రా వెర్రి నాగన్నా... అలా వెళ్ళి కాసేపు పెత్తనం చేసి మళ్ళీ నీ ఇంటికే వస్తాగా..." అంటూ ధైర్యం చెప్పి బామ్మ వెళ్ళిపోయింది.

భరించలేని శూన్యం. కర్మ కాండ ముగుసింది. బామ్మ ఆరోప్రాణంగా చూసుకున్న బంగారు మురుగు తూకానికి పెడితే అది గిల్టు నగ అని తేలింది. ఆ మురుగు తమకు రావాలనుకున్నవారంతా మొహమొహాలు చూసుకున్నారు. మనవడికి మంచి పెళ్ళాం రావాడానికి బంగారు మురుగు కరిగించిందని వాళ్ళకు తెలీదు.

"బామ్మ మా ఇంటికి వస్తుంది — అన్న మాట ప్రకారం ఆవిడ బంగారు మురుగు ఆవిడకే...గాయత్రి సాక్షిగా" అన్న వాక్యంతో కథ ముగుస్తుంది.

కథంతా ఉత్తమ పురుషలో జరుగుతుంది. మనవడు, బామ్మల మధ్య ఉండే ఆపేక్ష, ప్రేమల నడకే ఈ కథకు ఆయువుపట్టు. బంగారు మురుగు ఒక సంకేతం. ఇద్దరికీ ఇంకెవ్వరినుంచీ దొరకని ప్రేమానురాగాలు ఒకరినుంచి ఒకరికి దొరికాయి. కథ మొదట్లోనే రచయిత పాఠకుల దృష్టికి తెచ్చిన మాటలు "మా అమ్మానాన్న ఎప్పుడూ పూజలూ పునస్కారాలూ, మళ్ళా

దేవుళ్ళూ గొడవల్లో వుండేవారు. స్వాములార్లు, పీఠాధిపతులూ ఎత్తే పల్లకీ, దింపే పల్లకీలతో మా ఇల్లు మటంలా వుండేది. అమ్మ తడిచీర కట్టుకుని పీఠాన్ని సేవిస్తూ — నే దగ్గరకు వెళితే దూరం దూరం తాక్కూడదు అనేది." ఇక బామ్మ విషయానికి వస్తే, "బామ్మకి యీ గొడవలేం పట్టేవి కావు. అమ్మ నాన్న చుట్టం పక్కం అన్నీ నాకు బామ్మే. మా బామ్మకి కాశీ రామేశ్వరం అన్నీ నేనే. ఓ కంచంలో తిని ఓ మంచంలో పడుకునేవాళ్ళం."

మెల్లమెల్లగా బామ్మ మనస్తత్వాన్ని, బామ్మకీ, మనవడికీ ఉన్న సంబంధాన్నీ ఎన్నో ఉదాహరణలతో పాఠకుల ముందుంచుతారు రచయిత. స్వాములవారితో జరిగిన సంఘటనలో రెండు స్పష్టమవుతాయి. ఒకటి కపట స్వాములంటే బామ్మకున్న అసహ్యం, రెండు, అలాంటి వాళ్ళు భక్తుల బలహీన మనస్తత్వాల్ని ఎలా తమకు తగ్గట్టుగా ఉపయోగించుకుంటారో అన్నవి.

బంగారు మురుగు కావాలనుకునే కొడుకు, కోడలికి ఇవ్వలేదు. కూతురికీ ఇవ్వలేదు. కపట స్వాములవారికి అంతకంటే ఇవ్వలేదు. మనవడే తను, తనే మనవడు అనుకున్న మనవడికే చెందాలనుకుంది. ఆ సంగతి తన వాళ్ళెవరికీ, మనవడికి కూడా తెలీదు. మనవడికి తగ్గ ఆడపిల్ల దొరికితే, ఆ సంబంధం చేజారిపోతున్నప్పుడు తన మురుగును పణంగా పెట్టి మనవడి ఆనందానికి దోహదమయింది బామ్మ.

ఆ యిద్దరి మధ్య ఉన్న అనుబంధాన్ని చెప్పడానికి రచయిత ఎంచుకున్న ఉదాహరణలు కోకొల్లలు. అంతేకాదు. ఆ సంఘటనలు బామ్మ మనస్తత్వం గురించి చెప్పడానికి కూడా రచయిత ఉపయోగించుకున్నారు. తమకున్న నాలుగైదు ఎకరాల భూమిని సాగు చేసే రైతులొచ్చినప్పుడు వాళ్ళని ఊపిరాడని తన అభిమానం చూపెట్టి వాళ్ళ సమస్యలను చెప్పడానికి కూడా అవకాశమివ్వని సూక్ష్మబుద్ధి. మనవడికి అడ్డమైన గడ్డీ పెడుతోందని డబ్బు కట్టడి చేస్తే, ఇంట్లోంచి కంచు ఘంట అమ్మేసి జీళ్లు, పీచు మిఠాయి కొనిచ్చి తన అభిమానాన్ని చూపించగలిగే మొండిఘటం.


సంబంధం కుదరదేమోనన్న బాధతో కుమిలిపోతున్న మనవడితో అన్న మాటలు, పాఠకుల మస్తిష్కంలో నిలిచిపోతాయి. "ఒరేవ్ అధికమాసాలతో ఎనభై దాటేశా... నీ పెళ్ళి చూడాలని ప్రాణం ఉగ్గపట్టుక్కూచున్నా... ఆ పిల్ల గోరింటాకుతో పారాణి పెట్టుకుంటే నీ కాళ్ళు పండాలి. — నువ్వు ఆకు వక్క వేసుకుంటే అమ్మడు నోరు పండాలి — అదీ ఇదీ అయి ఆనక మీ కడుపు పండాలి. నేను మళ్లీ నీ ఇంటికి రావద్దూ... బామ్మ గొంతు జీరపోయింది. కన్నీటి చుక్క నాగుండె మీద వెచ్చగా రాలింది."

కథలో ఎన్ని విడివిడి సంఘటనలను చెప్పినా, రచయిత బామ్మలో జీవించాడు. తను ఊహించిన బామ్మ మనస్తత్వాన్ని ఒకే రీతిలో ఎలాంటి విరుద్ధతా రానీయకుండా పాఠకుల ముందుంచుతారు.

ఇదొక బామ్మ కథ. ఆవిడకు మనవడు తప్ప ఇంకెవరూ లేరు. అదొక మొండి ప్రేమ. ఆవిడకు దేవుడు, భక్తి లేవు. ఉన్నదల్లా మానవత్వం. అంతే. అలాంటి బామ్మే ఒక బంగారు మురుగు ఏ మనవడికైనా.

మానవ మనస్తత్వ శాస్త్రాన్ని తన అనుభవంతో జీర్ణించుకుని రాసిన కథ ఇది. రచయిత ఎంచుకున్న శిల్పం పాఠకుల్ని ఆప్యాయంగా చదివిస్తుంది. ఈ కథలో అన్నీ 'ఇజాలు' ఉన్నాయి. అందుకే ఇది ఒక మంచి కథ అయింది.

*పరిచయకర్త — శాయి రాచకొండ, హ్యూస్టన్*




## ఆకాశంలో ఒక నక్షత్రం

డా. ఎమ్. సుగుణరావుగారి కలం నుండి జాలువారిన ఇరవైనాలుగు కథల సమాహారమే "ఆకాశంలో ఒక నక్షత్రం". విభిన్న ఇతివృత్తాలని, వైవిధ్యమైన శైలిశిల్పాలతో తీర్చిదిద్దిన ఈ కథాసంకలనం ఖరీదు ₹200/.

**ప్రతులకు**

డా. ఎమ్. సుగుణరావు, ఫ్లాట్
నెం. 312, గ్రీన్ మియడొస్
అపార్ట్మెంట్, హోటల్ ఫైర్ ఫీల్డ్
మారియట్, మాధవధార,
ఊడా కాలనీ,
**విశాఖపట్నం – 530018**


పాలపిట్ట బుక్స్,
16–11–20/6/1/1,
403, విజయసాయి రెసిడెన్సీ,
సలీమ్ నగర్, మలక్ పేట,
**హైదరాబాదు–500036**
(ఫోన్: 9848787284)


## మదిలో మెదిలిన మధురస్మృతులు

చిన్నచిన్న జీవిత అనుభవాలు, చూసిన సంఘటనల మీద పాఠకుల్ని అకట్టుకునే కథనాలతో ఇరవై ఒక్క కథల సంపుటి ఈ "మదిలో మెదిలిన మధురస్మృతులు" రచన: శ్రీ బొమ్మిశెట్టి రామలింగేశ్వరరావు. ఖరీదు ₹150/–.

**ప్రతులకు**

శ్రీ బొమ్మిశెట్టి రామలింగేశ్వరరావు,
బి – 1/8, శాంతిశిఖర అపార్ట్మెంట్,
సోమాజిగూడ, రాజ్ భవన్ రోడ్,
**హైదరాబాదు – 500 082**
(ఫోన్: 8501985924)






## జీవిక

నానో కథలు, కథలు కలిపి డెబ్బయ్ పైగా కథలతో వెలువడిన కథాసంపుటి "జీవిక". సరళమైన భాష, సున్నితమైన కథాంశాలతో పాఠకులను ఏకాఏకీన చదివించగల ఈ కథల రచయిత శ్రీ గుండాన జోగారావు. ఖరీదు ₹159/-.

**ప్రతులకు**


శ్రీమతి జి. సరళ,
డోర్ నెం.6-253/6, శ్రీ సాయినగర్ కాలనీ,
సింహచలం పోస్ట్,
**విశాఖపట్నం – 530028**
(ఫోన్: 9490185708, 9441571260)

## లేత మనసులు

తన ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులను తీర్చిదిద్దుతూ, మరోవైపు రచనలు చేయడమే ప్రవృత్తిగా, లక్షణమైన కథలను, కవితలను రచిస్తున్న శ్రీమతి చివుకుల శ్రీలక్ష్మిగారి ముప్పై కథల సమాహారం "లేత మనసులు". ఖరీదు ₹150/-.

**ప్రతులకు**

శ్రీమతి చివుకుల శ్రీలక్ష్మి,
ఇంటి నెం. 20-24-18,
పద్మావతి నగర్ ఆరవ వీధి,
**విజయనగరం – 535002**
(ఫోన్ 9441957325)






ఈ నెల కథామంజరి లో మీరు రాసిన సంపాదకీయం చాలా విలువైనది, చాలా ఆలోచింప తగ్గది కూడా!

జూలై 8వ తేదీన శ్రీ రామశర్మగారు విశాఖపట్టణంలో నిర్వహించిన 'కథారవళి' సమావేశంలో మన సుప్రసిద్ధ సాహితీవేత్తలు కొంతమంది సూచించినట్లు... మనం ఎంత సేపూ 'తెలుగులో గొప్ప నాటకం ఏది?' అంటే కన్యాశుల్కం దగ్గరే ఆగిపోతున్నాం! నందిగారి 'మరో మొహంజోదారో', ఆనందరావుగారి 'పడమటి గాలి' లాంటి నాటకాలను విస్మరిస్తున్నాం.

అలాగే తెలుగులో గొప్ప కథలు కొన్ని చెప్పమంటే అలనాటి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి 'వడ్ల గింజలు', పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారి 'కానుగ చెట్టు', ఇంకా కొంచెం ముందుకు వస్తే మల్లాది రామకృష్ణశాస్త్రిగారి 'దు ము వు లు', పాలగుమ్మి పద్మరాజుగారి 'గాలివాన', కందుకూరి అనంతంగారి 'బిళ్ళల మొలతాడు', కారా మాస్టారి 'యజ్ఞం', రావిశాస్త్రిగారి 'వర్షం', బుచ్చిబాబుగారి 'నా గురించి కథ వ్రాయవూ', చాసోగారి 'వాయులీనం', కుటుంబరావు గారి 'కురూపి', ధనికొండ వారి 'గళ్ళరుమాలు', కళ్యాణ సుందరీ జగన్నాథ్‌గారి 'అలరాస పుట్టిళ్ళు', బీనాదేవి గారి 'రాధమ్మ పెళ్లి ఆగిపోయింది'... ఇలా నలభై యాభై ఏళ్ల క్రితం వచ్చిన కథల వరకు చెప్పి ఆగిపోతున్నాం. ఇది నేను చాలా ఏళ్లుగా గమనిస్తున్న పరిస్థితి!

ఈ మధ్యకాలంలో కూడా ఎన్నో మంచి కథలు వచ్చాయి. ఎంతోమంది రచయితలు గొప్ప కథలు రాశారు. ఈ మధ్య రోజుల్లో జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తిగారు, ఎంవి రామిరెడ్డిగారు, అట్టాడ అప్పలనాయుడుగారు, చింతకింద శ్రీనివాసరావుగారు, వేంపల్లి షరీఫ్‌గారు, పట్నాల ఈశ్వరరావుగారు – (ఇలా చెప్పుకుంటూ వెళ్తే చాలా పెద్ద లిస్టు అవుతుంది) మొదలైన వారి కలాల నుండి కొన్ని గొప్ప కథలు వెలువడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి కథల గురించి వేదికల మీద ప్రస్తావించకపోవడం, పత్రికల్లో సమీక్షించకపోవడం కూడా మనం తెలుగు కథకు ఒక రకంగా అన్యాయం చేస్తున్నట్లే! ఈ విషయాన్ని మీరు మీ సంపాదకీయంలో చర్చించడం నాకు ఆనందం కలిగించింది.

'ప్రస్తుతం వస్తున్న కథల్లో ఆణిముత్యాల్లాంటి కథలను ఏరి ప్రపంచానికి పరిచయం చేయడానికి... ముందు కథకులే నడుం కట్టుకొని ముందడుగు వేయాలి.' అని నుడివిన మీ పలుకులు హర్షణీయం! మీకు నా అభినందనలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**ద్విభాష్యం రాజేశ్వరరావు, విశాఖపట్నం.**

---

ఆగస్టు నెల సంపాదకీయం, విశిష్ట అతిథి పరిచయం ఎంతో బాగా రాశారు. మా అభినందలు.

**విహారి, హైదరాబాద్**



8185949365

# అనామతరువు

అనిల్ ప్రసాద్ లింగం

**సినీరంగ మార్తాండ కథల పోటీ 2023లో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

> ***ఒక్క పాట హిట్టయితే చాలు శాటిలైట్ రైట్స్ తోనే మనకి లాభాలొచ్చేస్తాయి!***
> ***ఇంకా నువ్వీ సినిమా విషయం మర్చిపో... ఇప్పుడిది వంద కోట్ల ప్రాజెక్టు!***
> ***అరవ సంగీత దర్శకుడు, వరసగా రెండు హిట్లు కొట్టిన కుర్ర డైరెక్టరు జత కలిసారు... అబ్బో ఎక్కడికో వెళ్ళిపోయింది.***
> ***అసలు కథే మారిపోయిందనుకో! తెర మీద చూస్తే నువ్వే నోరెళ్ళబెడతావు.***
> ***ఇంకేమన్నా కొత్త కథలుంటే చెప్పు వెంకట్రావ్ ప్లాన్ చేద్దాం. నీకూ వేషముంటుందిలే!"***

ఆ రోజు వెంకట్రావుకి ఇంకా గుర్తుంది. షూటింగ్ విరామంలో తన ఫోనులోని మనవరాలి వీడియోని సహ నటీనటులకు చూపిస్తుండగా వచ్చాడు నిర్మాత రాజేంద్ర. ఆయనా చూసి ఎంతో మెచ్చుకున్నాడు. "చాలా బాగా చేసిందయ్యా! అన్నీ నీ పోలికలే... ఎక్కడికి పోతాయి లక్షణాలు, మీ రక్తంలోనే ఉంది! డైలాగులు కూడా బాగున్నాయి, ఎవరు వ్రాసారు?" అనడిగారు.

"నేనేనండీ, చిన్న కాన్సెప్టు అనుకొని పిల్లకి నేర్పించాను. కరోనా వల్ల పోయిన తల్లితండ్రులిక మరి తిరిగిరారని ఊహ తెలీని పసిపిల్ల! పల్లెటూరులోని నాయనమ్మ పంచచేరి, అప్పటివరకూ మెట్రో నగరంలో తాననుభవించిన అష్టైశ్వర్యాలని తలచుకుంటూ, తోడుగా మిగిలిన... లక్షలు పోసి కొన్న విదేశీ కుక్కపిల్లతో రేపు తన అమ్మా, నాన్న హాస్పిటల్ నుండి తిరిగొస్తే మళ్ళీ సిటీలోని తనింటికి వెళ్ళిపోతామని... అమాయకంగా చెప్పడం, ఏకపాత్రాభినయంగా చేయించాను."అని గొప్పగా చెప్పాడు.

అందరూ బాగా పొగిడారు. సహచర సీనియర్ నటి జానకి మెల్లగా, "ఇంటికెళ్ళాక పిల్లకి దిష్టి తీయించు, ఎవరి కళ్ళెలాటివో" అని సలహా కూడా ఇచ్చింది.

★★★

తర్వాతి రోజు మనవరాలిని సెట్ కి తీసుకెళ్ళాడు.

నిర్మాత రాజేంద్ర పాపని దగ్గరకి తీసుకొని అభినందించి, "షార్ట్ ఫిల్మ్ తీసి నెట్లో పెట్టవయ్యా ఇంకా పేరొస్తది, పాపకీ అవకాశాలొస్తాయి" అని, "పోనీ ఇంకొంచెం విస్తరించి చిన్న బడ్జెట్లో సినిమా తీద్దామా? నేనే నిర్మిస్తాను!" అని ప్రోత్సహించాడు.

గత మూడు దశాబ్దాలుగా తెలుగు సినిమాల్లో చిన్నాచితకా వేషాలేస్తూ, బ్రతుకీడ్చుకొస్తున్న పెద్దాయనకి ఆ మాటలతో ఎక్కడ

లేని ఉత్సాహం పొంగుకొచ్చింది.

రేయింబవళ్ళూ కష్టపడి రెండున్నర గంటలకు సరిపడ్డా కథని సిద్ధం చేసి ఇచ్చాడు

నిర్మాత అది చూసి, "అబ్బా పిండేశావయ్యా! ఎప్పుడో 'పాపం పసివాడు' అని అడివిలో తప్పిపోయిన చిన్నపిల్లాడి కథతో ఓ సినిమా వచ్చింది. మళ్ళీ ఇన్నాళ్ళకి నీ కథ! ఇది యూనివర్సల్ సబ్జెక్టు అవ్వుద్ది. వేరే భాషల్లోకి కూడా అనువదిద్దాము. మొత్తం నువ్వే చూసుకోవాలి, మీ మనవరాలిని సిద్ధం చెయ్యి!" అని తెగ మెచ్చుకున్నాడు నిర్మాత.

క్యారెక్టర్ వేషాలకి విరామమిచ్చి, నిర్మాణ సంస్థ ఆఫీసులో కూర్చుని ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలెట్టాడు వెంకట్రావు! నటీనటులు ఇతర సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతుంది.




ఓ రోజు నిర్మాత ఆఫీసులో అత్యవసరంగా సమావేశం ఏర్పాటయ్యింది. నలుగురు ఫైనాన్షియర్లతో కూర్చుని మళ్ళీ కథ మొత్తం విన్నాక మెల్లగా చెప్పాడు రాజేంద్ర.

"చూడెంకట్రావ్, ఈ ప్రాజెక్టు విషయంలో నువ్వెంతో కష్టపడ్డావు... అసలిది నీ మానస పుత్రిక! కానీ డబ్బు పెట్టాలంటే, నా

పార్ట్నర్స్ ప్రేక్షకులని ఆకర్షించడానికి సినిమాలో ఏదైనా ప్రత్యేకత ఉండాలంటున్నారు. బాగా ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చాం! ఈ కథలోని ముఖ్యమైన ఆ చిన్నపిల్ల పాత్ర... నీ మనవరాలు కాకుండా మరెవరన్నా పేరున్నా బాలనటి వేస్తే, మినిమం గ్యారంటీ ఉంటుందనేది మా అభిప్రాయం. మార్కెట్లో కనుక్కుంటే మన సూపర్ హీరో 'సంతోష్' కూతురు యూట్యూబులో తన సొంత ఛానల్ నడుపుతూ డాన్సులూ అవి చేసి, కొంత జనాలకి పరిచయం అయ్యింది. ఆ పాప ఈ రోల్ వేస్తే జనాలు తన కోసం హాలుకొచ్చి చూస్తారు. పరిశ్రమలోని నటీనటులూ మన సినిమాని ప్రమోట్ చేస్తారు. అప్పుడు మన పెట్టుబడి మనకొచ్చేస్తుంది! నీ మనవరాలు బాగా చెయ్యలేదని కాదుగానీ, సినిమాకి ఓ క్రేజ్ ఉంటే ఓపెనింగ్స్ బాగుంటాయని... అంతే! మీ పాపని కూడా పక్కన స్నేహితురాలిగా పెట్టుకుందాం. నువ్వు ఇంకేం మాటాడకు!" అని తన నోరు కట్టేసాడు.

అప్పటినుండీ తనకు ఊహించని విషయాలు, సంఘటనలను మౌనంగా ఆకళింపు చేసుకోవడం అలవడింది.

మరో రోజు :

"నీకో గొప్ప వార్త చెప్పనా? మొదటిసారి కూతురు తెర మీద కనబడుతుంది కాబట్టి, మన సూపర్ హీరో 'సంతోష్' వాయిస్ ఓవర్ ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. స్క్రీన్ ప్లే ఆ విధంగా మార్చు! నీ కథ అతనికి బాగా నచ్చింది... ఈ వ్యాఖ్యానం చెప్పడమనేది తన ఐడియానే! అంతటి వాడు కథను నడిపిస్తాడు కాబట్టీ, మాటల్లో బరువు, గొప్ప ఎమోషన్, సందర్భోచితంగా కొంచెం హాస్యం మిళితమై, యువతను ఆకర్షించడానికి నాలుగు పంచులు ఉండాలని, డైలాగులు ఆయన తన స్నేహితుడు రచయిత రమేష్‌తో రాయిస్తున్నాడు. రమేష్ నీకూ తెలుసుగా... ఈమధ్య కాలంలో అతను రాసిన నాలుగు సినిమాలూ హిట్టే. అలాగే డైలాగులూ జనాల నోళ్ళలో నానాయి. మన సినిమాకి మంచిదని నేనూ కాదనలేకపోయాను! డబ్బులు కొంచెం ఎక్కువే అడిగాడు, కానీ మూలకథని మాత్రం నీది తీసుకొని, మిగతా స్క్రిప్ట్ వర్కంతా అతనే చూసుకుంటాడులే. మనం ఆ విధంగా లెక్క చూసుకుందాం. ఏమంటావు?" అన్నాడు రాజేంద్ర.

ఇంకొన్నాళ్ళకి :

"ఎంకట్రావ్, నాకో గొప్ప ఆలోచన వచ్చింది... వింటే నీకు దిమ్మతిరిగిపోద్ది! కుటుంబంతో సెలవులకి విదేశాలు వెళ్లుతున్నాడంట సూపర్ హీరో, ఆయన్ని ఒప్పించి మన యూనిట్‌ని కూడా వెంట పంపి, నాల్రోజుల్లో ఓ పాట అక్కడ తీయిద్దామని అనుకుంటన్నా! ఇది పూర్తిగా నా ఆలోచన! ఒకే పాటలో... ప్రేమ, పెళ్ళీ, పిల్ల పుట్టడం అనేదంతా చూపించేలాగా ప్లాన్ చేస్తున్నాను. దీనికి రొమాంటిక్ పాటలు చెయ్యడంలో దిట్ట, డాన్సు మాస్టర్ అనీల్ని ఒప్పించి పంపిస్తున్నాను. ఎలాగూ విరామం తీసుకుంటున్నాడు కాబట్టి, డేట్స్ ఇబ్బంది లేదు... హా... బదులుగా ఆ ట్రిప్పు ఖర్చు మనం భరించాలి! ఎవరన్నా కొత్త బొంబాయి అమ్మాయిని 'సూపర్ హీరో పక్కన పాట' అని చెప్పి బుక్ చేసి తీసుకెళ్ళాలి. అవన్నీ నేను చూసుకుంటాను. బడ్జెట్ మనమనుకున్నదానికన్నా మీరిపోతుంది, కానీ ఇప్పటికే అతని కూతురుందని హైప్ వచ్చింది! ఇప్పుడిక ఆ హీరో స్పెషల్ సాంగ్ కూడా ఉందంటే మన సినిమాకి చాలా ప్లస్ అవుతుంది. ఒక్క పాట హిట్టయితే చాలు శాటిలైట్ రైట్స్ తోనే మనకి లాభాలొచ్చేస్తాయి! ఇంకా నువ్వీ సినిమా విషయం మర్చిపో... ఇప్పుడిది వంద కోట్ల ప్రాజెక్టు! అరవ సంగీత దర్శకుడు, వరసగా రెండు హిట్లు కొట్టిన కుర్ర డైరెక్టరు జత కలిసారు... అబ్బో ఎక్కడికో వెళ్ళిపోయింది. అసలు కథే మారిపోయిందనుకో! తెర మీద చూస్తే నువ్వే నోరెళ్ళబెడతావు. ఇంకేమన్నా కొత్త కథలుంటే చెప్పు వెంకట్రావ్ ప్లాన్ చేద్దాం. నీకూ వేషముంటుందిలే!"

రోజుకో కొత్త విషయంతో మొదలయ్యి, ఆఫీసునుండీ బయటకు పంపేవరకూ అన్నీ తనకు వింత అనుభవాలే! తనవరకూ

కొత్తే అయినా, ఇటువంటివి పరిశ్రమలో ఎన్నో ఇంతకు ముందు చూసి, విని ఉండటం ఆపైన వయసుతో అలవడిన ఓర్పు వెంకట్రావుని నిలబెట్టింది! కానీ ఆయన మనవరాలు కూలిన ఊహల సౌధం కింద నలిగిపోయింది.

★★★

“సినిమా ఎప్పుడు మొదలవుతుంది తాతా? నేను స్కూల్లో అందరికీ చెప్పేశాను!” ఇంటికి రాగానే కాళ్ళని చుట్టేసింది పిల్ల.

“ఇంకా మంచి కథ కోసం చూస్తున్నానమ్మా, హిట్టు కొట్టాలిగా!” కథలు చెప్తున్నాడు తాతయ్య.

“ఈ కథ బాగానే ఉందిగా తాతా, స్కూలు యానివర్సరీకి చేస్తే అందరూ మెచ్చుకున్నారు కదా. అమ్మయితే ఏడ్చేసింది కూడా!”

“సినిమా అనేది ఓ మాయాప్రపంచం తల్లీ. ఇక్కడ ఏది ఎప్పుడెక్కడ మొదలవుతుందో, ఏ రూపం సంతరించుకుంటుందో, ఎటు వెళ్తుందో, ఎప్పుడాగిపోతుందో, ఎవరెవరిని కలుపుతుందో, ఎవరిని అందలమెక్కిస్తుందో, ఎందుకు చాలామందిని అధః పాతాళానికి తొక్కేస్తుందో, ఎందరున్నారో, ఎవరు చేశారో, ఎవరు వ్రాసారో, ఎవరు పాడారో, ఎక్కడ ఎలా తెరకెక్కించారో అన్నీ తెలిసినట్టే అనిపించి... చివరికి నీకేమీ తెలీదని లాగి గూబమీద కొట్టి చెప్పే రంగుల మాలోకమమ్మా ఇది! ఇక్కడ బయటకి కనిపించేది నిజం కాదు! అసలు వాస్తవం ఎప్పటికీ వెలుగు చూడదు! సృజనాత్మకత, కల్పనాశక్తిని కూడా కాగితపు డబ్బుల తరాజులో తూకం వేసి, విలువను నిర్ణయించే బేహారి వ్యవస్థమ్మా నేటి మన కళారంగం! వద్దమ్మా నీకీ కుళ్ళు అంటనీకు.” ఆవేశంగా మాటలాడుతూ పిల్లని దగ్గరికి తీసుకొని హత్తుకున్నాడు వెంకట్రావు.

“అరే ఒక్క గుక్కలో భలే చెప్పావు తాతా, నాకూ నేర్పవా? ఏ సినిమాలో పాత్ర ఇది? సీనేంటీ?”అమాయకంగా అడిగింది చిన్నారి.

ఆ కీటకం కుట్టిన తన తర్వాతి తరాన్ని చూసి నిర్వికారంగా నిట్టూర్చాడు వెంకట్రావు.



9550445911

సి. యమున

**సినీరంగ మార్తాండ కథలపోటీ 2023 లో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

***"నటన గురించి తర్ఫీదుని ఇచ్చే ప్రతిష్టాత్మకమైన 'యాక్టింగ్ అకాడమీస్'ఎన్నో ఉన్నాయి. మీరు 'ఊ'అంటే చాలు వాళ్ళు మిమ్మల్ని స్వాగతిస్తారు. అక్కడ మీ నటనలో అనుభవాల గురించి, విజయాల వెనుక కృషి గురించి స్టూడెంట్స్‌కు బోధించండి!"***

కళ్ళకు విందు, మనసుకు ఆనందం అందచేస్తూ, ఆకాశాన్ని అంటుతున్నట్లుగా కటవుట్స్. వాటిని అలంకరించిన భారీ పూల మాలలు.

"ఆటోగ్రాఫ్ ప్లీజ్!" ఎగబడుతున్న అభిమానులు!

వారిని తప్పించుకుంటూ సభ జరగబోతున్న హాల్లోకి అడుగుపెట్టాను. నా ఉనికిని గుర్తిస్తూ సభలో కలకలం!

సభా వేదిక వైపు అడుగులు వేస్తూ ఉంటే, లేచి నుంచుని నమస్కారాలు చేసేవారు, షేక్‌హ్యాండ్ ఇచ్చేవాళ్ళు... గబగబా ప్రక్కన చేరి సెల్ఫీలు తీసుకునే వాళ్ళు... మనసంతా ఆనందం ఆవరించింది!

మరోసారి నంది అవార్డ్‌ను అందుకోబోతున్నాను. వేదిక మీద అలంకరించిన మరుక్షణం, ఉక్కిరి బిక్కిరి చేస్తూ మెడను అలంకరిస్తున్న గజ మాలలు... ఊపిరి ఆడని భావన!

అవును, కల నుండి ఇలలోకి వచ్చిన నాకు ఊపిరి ఆడటం లేదు. స్వప్నంలోనే కనగల గతించిన గత వైభవం.

ప్రక్కకి తిరిగి చూశాను. ప్రశాంతంగా నిద్ర పోతోంది నా భార్య! నేను షూటింగ్స్‌తో అలసి అర్ధరాత్రో, తెల్లవారుఝామునో వచ్చిన రోజుల్లో ఆమెకు ఈ సుఖ నిద్ర లేదు. అప్పటికన్నా, ఇప్పటి జీవితమే ఈమెకు బాగుందా? అందుకే అంత గాఢంగా నిద్రపోతోందా!!


'జీవితంలో అన్నీ ఉన్నా, నటనకు దూరమై బ్రతకటం దుర్భరం'అనిపిస్తోంది. మొన్న మొన్నటిదాకా కథానాయకుడిగా నీరాజనాలు అందుకున్న నాకు... ఇప్పుడు 'నటన'అనే పదమే మర్చిపోయే స్థితి! అనుభవానికి వస్తే కానీ, కొన్ని అర్థం కావు. నాలో అశాంతి నన్ను కాల్చేస్తోంది. ఇలా నిద్రపట్టని రాత్రులు మిగులుస్తోంది!

ప్రక్కనే, టీపాయ్ మీదున్న మొబైల్‌ని చేతిలోకి తీసుకున్నాను.

"పోనీ, పిల్లలికి ఫోన్ చేస్తే?"

మామూలుగా చేస్తేనే 'డాడీ , కాస్త బిజీ, మళ్ళీ కాల్ చేస్తాము'అంటారు. అలాంటిది, ఈ టైమ్ లోనా... ఉహు. ఒకప్పుడు వాళ్ళతో గడపటానికి నాకు తీరుబడి లేదు. ఇప్పుడు వాళ్ళకి నా ఆవేదన వినే టైమ్ లేదు!

మొబైల్ అక్కడే పెట్టేసి ఆలోచనలతో తడబడుతూ, హాల్ కి అటాచ్ అయ్యిఉన్న పెద్ద బాల్కనీలోకి నడిచాను. ఇంటి ముంగిట లాన్. నా భార్య అభిరుచిని ప్రకటిస్తూ, ఎన్నో రకాల మొక్కలు.




'ఇన్నేళ్లల్లో మనల్ని ఎప్పుడన్నా తొంగి చూశాడా... ఈ రోజు ఏమిటో ఇలా పరిశీలనగా చూస్తున్నాడు'అని గుస గుసలాడుతున్నట్లుగా ఒకదానిమీద ఒకటి ఒరిగి, ఊగుతున్నాయి.

దూరంగా ఔట్ హౌస్‌లో వాచ్ మన్ ఫ్యామిలీ. వాళ్ళు కూడా హాయిగా నిద్ర పోతున్నట్లున్నారు. అంత ఎత్తున మెయిన్ గేట్. ఒకప్పుడు దాని ముందర అభిమానుల సందోహం ముమ్మరంగా ఉండేది. మరి ఇప్పుడు!!

సూర్యుడు, బద్ధకాన్ని విడిచిపెడుతున్న దానికి గుర్తుగా ఆకాశంలో చిన్ని వెలుగు!

'తెలవారబోతోంది... లేవండి'అని చెప్పటానికా అన్నట్లు పక్షుల ప్రయాణం!

అందమైన గార్డెన్, ఆహ్లాదకర వాతావరణం... ఏదీ ఆస్వాదించలేక పోతున్నాను. ఒక్కసారిగా, కొన్ని అలవరచుకోలేమేమో!

నా ఆస్వాదన, అనుభూతి... అన్నీ నటనే. పిన్న వయసులోనే, చిన్న చిన్న పాత్రలతో నటన ఆరంభించాను. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాను... ఎదిరించి నిలబడి, నిలదొక్కుకున్నాను!

మూడు హిట్లు, ఆరు అవార్డ్స్‌గా సాగిపోయింది. నంది అవార్డ్స్ కూడా అందుకున్నాను. 'కమర్షియల్ హిట్స్'నన్ను ధనవంతుడిని చేస్తే, 'క్రిటిక్ అవార్డ్స్'నన్ను మంచి నటుడిగా గుర్తింపునిచ్చాయి.

హీరోగా, 'నటనా జీవితానికి'ఈ మధ్యనే రజతోత్సవం కూడా జరుపుకున్నాను.

గత కొంత కాలంగా, సినిమా అవకాశాలు క్రమ క్రమంగా తగ్గుముఖం పట్టాయి. 'భూమి నుండి మొలకెత్తిన తీగ విస్తరించి, పళ్లతో కళ కళలాడి... చివరకు ఆ భువి పైనే వాలి పోయినట్లుగా...'నా నటనా జీవితమూ అంతే. సినిమా రంగంలోనే ఎదిగి, అదే రంగంపై ఒరిగిపోయింది.

'లైట్స్ ఆన్... యాక్షన్'లాంటి మాటలు విని చాలా రోజులు దాటిపోయింది. నటన లేని జీవితం భారంగా ఉంది.

ఆవలిస్తున్న శరీరం ఆలోచనలకు స్వస్తి చెప్పమంటోంది. బాల్కనీలో అందంగా నగిషీలు చెక్కి ఉన్న టేకు ఉయ్యాలపై ఒరిగిపోయాను.

★★★

మొహంమీద పడ్డ చుర్రున ఎండకు మెలకువ వచ్చింది. నా వంటి మీద కప్పి ఉన్న దుప్పటి చెప్పింది... నేనిక్కడ నిద్రించినట్లు నా భార్యకు తెలిసిందని! మెల్లగా లేచి లోపలికి నడిచాను.

నేను రెడీ అయ్యి వచ్చేసరికి , పొగలు కక్కే కాఫీతో ఎదురుగా నా భార్య 'మణి'. తను నన్ను ఎన్నో విధాలా ఓ 'కంట'కనిపెట్టుకునే ఉంటుంది. అందుకేనేమో, నాకు ఏ దురలవాటు లేని నిజమైన హీరో 'శ్రీరామ్'గానే ఇండస్ట్రీలో పేరుంది.

"ఏమిటీ, నిద్ర పట్టలేదా? సరే, పదండి. వంశీ వచ్చాడు . మీతో కలిసి టిఫిన్ చేద్దామని కూర్చున్నాడు!"

అర్థం కానట్లు చూశాను.

"అబ్బా, మర్చిపోయారా... మీ ముద్దుల మేనల్లుడు వంశీ, ఈ రోజు ఊరు నుండి వస్తున్నాడని తెలుసుగా!"

గుర్తుకొచ్చింది. వంశీ, మణి అన్నయ్య కొడుకు, నా అభిమాని.

"పద పదా"అంటూ హుషారుగా క్రిందకు దిగాను.

"హాయ్ మామా" అంటూ వంశీ వచ్చి కౌగిలించుకున్నాడు.

వంశీకి, నాకూ కూడా ఇష్టమైన పూరీ, కుర్మా కూర కుక్ వడ్డించాడు. ఎదురుగా టి.వి.లో నాకు ఇష్టమైన ఛానెల్‌ని ఆన్ చేశాను. నేను ద్విపాత్రాభినయనం చేసిన సినిమా వస్తోంది.

"అబ్బా, చచ్చిపోతున్నానురా. ఎప్పుడూ ఆ సినిమాలు చూడటం... ఎప్పటి ముచ్చట్లో తవ్వుకోవటం. చిరాకు పుడుతోంది" విసుగ్గా వంశీకి చెపుతోంది మణి.

ఒకప్పుడు నటుడి భార్యగా గర్వించిన మణికి, ఇప్పుడు ఆ నటనే తలనొప్పిగా ఉందా? ఏమిటీ చిన్నచూపు... ఆర్జన ఆగిపోయిందనా... అసలు నటనే ఆరిపోయిందనా...

నేను పైకి అనకపోయినా, నా మాటలు తనకు వినపడ్డట్లుగా...

"నటించినంత కాలం నటించారు... చాలదూ! సిరిసంపదలకు కొదవ లేదు. పిల్లలూ చక్కగా సెటిల్ అయ్యారు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ, అప్పటి ముచ్చట్లు చెపుతూ, చాదస్తంతో ప్రాణాలు తోడేస్తున్నారు. వయసు ప్రభావం అంటే ఇదేనేమో!" ఆగకుండా మణి మాటలు.

'నటన నా వృత్తిగా, కీర్తి దాహంగా, డబ్బు పిచ్చిగా మీకు కనపడి ఉండొచ్చు. కానీ నటన నా ప్రాణం... ఊపిరి! అది నా పాషన్...' అని దూకి రాబోతున్న మాటలను మనసులోనే తొక్కిపెట్టేశాను. అలా అర్థం చేసుకునేటట్లుగా నేను ప్రవర్తించలేదేమో??

కనీసం మొహమాటం కోసం అన్నా, ప్రతి మనిషీ, అవసరం అయినపుడు జీవితంలో ఆయా సందర్భాల్లో నటిస్తాడు. అలాంటి

లక్షణాలు లేకే మణి ఇలా మాట్లాడుతుందేమో! అక్కడే తిరుగుతున్న వంటమనిషిని కూడా పట్టించుకోకుండా చాలా రోజుల తరువాత వచ్చిన మేనల్లుడికి, నాగురించి చాడీలు చెపుతోంది.

'ఓ రోజు పూర్తిగా నాతో గడపరూ!" అని అర్థించిన అర్ధాంగికి ఇప్పుడు నా ఉనికే భారంగా ఉందా?

"హే అత్తా, కమాన్... మామకు వయసు రావటం ఏమిటీ? తను ఎప్పుడూ ఎవర్ గ్రీనే. నీకోటి తెలుసా... ఆమధ్య ఒక ఇంగ్లీష్ నటుడు తన డెబ్బైయ్యో ఏట మూడో పెళ్లి చేసుకున్నాడు. మామకు ఇంకా అంత వయసు రాలేదుగా!" అన్నాడు వంశీ నాకు కన్ను గీటి నవ్వుతూ.

"తెర మీద ఈయనకు అయినన్ని పెళ్లిళ్లు ఎవ్వరికీ అయ్యి ఉండవురా బాబూ! ఇప్పటికీ అవి చూసి మురుస్తారు!" మణి కంఠంలో విరుపు.

'నిజంగా తను అలా మాట్లాడుతోందా... నేను అనుకుంటున్నానా?' ఆలోచనలతోనే తినటం ముగించాను.

"మామా, నాకు టైమ్ అవుతోంది. సాయంత్రం మనం తీరుబడిగా మాట్లాడుకుందాము. చీరప్" అన్నాడు నా చెయ్యి మీద తట్టి. నేను ఉలిక్కి పడ్డాను.

'ఎప్పుడూ లేనిది 'చీరప్' అంటున్నాడు. నా మనసులోని మబ్బు తనకు తెలిసిందా?' నాలో ఆలోచన.

"ఓకే... బై మామా!" అంటూ వెళ్లిపోయాడు.

★★★

ఆ రాత్రి డిన్నర్ తరువాత 'నిద్ర వస్తోందంటూ' మణి, బెడ్‌రూమ్ లోకి వెళ్ళిపోయింది. నేను, వంశీ మాత్రమే మిగిలాము.

"మామయ్యా, ఏదన్నా మాట్లాడాలా?" మనసులో మాట కనిపెట్టినట్లు అడిగాడు. నాలో విస్మయం.

చిన్నప్పుడు తను వచ్చినప్పుడు, నా బిజీ షెడ్యూల్‌లో కూడా 'మామా, నీ రూమ్‌కి వస్తా... చూస్తా' అంటూ వెంటపడేవాడు. చివరకు, కాసేపు అన్నా ఆ రూమ్‌లో నాతో గడిపేవాడు.

"మామా, నువ్వు విలన్‌ని కొడితే కిక్ వస్తుందా? సినిమాలో ఏడుస్తూ యాక్ట్ చేస్తావు కదా. అప్పుడు నీ మనసులో బాధగా ఉంటుందా?" అంటూ ఎవ్వరి ఊహకు అందని రకరకాల ప్రశ్నలు వేసేవాడు.

'ఆ వయసులోనే, నటుడుగా నా మనోభావాలు గురించి ఆలోచించాడా?' నాలో కలుగుతున్న వివిధ ఆలోచనలను ప్రక్కకు పెడుతూ... "నా రూమ్‌లో మాట్లాడుకుందామా?" అన్నాను లేచి నుంచుని.

"అవును... అది నాకు కూడా ఇష్టమైన రూమ్" అంటూ నా వెనకే నడిచాడు!

★★★

ఈ మధ్య నా రూమ్ లోకి వెళ్ళటమే మానేశాను. కొన్ని నెలల తరువాత, వంశీతో కలిసి ప్రత్యేకంగా నాకోసమే నిర్మించుకున్న గదిలోకి అడుగు పెట్టాను.

గదిలో నేను నటించిన రకరకాల పాత్రల నిలువెత్తు చిత్రాలు. అందుకున్న అవార్డ్స్... ప్రశంసా పత్రాలు. ప్రముఖులతో తీయించుకున్న ఫోటోలు.

వాటినన్నిటినీ శ్రద్ధగా చూస్తూ "చాలా రోజులయ్యింది మామా మిమ్మల్ని, వీటిని చూసి. 'నా మామ అంటే ఇంత గొప్ప నటుడు' అని నాకు చాలా గర్వంగా ఉంటుంది!" వంశీ మొహంలో ఎప్పటిలాగానే నా నటన పట్ల ఆరాధన. వింటున్న నాకు, గత వైభవం గురించి ఏదో ఆనందం... తృప్తి!

కాసేపటి తరువాత "ఊ... ఇప్పుడు చెప్పండి, మామయ్యా!" అన్నాడు నవ్వుతూ.

'అమావాస్య నాడు వెన్నెలరేఖ తొంగి చూసినట్లుగా' నాలో ఓ వింత అనుభూతి. ఇన్నాళ్ళు ఉగ్గబట్టుకున్న ఒక్కో భావం వెల్లువై ఉరికింది. నా మనులోని వేదన, అప్పుడప్పుడు గొంతులో తొంగి చూస్తున్న ఆర్ధ్రత, నాకు అర్థమవుతూనే ఉంది.

అంతా ఓపికగా విన్న వంశీ, "మామా, ఏ నటుడైనా నీలాగనే భావిస్తాడు. అది సహజం!" అన్నాడు ఎంతో సౌమ్యంగా.

"నిజంగా?" అనుమానంగా అన్నాను.

"అవును మామా! తమ వృత్తి నుండి పదవీ విరమణ అయిన వారిలో ఎక్కువ మంది సర్వం కోల్పోయినట్లు భావిస్తారు. డిప్రెషన్‌కి గురవుతారు. అలాంటిది, ప్రముఖ నటుడిగా ఎంతోమంది ఆదరాభిమానాలతో, క్షణం తీరుబడి లేకుండా ఇన్నాళ్లుగా గడిపిన మీకు రిటైర్మెంట్ మరీ కష్టం!"

నా బాధను అర్థం చేసుకుంటున్నట్లు మాట్లాడుతున్న వంశీ మాటలు, నాకు సాంత్వన కలుగ చేస్తున్నాయి.

"కానీ 'జీవితం' అనే రంగస్థలం నుండే తప్పుకోవటం తప్పనప్పుడు, మరి వృత్తి అయిన రంగస్థలం నుండి... "

వంశీ మాటలు చురుక్కుమనిపించాయి.

"నువ్వు చెప్పింది నిజం. కానీ దానిని నేను ఆమోదించలేక పోతున్నాను అనిపిస్తోంది. నటనకు దూరమయ్యి బ్రతకటం కష్టంగా ఉంది. ఇప్పుడు నేను ఏమి చెయ్యాలి?" వంశీ మాటను కట్ చేస్తూ నిస్సహాయంగా అడిగాను.

"అది నటనైనా, జీవితమైనా ప్రతి దానికి ఆరంభమే కాదు ముగింపు కూడా ఉంటుంది మామయ్యా!"

"అదేగా చెప్పావు!" అసహనంగా అన్నాను.

"ఆ ముగింపు లోపు, మనం విజయాన్ని పొందటమే కాదు, ఆ అందుకున్న దానిని పంచాలి కూడా కదా!"

"అంటే దాన ధర్మాలనా... అవి చేస్తూనే ఉంటానుగా!"

"ఊహూ, అవి కాదు. నీ కిష్టమైన... ప్రాణమైన నటనని" అంటూ నవ్వాడు వంశీ.

'ఏం మాట్లాడుతున్నాడు? ముగిసిన నా కెరీర్ గురించి ఎగతాళా... నా ఆవేదన వాడికి అవహేళనా?" ఆ ఆలోచనతో నాలో ఒక్క ఉదుటున ఆవేశం పొంగింది. అణచుకోలేక... "ఏంటి వంశీ, నా మీద, నటన మీదా జోకా?" చర్రున అడిగాను.

"అయ్యో, సారీ. నా ఉద్దేశ్యం అది కాదు మామా... మీరన్నా, మీ నటన అన్నా నాకు అపార గౌరవం!" చటుక్కున నా చేతులు

పట్టుకుని నొచ్చుకుంటున్నట్లు అన్నాడు.

"మరి?" నా గొంతులో కరకుదనం తగ్గలేదు.

"నటన గురించి తర్ఫీదుని ఇచ్చే ప్రతిష్టాత్మకమైన 'యాక్టింగ్ అకాడమీస్'ఎన్నో ఉన్నాయి. మీరు 'ఊ' అంటే చాలు వాళ్ళు మిమ్మల్ని స్వాగతిస్తారు. అక్కడ మీ నటనలో అనుభవాల గురించి, విజయాల వెనుక కృషి గురించి స్టూడెంట్స్‌కు బోధించండి!"

అర్థం కానట్లు చూశాను.

"అవును మామా, వాళ్ళకి నటన గురించి బోధించటం ద్వారా, మీకు ఇష్టమైన నటన ఎప్పటికీ మీకు దూరం కాదు. మీరు ఎప్పటికీ మీ ప్రాణమైన నటనతో అనుసంధానమయ్యే ఉంటారు... ఆలోచించండి!" అన్నాడు.

'డా.వంశీ, సైక్రియాటిస్ట్' చెప్పిన మాటలు నా మనసును తాకాయి... నాలో ఉన్న కొండంత భారాన్ని దింపి, కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

"మీకోటి చెప్పనా... ఈ రోజు నేను సెషన్ తీసుకుంది, నటనా రంగంలో పైకి రావాలని కృషి చేస్తున్న స్టూడెంట్స్‌కి. నాలాంటి వారి కౌన్సిలింగ్‌తో పాటు, మీవంటి వారి పాఠాలు కూడా వారికి అవసరం అనిపించింది నాకు!" మృదువుగా చెప్పాడు వంశీ.

నాలో, 'తప్పిపోయిన బిడ్డ తిరిగి అమ్మ ఒడి చేరుతున్న' భావన. గబుక్కున లేచి వంశీని గాఢంగా కౌగిలించుకున్నాను!



9849989201

# నిన్నటిదాక శిలనైనా...

సుందరీ నాగమణి నందూరి

**సినిమా రంగ మార్తాండ కథల పోటీ 2023 లో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

*మాది కోనసీమలో ఓ పల్లె. గోదావరి వరదల్లో మా ఇల్లు కొట్టుకుపోయింది.*
*ఆ వరదల్లోనే గోదారి తల్లి మా నాన్నను కూడా పొట్టన పెట్టుకుంది. రాజమండ్రి వచ్చి నేను, మా అమ్మ, తమ్ముడు ఏవో పనులు చేసుకుంటూ ఉండిపోయాము. నేను పనిచేసే ఇంట్లో సినిమా షూటింగులు జరిగేవి. ఓపక్కన నిలబడి ఆ షూటింగ్‌లు చూస్తూ పెరిగాను. నాకు నటనంటే అలా ఇష్టం పెరిగింది.*
*రెండేళ్ళ క్రితం ఒక జూనియర్ ఆర్టిస్ట్ రాకపోతే ఒక చిన్న పాత్ర వేయమని నన్ను అడిగారు. నేను వేసాను. చెన్నై రమ్మని అడిగారు. మేమందరం వచ్చేసాం.*

"యువరాణీవారూ, తమరిని మహారాణీవారు రమ్మన్నారు! దేవాలయానికి వెళ్ళి పూజ జరిపించవలెనట..."

"ఎక్కడివాడో ఆతడు... నా స్వప్నమందు సాక్షాత్కరించాడు... ఎంతటి సౌందర్యవంతుడు... నా మనసు తస్కరించి వెడలిపోయినాడు... మల్లికా, అటువంటి..."

"కట్... కట్..."

ఒక్క ఉదుటున సెట్‌లోకి దూసుకువచ్చాడు దర్శకుడు రాజేంద్ర.

"అమ్మా! తప్పుగా పలుకుతున్నారు... 'ఎచ్చటివాడో ఆతడు... నా స్వప్నమందు సాక్షాత్కరించాడు... అతడెంతటి సౌందర్యవంతుడో... పున్నమి చంద్రునివంటి మోము... చెంపకు చారెడు కన్నులు... ఇట్టే కనిపించి, అట్టే మాయమైనాడు... నా మనసు తస్కరించి వెడలిపోయినాడు...' ఇంత డైలాగ్ ఉందమ్మా..."

"అంతంత పెద్దపెద్ద డైలాగులు పలకటం కష్టం డైరెక్టర్‌గారూ... త్వరగా కానీయండి, నాకు వేరే షూటింగ్‌కి టైమవుతుంది..." నిర్లక్ష్యంగా చెప్పింది హీరోయిన్ మాలిని.

రాజేంద్ర మనసు కుతకుతలాడిపోయింది.

"అలాకాదు, ఓసారి డైలాగ్స్ చదువుకొని మళ్ళీ ట్రై చేయండి, ప్లీజ్. అన్ని డైలాగులూ ఉంటే కానీ సీన్ పండదు..."

"సరే..." విసురుగా డైలాగ్స్ పేపరందుకుని, చదవటంలో మునిగింది మాలిని.

చెలికత్తె మల్లిక పాత్ర వేస్తున్న అలమేలు ఓపక్కన వినయంగా నిలుచుంది.

"షాట్ రెడీ సర్..."


"ఓకే... రెడీ... త్రీ టూ వన్... యాక్షన్!"

"యువరాణీవారూ, తమరిని మహారాణీవారు రమ్మన్నారు! దేవాలయానికి వెళ్ళి పూజ జరిపించవలెనట..."

'ఎచ్చటివాడో ఆతడు... నా స్వప్నమందు సాక్షాత్కరించాడు... అతడెంతటి సౌందర్యవంతుడో... పున్నమి చంద్రుని వంటి... పున్నమి చంద్రుని వంటి..." ఆ తరువాత డైలాగ్స్ గుర్తురాక తడబడిపోయింది మాలిని.

"కట్... కట్! అమ్మా... ఏం చెబుతున్నారు? మొత్తం డైలాగ్స్ వచ్చేదాకా షూటింగాపుదాం... సమయం తీసుకోండి." చెప్పాడు రాజేంద్ర.

"అదికాదు డైరెక్టర్ గారూ... మేడమ్ గారికి అంతంత పెద్ద డైలాగ్స్ చెప్పటం కష్టంగా ఉంది కదా... కొద్దిగా తగ్గించి రాస్తే..." మాలిని సెక్రటరీ వచ్చి చెప్పాడు.



రాజేంద్రకి ఒళ్ళు మండిపోయింది.

"ఆల్రెడీ తగ్గించానండి... ఇంకానా?" తగ్గు స్వరంతో విసుగ్గా అన్నాడు. తరువాత కాగితం అందుకుని ఒక రెండు డైలాగ్స్ తగ్గించి ఇచ్చాడు.

మళ్ళీ షూటింగ్ ప్రారంభమైంది.

మల్లిక పాత్రధారిణి అలమేలు తన డైలాగ్‌ని చెప్పగానే, "ఎక్కడివాడో ఆతడు... నా స్వప్నమందు సాక్షాచ్కరించాడు..." మొదలుపెట్టింది, మాలిని.

కోపంగా "కాట్..." అని అరిచాడు రాజేంద్ర. "అమ్మా, సాక్షాత్కరించాడు అనాలి... తప్పుగా చెబుతున్నారు..." అంటూ ఇంకా ఏదో అంటుండగానే తీక్షణంగా అతని వైపు చూసి, పక్కకు వెళ్ళిపోయింది మాలిని. షూటింగ్ కేన్సిల్ చేసి, కారెక్కి వెళ్ళిపోయింది.

"హూ... ఏమొచ్చు వీళ్ళకి? ఏమీ రావు... మళ్ళీ పెద్ద హీరోయిన్లు..." అతని చూపు అక్కడే నిలబడి తన డైలాగ్స్ మననం చేసుకుంటున్న అలమేలు పైన పడింది.

"ఏయ్, ఇటురా... ఏమిటి చెబుతున్నావు డైలాగులు? పలకటం రాకపోతే ఇంట్లో కూర్చోండి... యువరాణీ వారు అనటం రాదూ నీకు? చెత్తగా చెపుతున్నావ్ డైలాగ్స్..." కోపంగా కసిరి కొట్టాడు.

యూనిట్ సభ్యులంతా చూస్తుండగా పెద్ద గొంతుతో అరుస్తూ అన్న ఆ మాటలు ఎవరిని ఉద్దేశించి అన్నవో అందరికీ తెలిసినా,

డైరెక్ట్ గా అతను తనను ఉద్దేశించి కేకలు వేయటం అలమేలుకు చాలా బాధను కలిగించింది. అవమానంతో, తలవంచుకుని, కన్నీరు కార్చుతూ ఉండిపోయింది.

వెంటనే షూటింగ్ స్పాట్ నుంచి బయటకు వచ్చి కార్ స్టార్ట్ చేసి, అక్కడినుంచి వెళ్ళిపోయాడు రాజేంద్ర.

★★★

మరుసటి ఉదయం పదకొండు గంటలకు, "సార్... ఎవరో అమ్మాయి వచ్చింది, మిమ్మల్ని కలవాలట..." గేటు దగ్గర ఉండే సెక్యూరిటీ గార్డ్ వచ్చి చెప్పాడు.

"ఎవరు? సినిమా ఛాన్సుల కోసమేమో... నేను బిజీగా ఉన్నానని చెప్పి పంపించేయ్..." చిరాగ్గా అన్నాడు రాజేంద్ర.

"వినటంలేదు సార్... మీరు బిజీగా ఉన్నారని, ఎవరినీ కలవరనీ చెప్పినా, మొండిగా కలవాలని అంటోంది... రెండు నిమిషాలు మాట్లాడి వెళ్ళిపోతుందట..."

"సరే, పంపించు..."

"నమస్తే సర్..." తలెత్తి చూస్తే సాదాసీదా లంగా, ఓణీలో ఓ పద్దెనిమిది సంవత్సరాల అమ్మాయి.

"ఎవరమ్మా నువ్వు?" అతని భ్రుకుటి ముడిపడింది.

"లోపలికి వచ్చి కూర్చోవచ్చా సర్?" అతని సమాధానం కోసం ఎదురుచూడకుండానే వచ్చి సోఫాలో కూర్చుని ఉన్న అతని ఎదురుగా నేల మీద కూర్చుంది.

"నా పేరు అలమేలు సర్..."

"ఊ... అయితే? సినిమా వేషాల కోసమా?"

"కాదు... నేను ఆల్రెడీ నటిస్తున్నాను... నాకు మీ సహాయం వద్దు. కానీ ఓ విషయంలో మిమ్మల్ని... ఒకటి చెప్పండి, తప్పుచేయని వాళ్ళను తిడితే, ఆ తిట్లు తిన్నవారు తప్పనిసరిగా భరించాలా?" రోషంగా తల ఎత్తింది.

"ఏయ్ అమ్మాయ్, నువ్వు నా సమయం వృధా చేస్తున్నావు. బయటకు వెళ్ళు... రంగన్నా!"

"సర్... నిన్న మాలిని గారు డైలాగ్ తప్పుగా చెబితే నామీద ఎందుకు కోప్పడ్డారు?"

ఆమెను తేరిపార చూసి, ఫక్కున నవ్వాడు రాజేంద్ర. "ఓ... నువ్వా అమ్మాయ్? ఆ చెలికత్తె మల్లికవు కదూ? నువ్వుకూడా తప్పు చెప్పావు కదా..."

"ఉహూ... నేను తప్పు చెప్పలేదు, చెప్పనండి..."

"యువరాణీవారు అనటానికి యువరానీవారు అన్నావు... నేను విన్నానుగా..."

"కాదు... మీకు పెద్దవాళ్ళని అనటానికి ధైర్యం సరిపోక నన్ను తిట్టారు. నాకు తెలుసు..." ఉక్రోషంగా అంది అలమేలు.

“ఏయ్ అమ్మాయ్, అయ్యగారికి చాలా పనులుంటాయి... నీకిచ్చిన టైమూ అయిపోయింది... ఇక వెళ్ళు...” గదమాయించాడు రంగన్న.

“వెళ్ళిపోతాను... ఈ డైరెక్టర్ గారు ‘పొరపాటుగా అన్నానమ్మా’ అని చెబితే చాలు, వెళ్ళిపోతాను.”

రాజేంద్రకు నవ్వు వచ్చింది. గబుక్కున టీపాయ్ మీద ఉన్న సీసాలోంచి నీళ్ళు గ్లాసులోకి వంచుకుని తాగాడు.

“నన్ను సారీ చెప్పమంటున్నావు... నాలాంటివారితో పెట్టుకుంటే నీకు మరి ఛాన్సులు వస్తాయని అనుకుంటున్నావా?” అన్నాడు చిరుకోపంతో...

“రాకపోతే పోనీయండి... కానీ నా తప్పు లేకుండా అందరి ముందూ మీరు ఎందుకు కేకలు వేయాలి? అది నాకు నచ్చలేదు. మీ తప్పుకు క్షమాపణ చెప్పాలి... అంతే...”

“నువ్వు కూడా డైలాగ్ తప్పు చెప్పావమ్మా...”

“లేదు... చెప్పలేదు... నిజానికి మాలిని గారి డైలాగ్స్ కూడా తప్పులేకుండా చెప్పగలను తెలుసా?”

“అవునా? ఏదీ చెప్పు?”

లేచి నిలబడి, గాలిలోకి చూస్తూ, ఒక్క అక్షరం కూడా పొల్లుపోకుండా మాలిని డైలాగ్స్ అన్నీ ముఖంలో హావభావాలను పలికిస్తూ చక్కగా, తడబడకుండా చెప్పేసింది.

అప్రయత్నంగా తనూ లేచి నిలబడ్డాడు రాజేంద్ర. “ఎక్స్ట్రార్డినరీ... మార్వలెస్...” చప్పట్లు కొట్టి, ప్రశంసించాడు.

“సారీ అమ్మాయ్... మాలిని మీదున్న కోపం నిన్న నీ మీద చూపించాను, ఏమీ అనుకోకు... కాఫీ తాగుతావా? సుగుణా, కాఫీ తీసుకురా...” అని భార్యను పిలిచాడు.

“ఉహూ, తాగనండి... థాంక్స్, నేను వస్తాను...” గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోయింది అలమేలు.

ఆ తరువాత నుంచి షూటింగ్‌లో ఆమెను గమనిస్తూ ఉండేవాడు రాజేంద్ర. షెడ్యూల్ సమయానికన్నా ముందుగా వచ్చి, కాస్ట్యూమ్స్, మేకప్‌తో సిద్ధంగా ఉండేది అలమేలు. తన డైలాగ్స్ మననం చేసుకుంటూ కూర్చునేది.

ఆమె నటించిన సినిమాల పేర్లు తెలుసుకుని వాటిలో ఆమె పాత్రలను చూసి, గమనించసాగాడు. అన్నీ చిన్న చిన్న పాత్రలు. పనిమనిషి పాత్ర, జానపదాలైతే చెలికత్తె పాత్ర, రాజసభలో రాజుగారికి వీవన విసిరే పాత్ర, సాంఘిక సినిమాలలో బృందగానాలలో చిన్న చిన్న నృత్యాలలో కనిపించే పాత్రలు... ఇలాంటివే! కానీ ఇచ్చింది ఎలాంటి పాత్రనైనా చాలా ఒద్దికగా అభినయించటం అన్నది ఆమెలో గమనించాడు రాజేంద్ర.

మాలినితో తీస్తున్న ఈ ‘చంద్ర ప్రతాపుడు’ సినిమా పూర్తయేసరికి చుక్కలు చూసాడు రాజేంద్ర. ఇంకెప్పుడూ ఆమెను హీరోయిన్‌గా పెట్టి సినిమా తీయకూడదని ఒట్టేసుకున్నాడు.

★★★

ఒకరోజు జూనియర్ ఆర్టిస్ట్ సప్లయర్ రాఘవులు వచ్చి, రాజేంద్రగారు రమ్మన్నారని చెప్పగానే భయపడింది, అలమేలు. 'ఎందుకు పిలిచి ఉంటారో...' అనుకుంటూ ఆయన ఇంటికి వెళ్ళింది.

"రామ్మా అలమేలూ..." రాజేంద్ర సాదరంగా పిలిచాడు లోపలికి.

బిడియంగా తలవంచుకుని, నేలమీద కూర్చోబోయింది. "కాదు, అలా ఎదురుగా కూర్చో... నీతో కాస్త మాట్లాడాలి."

ఎదురుగా ఉన్న సోఫాలో ఒక అంచుకు ఒదిగిపోయి కూర్చుందామె. ఆరోజు పట్టుబట్టి సారీ చెప్పించుకున్నాక అతన్ని చూస్తే చాలు, అపరాధభావన కలుగుతున్నది. అందుకే మెల్లగా, "సార్, మీరు నన్ను క్షమించండి... ఉక్రోషంతో ఆరోజు మిమ్మల్ని నిలదీసాను... అది తప్పే... మీరు పెద్దవారు... అనదగినవారు... కానీ నేనలా చేసి ఉండకూడదు..." అన్నది చేతులు జోడించి.

"అరె, నువ్వు చేసిందే సరైనది. అకారణంగా మాటలుపడటం నాకూ ఇష్టం ఉండదు... సరేగానీ, నువ్వు ఇప్పుడు ఏమేమి సినిమాలు చేస్తున్నావు?"

"ఓ నాలుగైదు ఉన్నాయండి..." అని తన పాత్రల వివరాలు చెప్పింది అలమేలు.

"నీ గురించి కాస్త చెప్పు. ఇలా నటించాలని నీకెందుకనిపించింది?"

"మాది కోనసీమలో ఓ పల్లె. గోదావరి వరదల్లో మా ఇల్లు కొట్టుకుపోయింది. ఆ వరదల్లోనే గోదారి తల్లి మా నాన్నను కూడా పొట్టన పెట్టుకుంది. రాజమండ్రి వచ్చి నేను, మా అమ్మ, తమ్ముడు ఏవో పనులు చేసుకుంటూ ఉండిపోయాము. నేను పనిచేసే ఇంట్లో సినిమా షూటింగులు జరిగేవి. ఓ పక్కన నిలబడి ఆ షూటింగ్‌లు చూస్తూ పెరిగాను. నాకు నటనంటే అలా ఇష్టం పెరిగింది. రెండేళ్ళ క్రితం ఒక జూనియర్ ఆర్టిస్ట్ రాకపోతే ఒక చిన్న పాత్ర వేయమని నన్ను అడిగారు. నేను వేసాను. చెన్నై రమ్మని అడిగారు. మేమందరం వచ్చేసాం. తమ్ముడు స్కూల్లో చదువుకుంటున్నాడు. నేనిలా కుటుంబ పోషణ కోసం, నా మనసుకిష్టమైన పాత్రపోషణ చేస్తున్నాను. ఇదీ నా కథ..."

"మరి ఎప్పటికీ ఇలా చిన్న పాత్రలు చేస్తూనే ఉంటావా?"

"ఏమో... మంచిరోజులు రావా? ఎప్పటికీ ఇలానే ఉండిపోతానంటారా?"

"నువ్వేం చదువుకున్నావు?"

"ఏడవ తరగతి వరకూ చదివానండి. తెలుగు తప్పులు లేకుండా చదవగలను, వ్రాయగలను, మాట్లాడగలను..."

"నేను ఒక పెద్ద చిత్రం ప్లాన్ చేస్తున్నాను. నిన్ను హీరోయిన్‌గా అనుకున్నాను... చేస్తావా?"

అదిరిపడింది అలమేలు. "రాజేంద్ర సర్, జోక్స్ వేస్తున్నారా?"

"ఛ... నీతో జోక్స్ ఏమిటమ్మా? మాలిని పుణ్యమాని నాకు సినిమాలు తగ్గాయి. నేను లోబడ్జెట్‌లో ఓ సినిమా తీద్దామని నిర్ణయించుకున్నాను. అందులో నీకు నాయికగా అవకాశం ఇవ్వాలని అనుకుంటున్నాను. ఆ పాత్ర నీకు చాలా దగ్గరగా ఉంది. ఒక పేదమ్మాయి ఉద్యోగం కోసం పట్నం వచ్చి, ఎన్నో పాట్లు పడుతుంది. సంఘంలో పెద్దమనుషులుగా నటించే విషపురుగుల నుండి తప్పించుకుని ఒక చిన్న ఉద్యోగంలో చేరి, ఆ తరువాత ప్రైవేటుగా పైకి చదువుకుని, మరో పెద్ద

ఉద్యోగం సంపాదించుకుంటుంది, తన స్వయంకృషితో... మధ్యలో చాలా కష్టాలు, బాధలు, ఇబ్బందులు... ఇవన్నీ నీకు నటనాపరంగా చాలా ప్లస్ అవుతాయి. నీకు ఎదగటానికి ఓ మంచి అవకాశం... నాకూ నా కథకు, పాత్రకు సరియైన నటీమణి దొరుకుతుందని ఆనందం..."

"మీది సాహసం సార్. ఇండస్ట్రీలో ఎంతోమంది నన్నుమించిన నటీమణులు ఉన్నారు..." అంటూ ఏదో చెప్పబోయింది.

"ష్... అవేమీ చెప్పకు! సుగుణా! హీరోయిన్‌గారికి తాంబూలమిచ్చి పంపించు..."

సుగుణ వచ్చి, చిరునవ్వుతో అలమేలు చేయిపట్టి లోపలికి తీసుకువెళ్ళి, వెండిపళ్ళెంలో కొత్త పట్టుచీర, బ్లౌజు, తాంబూలం, పదివేల రూపాయలు క్యాష్ .. బొట్టుపెట్టి, ఆమె చేతుల్లో ఉంచింది.

అలమేలు కళ్ళలో గోదావరి వరదై పొంగింది. ఒక్కసారిగా సుగుణ పాదాలమీద పడిపోయి వెక్కివెక్కి ఏడ్చింది.

"అయ్యో, ఏమిటమ్మా ఇది? ఏమండీ, ఓసారిటు రండి..." కంగారుగా పిలిచింది సుగుణ.

"సార్... మీరు నిజంగా దేవుడు సర్... నేను నన్ను నేను నిరూపించుకుంటాను సర్... మీ నమ్మకం వమ్ము కానివ్వను..." కన్నీళ్ళతో అతని చేతులు పట్టుకుంది కృతజ్ఞతగా.

"సరే అలమేలూ... ఛ ఛ... ఇప్పుడు నీ పేరు అది కాదు. మిస్ మృదుల... బాగుందా?"

కళ్ళల్లో నీటి తడి తళుక్కుమంటూ ఉండగా నవ్వింది అలమేలు... కాదు... మృదుల.

★★★

పదేళ్ళ తరువాత ఓ రోజున –

తన స్నేహితురాలి పాత్ర పోషిస్తున్న ఆ జూనియర్ ఆర్టిస్ట్‌ని లంచ్ సమయంలో దగ్గరకు పిలిచింది మృదుల. ఆమె లంచ్ చేసిందో లేదో కనుక్కుంది. తన కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుంది. తనమీద ఆధారపడి ఉన్న వారి అవసరాలను అడిగి తెలుసుకుంది, సహాయం చేసేందుకు.

మిస్ మృదులాదేవి ఇప్పుడు పేరు పొందిన హీరోయిన్. రాజేంద్ర కూడా మంచి సినిమాలు తీసి, పేరు పొందిన దర్శకుల జాబితాలో చేరిపోయాడు. మృదులకు అతను దైవంతో సమానం. రాజేంద్ర దంపతులకు ఆమె ఇంటి ఆడపడుచుతో సమానం.

మృదుల సినీతారగా ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎన్ని పురస్కారాలు పొందినా ఒకప్పటి తన జీవితాన్ని మాత్రం మరువలేదు. రాజేంద్ర తనకిచ్చినట్టే, ఇప్పుడు ఎంతోమందికి కొత్తజీవితాలను ఇస్తున్న గొప్ప మహిళామణి ఆమె.



📞 9000206163

# స్క్రీన్ ప్లే

చాగంటి ప్రసాద్

**సినిమా రంగ మార్తాండకథల పోటీ 2023 లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

*ఈ 'క్యాచీ క్యాట్' ఫిల్మ్స్ చాలా పెద్ద సంస్థ! ఒక టీంగా ఫామ్ అయ్యి, సినిమాలు తీస్తున్నారు. ఆ సంస్థలో ఉన్నవాళ్ళ పేరే వెండితెర మీద ఉండాలి! బహుశా సోషియో మైథలాజికల్ సబ్జెక్ట్ ఎలా నడిపించాలో... ఆ రైటర్‌కి అవగాహన ఉండి ఉండదు. అది రాసే వాళ్ళు 'ఎవరా' అని ఆలోచిస్తే, మీరు దొరికారు. మీరు రాసిన స్క్రీన్ ప్లేని ఉపయోగించుకున్నారు. అంటే మిమ్మల్ని 'ఘోస్ట్ రైటర్'గా వాడుకున్నారు!"*

'గురువు గారూ నమస్తే!" అంటూ ఇంట్లోకి అడుగు పెట్టి సోఫాలో కూర్చున్నాడు నిర్మాత జంబూకేశం.

"ఎలా ఉన్నావు జంబూ? మంచినీళ్ళు త్రాగు" ఫ్రిజ్ తీసి చల్లటినీళ్ళు గ్లాసులో పోసిచ్చాను.

"బావున్నాను గురువుగారూ!" గడ గడ త్రాగి, గ్లాసు పక్కన పెట్టి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ అన్నాడు "మీ దగ్గరకు ఒక శుభవార్తతో వచ్చాను సర్".

"శుభం! చెప్పు జంబూ!"

"హీరో సాకేత్ మనకి కాల్ షీట్లు ఇస్తున్నాడు... 'సోషియో మైథలాజికల్' సబ్జెక్టు మీద మంచి కథ ఉంటే నటిస్తానని మాట ఇచ్చాడు!" సంబరపడుతూ చెప్పాడు.

"ఓహ్! అదృష్టవంతుడివి. అతను మంచి నటుడు, పెద్ద హీరో!" అన్నాను.

"'సోషియో మైథాలజికల్' జానర్‌లో కథలు రాసేవాళ్ళు చాలా తక్కువ మంది ఉన్నారు ఫీల్డ్‌లో! ఉన్న వాళ్ళలో కొందరికి వయస్సు సహకరించడం లేదు. మరి కొందరు అస్త్రసన్యాసం చేసేసారు. మీరు నాటక రచయితగా మంచి పేరు తెచ్చుకుని మన ఫీల్డ్‌కి వచ్చారు. అనుభవజ్ఞులు. ఈ మధ్య మీరు ఈ జానర్‌లో రాసిన సినిమాలు సూపర్ డూపర్ హిట్ కదా సర్! నా దగ్గర ఒక స్టోరీలైన్ ఉంది!" అంటూ కథ చెప్పి, "దీనికి డైలాగ్స్, స్క్రీన్ ప్లే రాసిపెట్టాలి. ఇది నా బ్యానర్లో గొప్ప సినిమాగా నిలిచిపోవాలి!" అన్నాడు.


"తప్పకుండా రాస్తా! ఎప్పటినుంచో అతనితో సినిమా తీయాలని కలలు కంటున్నావుగా... నీ పంట పండింది!" అన్నాను నవ్వుతూ.

"అవును సర్!" ముఖంలో ఆనందం కనబడింది.

ఇద్దరం మాటల్లో పడ్డాం. ఇంతలో హఠాత్తుగా ఒక యువకుడు ఇంట్లోకి ప్రవేశించాడు. సన్నగా ఉన్నాడు. ముక్కు సూటిగా ఉంది. కళ్ళు విశాలంగా ఉన్నాయి. జీన్స్ మీద తెల్లని కుర్తా వేసుకున్నాడు. వయస్సు ఇరవై ఐదు, ముప్పై మధ్యలో ఉండచ్చు.

"సర్... నమస్తే!" అంటూ జంబూకేశంని విష్ చేసాడు.

"ఓహ్! అప్పుడే వచ్చేసావా!" అంటూ అతన్ని నా ముందుకు తీసుకువచ్చాడు.



"గురూజీ! ఇతని పేరు చంద్రం. చిన్నపాటి రచయిత... మన యూనిట్ లోకి కొత్తగా తీసుకున్నాం. మీ దగ్గరే ఉండి, మీకు ఏ సాయం కావాలన్నా చూసుకుంటాడు. అలాగే ఎలా రాయాలో నేర్చుకుంటాడు!" అన్నాడు.

"నా దగ్గర ఎందుకోయ్... నాకు నా అసిస్టెంట్ రాఘవ ఉన్నాడు!" అన్నాను ఇష్టం లేనట్టు.

"అలా అనకండి గురువుగారూ! జస్ట్ ఈ సినిమా వరకు మీ చేతి క్రింద ఉంటాడు. మీలాంటి పెద్ద రచయితల దగ్గర ఉంటే అతనికీ కాస్త పని తెలుస్తుంది!" అని బతిమాలాడు.

మరీ వద్దంటే ఫీల్ అవుతాడని, ఏం అనలేక, "సర్లే!" అన్నాను.

"ప్రభాకర్ సార్ డైలాగ్స్, స్క్రీన్ ప్లే రాయడంలో దిట్ట. ఎలా రాయాలో సార్ దగ్గర నేర్చుకో!" అన్నాడు.

అతను హఠాత్తుగా నా కాళ్ళకి నమస్కరించాడు. నేను వెనక్కి లాక్కుని, అతని భుజం తట్టాను.

"వస్తాను గురువు గారూ!" అంటూ నిష్క్రమించాడు జంబూకేశం.

★★★

జంబూకేశం చెప్పిన కథకు `మాయాలోకం` అని పేరు పెట్టాం! పాత్రల రూపకల్పన, ప్రతీ సీనుకి సంబంధించిన డైలాగ్స్, నా పర్సనల్ అసిస్టెంట్ రాఘవతో కలిసి చర్చిస్తూ రాస్తున్నాను! దాని వలన కథనంలో లోటు పాట్లు బాగా తెలుస్తాయి. చంద్రం మా పని తీరు శ్రద్ధగా గమనిస్తున్నాడు. కొంత విశ్రాంతి తర్వాత, మళ్ళీ కూర్చున్నాము. కథనంలో కొన్ని చోట్ల హీరో పాత్ర, యముణ్ణి టీజ్ చేస్తూ రాసిన సీన్స్, నా మనసుని కాస్త బాధ పెట్టాయి. వ్యక్తిగతంగా నాకు పౌరాణిక కథలను సోషియో ఫాంటసీగా మార్చి రాయడం ఇష్టం ఉండదు. కాని తప్పదు.

ఆలోచనలో ఉండగా…

"గురువుగారూ! ఇప్పటి వరకు మనం చర్చించుకుని రాసిన కథా భాగానికి స్క్రీన్ ప్లే మొదలెడితే, మనకి టైము కలిసి వస్తుంది కదా సార్!" అన్నాడు చంద్రం.

అతని మాటకి తల ఊపుతూ, "ఇంటికి వెళ్లలేదా… ఇప్పటికే చాలా పొద్దు పోయింది!" అన్నాను జాలిగా అతనికేసి చూస్తూ!

"ఇంటిలో ఎవరూ లేరు సార్! అయినా ఈ పని పూర్తి అయ్యే వరకు నాకు నిద్ర పట్టదు!" అన్నాడు.

అతని శ్రద్ధకి ముచ్చట వేసింది. రాఘవ కూడా ఉంటే బావుణ్ణు, నిద్రకి ఆగలేక వెళ్ళిపోయాడు పాపం!

"సర్ మొదలు పెడదామా?" అంటూ, నా ఆలోచనలకి అడ్డు తగిలాడు.

"ఓకే ఓకే" అంటూ ఇద్దరం తెల్లవారే వరకూ కూర్చుని కొన్ని సీన్లు పూర్తి చేశాము.

చేతిలో కాలుతున్న సిగరెట్ ఆఖరి దమ్ము గుండెల్లోకి ఒకసారి లాగి,దాన్ని యాష్ట్రేలో పడేసాను. 'మంచి కాఫీ గొంతులో పడితే బావుంటుందిప్పుడు…' మనసులో అనుకున్నాను. అనుకున్న మరుక్షణమే, చంద్రం అక్కడున్న ఫ్లాస్క్‌లో కాఫీని కప్పులో పోసి చేతికి ఇచ్చాడు.

"నాకిప్పుడు కాఫీ త్రాగాలని ఉందని నీకెలా తెలిసింది?" అడిగాను ఆశ్చర్యంగా.

"ఇప్పుడు టైము ఏడు అయ్యింది సర్. మీకు కాఫీ టైము కదా, అందుకే మీరు బాత్‌రూమ్‌కి వెళ్ళినప్పుడు బయటకి వెళ్ళి తెచ్చాను సర్!" మెచ్చుకోలుగా అతని వంక చూశాను.

కాఫీ త్రాగి, సిగరెట్టు ముట్టించి రాయడం కొనసాగించాను.

క్రమేపీ ప్రతీ సీను బాగా పండుతోంది. నెమ్మది నెమ్మదిగా చంద్రం కూడా తన ఆలోచనలు, ఐడియాలు నాతో పంచుకోవడం వల్ల సీన్లన్ని అద్భుతంగా వస్తున్నాయి!

రాఘవ తల్లికి ఒంట్లో నలత చేసిందని, ఆమెని చూడడానికి స్వంత ఊరికి వెళ్ళాడు. ఆ సమయంలో చంద్రం నాకు మరింత దగ్గరయ్యాడు. నేను ఆలోచనల్లో మునిగి పోయి, రాసిన పేపర్లను పక్కన పడేస్తాను. తర్వాత వెతుక్కోవడం పెద్ద దురలవాటు నాకు. వాటిని చంద్రం శ్రద్ధగా జాగ్రత్త పెడుతున్నాడు.

"స్క్రిప్ట్ ఎంత వరకు వచ్చింది? చాలా అర్జంట్ గురువుగారూ" అంటూ మాటి మాటికి ఫోన్ చేయడమో, మనిషితో కబురు పంపడమో చేస్తున్నాడు జంబూకేశం!

త్వరగా పూర్తి చెయ్యాలని అహోరాత్రులు పనిచేసాం. చంద్రం నన్ను నిద్రపోనివ్వకుండా, 'గురువుగారూ! ఈ సీన్ ఇవ్వాళ పూర్తి చేద్దామా...' అంటూ వెంట పడుతున్నాడు. చిట్ట చివరకు, నేను రాసిన మొత్తం స్క్రిప్ట్ మళ్ళీ బయటకి చదివి ఇద్దరికీ వినిపించాను. ఎక్కడైనా కథనం నచ్చక పోతే, మళ్ళీ తిరగ రాసి, మెరుగు పరచాను. `గరికపోచని ప్రసవించడానికి భూమాత ఎంత ప్రసవ వేదన పడుతుందో, ఒక రచయిత ఒక కథావాక్యం రాయడానికి అంత కష్ట పడతాడు`... అన్నఒక కవిగారి మాటలు గుర్తుకువచ్చాయి. చివరకి తను పడిన కష్టాన్నంతా మర్చిపోయి, పసికందుని గుండెలకి హత్తుకుని ఒక తల్లి ఎలా ఆనందిస్తుందో అలాంటి అనుభూతి కలిగింది నాకు, పూర్తయిన స్క్రిప్ట్ చూసే సరికి!

"మీ ఇద్దరి సహకారం లేకపోతే సమయానికి పూర్తి చేయలేక పోయేవాడిని..." అంటూ రాఘవని, చంద్రాన్ని అభినందించాను.

"ఇంక నాకు సెలవిప్పించండి సర్!" అంటూ మా ఇద్దరికీ ధన్యవాదాలు తెలిపి చంద్రం వెళ్ళిపోయాడు.

`మాయాలోకం` కథ ఎప్పుడు సెట్స్ మీదకు వెడుతుందా? నా ఖాతాలో సూపర్ హిట్ క్రెడిట్ ఎప్పుడు పడుతుందా? అని ఆతృతగా ఎదురు చూస్తున్నాను. వారాలు, నెలలు గడిచిపోయాయి. జంబూకేశం పత్తా లేదు. తయారైన స్క్రిప్ట్ తీసుకెళ్లడానికి రాలేదు. ఆఖరికి ఉండబట్టలేక నేనే ఫోన్ చేశాను. ప్రొడక్షన్ ఆఫీసులో ఫోన్ ఎత్తినతను జంబూ లేదని చెప్పాడు. చంద్రంకి వివరం తెలుస్తుందని ఫోన్ చేస్తే, అవుట్ ఆఫ్ సర్వీస్ అని వచ్చింది.

చాలా రోజుల తర్వాత జంబూ వచ్చి నన్ను కలిసాడు.

"ఏమైపోయావయ్యా? మనిషి చేత కబురు పంపిద్దామంటే ఎక్కడ ఉన్నావో తెలియదు. ఎన్నిసార్లు మీ ఆఫీసుకు ఫోన్ చేసినా నువ్వు లేవనే చెప్తున్నారు!" సందేహంగా అతని మొహంలోకి చూస్తూ అడిగాను.

"కొద్దిగా బిజీగా ఉండి కలవలేకపోయాను. దానికి తగ్గట్టు ఫైనాన్షియర్లతో ఇబ్బంది సర్!" `ఉష్` మంటూ నిట్టూరుస్తూ, సోఫాలో కూలబడ్డాడు.

కాసేపు మా మధ్య నిశ్శబ్దం నాట్యం చేసింది. కొంత సేపటికి గొంతు సవరించుకుని, "గురువుగారూ! నన్ను క్షమించండి!" అంటూ ఉపోద్ఘాతం మొదలు పెట్టాడు.

"ఎందుకు? దేనికి?" అడిగాను అర్థం కాక.

"మనం ఈ సినిమా చేయడంలేదు సర్! హీరో సాకేత్ కాల్షీట్స్ వేరే వాళ్ళకి ఇచ్చేశాడుట!" బాంబు పేల్చాడు.

"అదేంటి... కాల్షీట్స్ నీకే ఇస్తాడని చెప్పేవు కదయ్యా? నన్ను ఊపిరి కూడా తీసుకోనీయకుండా స్క్రిప్టు కోసం అంతెందుకు కంగారు పెట్టి రాయించావ్?" అన్నాను కోపాన్నిదిగమింగుకుంటూ.

"ఏం చేస్తాం గురువు గారూ... పెద్దవాళ్ళతో ఏం గొడవ పడతాం? వదిలేయండి సర్! మీ శ్రమ మాత్రం నేనుంచుకోను!" అంటూ నాకివ్వవలసిన పారితోషికం ఇచ్చేశాడు. చాలాసేపు, ఇండస్ట్రీలో చిన్న, పెద్ద తేడాలు, గ్రూపు రాజకీయాలు ఏకరువు పెట్టాడు.

నేను కూడా ఏమీ అనలేక "సర్లే ఏం చేస్తాం? త్వరలో మరో సినిమా మీద కూర్చుందాంలే" అని అతన్ని సాగనంపి ఇంట్లోకి వచ్చేశాను. క్రమేపీ ఆ సినిమా గురించి మర్చిపోయా!

రోజులు, నెలలు, సినిమా రీళ్ళలా గిర్రున తిరిగాయి.

★★★

ఆ రోజు ఆలస్యంగా నిద్రలేచి డ్రాయింగ్ రూంలోకి నడిచాను. `క్యాచీ క్యాట్`ఫిల్మ్స్... అనే చాలా పెద్ద సినిమా సంస్థ వాళ్ళ 'భువర్లోకం' అనే ప్రీమియర్ షో ఇన్విటేషన్ చేతులో పెట్టాడు రాఘవ.

"తప్పకుండా వెడదాం!" అన్నాను.

ప్రీమియర్ షో మొదలైంది! సినిమా చూస్తున్నంత సేపూ ఇద్దరం ఒకరి మొహాలొకళ్లం చూసుకుంటూనే ఉన్నాం. సినిమాలో చాలా సీన్లు నేను రాసినవే. కాని `కాపీ` అని తెలియకుండా, తెలివిగా అక్కడక్కడ కొన్ని మార్చి జాగ్రత్త పడ్డారు రచయిత, దర్శకుడు! మెదడు మొద్దుబారి పోయింది. నేను అపురూపంగా దాచుకున్న ప్రియాతి ప్రియమైన విలువైనదేదో నా దగ్గర నుండి లాక్కున్నట్టుగా గిలగిలలాడిపోయింది మనసు! కోపం, బాధ, దుఃఖం గుండెల్లోంచి తన్నుకొస్తున్నాయి. నిగ్రహించుకున్నాను. అప్రయత్నంగా కన్నీళ్ళు వచ్చాయి. అది కనిపెట్టిన రాఘవ నా చేతికి కర్చీఫ్ ఇచ్చాడు. సినిమా అయిపోయింది. అందరూ హీరోని, దర్శకుణ్ణి, రైటర్‌ని చుట్టుముట్టి అభినందిస్తున్నారు.

నా నిస్సహాయతకి నన్ను నేనే నిందించుకుంటూ ప్రివ్యూ థియేటర్ లోంచి బయటకి వచ్చేశాను. జరిగిన అన్యాయానికి కడుపు మండిపోతోంది! బయట చంద్రం భుజం మీద చేయి వేసి, పక పక నవ్వుతూ కనిపించాడు జంబూకేశం!

దగ్గరకు వెళ్ళి, "వెన్ను పోటు పొడిచారు కదయ్యా, ఛీఛీ!" అని కోపంగా మొహం మీదే అనేసి,వేగంగా ఇంటికి వచ్చేశాం ఇద్దరం.

"నిర్మాతల మండలిలో ఫిర్యాదు చేద్దాం గురువుగారూ!" అన్నాడు రాఘవ.

"వృథా ప్రయాస! ఏమని చేస్తాం? మన సీన్లనే కాపీ చేసినా, అవి మనవి అని మనం నిరూపించుకోలేం! కంప్లయింట్ చేసినా నిలబడదు. వాళ్ళు కథని రిజిస్టర్ చేసి ఉంటారు, మనం చేయలేదు కదా! కాబట్టి ఆ కథ, స్క్రీన్ ప్లే నావే అని దబాయిస్తాడు రచయిత. కొండని ఢీ కొట్టలేం!" అన్నాను నిరాశగా.

"గుడ్డిలో మెల్ల. డబ్బులు ఎగ్గొట్టలేదు జంబూగాడు" అన్నాడు రాఘవ.

"డబ్బు ఇవ్వాళుంటుంది, రేపు పోతుంది. పేరు శాశ్వతం. నాకదే ముఖ్యం!" నిస్సత్తువగా సోఫాలో కూర్చుండిపోయాను.

"కథ కొట్టేయడానికి ఇంతలా ఎందుకు ప్లాన్ చేశారో అర్థం అవ్వడం లేదు రాఘవ!" అన్నాను.

"సింపుల్ గురువు గారూ! ఈ `క్యాచీ క్యాట్` ఫిల్మ్స్ చాలా పెద్ద సంస్థ! ఒక టీంగా ఫామ్ అయ్యి, సినిమాలు తీస్తున్నారు. ఆ సంస్థలో ఉన్నవాళ్ళ పేరే వెండితెర మీద ఉండాలి! బహుశా సోషియో మైథలాజికల్ సబ్జెక్ట్ ఎలా నడిపించాలో... ఆ రైటర్‌కి అవగాహన ఉండి ఉండదు. అది రాసే వాళ్ళు 'ఎవరా' అని ఆలోచిస్తే, మీరు దొరికారు. మీరు రాసిన స్క్రీన్ ప్లే ని ఉపయోగించుకున్నారు. అంటే మిమ్మల్ని `ఘోస్ట్ రైటర్`గా వాడుకున్నారు. వాళ్ళ పేరు వేసుకున్నారు. వాళ్ళు మీ మీద అల్లిన స్క్రీన్‌ప్లేకి జంబూగాడ్ని `ట్రంపుకార్డు`గా వాడారు. ఎంత దారుణమైన వ్యూహం అల్లారు!" అంటూ టేబుల్ మీద ఉన్న `భువర్లోకం` ప్రీమియర్ షో ఇన్విటేషన్‌ని చింపి ముక్కలు ముక్కలు చేసి డస్ట్‌బిన్‌లో పడేసాడు కోపంగా!

"మరి మన సీన్లు ఎలా కాపీ కొట్టారు? అంత త్వరగా ఎలా సినిమా తీసేశారు?" అన్నాను అర్థం అవ్వక.

"అయ్యో గురువు గారూ... మీరెంత అమాయకులు సార్! మీ పక్కనే ఉంటూ అతి వినయంగా నటిస్తూ `మీ ప్రియ శిష్యుడు చంద్రం` ఎప్పటికప్పుడు సీన్లు వాళ్ళకి చేరవేసి ఉంటాడు వాళ్ళకి టైము వేస్ట్ అవ్వకుండా!"

'ఎంత చాలా తెలివిగా స్కెచ్ ప్లాన్ చేసారు! ఇంత సీనియర్ అయిన నన్నే బోల్తా కొట్టించారు. కొత్తగా ఫీల్డ్ కి వచ్చే రచయితలు కథలు పట్టుకుని వస్తే, వాళ్ళ పరిస్థితి ఏంటో పాపం?' బుర్ర తిరిగిపోయింది నాకు.

"ఇందులో జంబూకేశం కి ఏంటి లాభమో అర్థం కావడం లేదు సర్?" అన్నాడు రాఘవ సాలోచనగా.

"ఆ హీరోగారి డేట్లు కావాలంటే, ఆ పెద్ద దర్శకుడి మెప్పు పొందాలి. ఆ తర్వాత ఆ దర్శకుడి దర్శకత్వంలో ఆ హీరోతో సినిమా తియ్యాలి. అందుకని తను రాసుకున్న స్క్రీన్ ప్లేలో నన్ను బలి చేశాడు!" అన్నాను బాధగా.

"ఆ... ఎంత మోసం చేశాడు జంబూకంగాడు!" నోరు తెరుచుకుని స్థాణువులా ఉండిపోయాడు రాఘవ.

ఇది జరిగిన చాలా కాలం తర్వాత... "ఇది విన్నావా రాఘవా! ఆ ప్రముఖ దర్శక, హీరోలు జంబూకేశానికి హ్యాండ్ ఇచ్చారుట పాపం! ఇప్పటికీ వాళ్ళ చుట్టూ తిరుగుతున్నాడుట. ఇదీ దేవుడు రాసిన స్క్రీన్ ప్లే!" అంటూ నవ్వాను.



# ఇచ్చుటలో ఉన్న హాయి

డా. మజ్జి భారతి



9440615206

***'ఇచ్చుటలో ఉన్న హాయి వేరెచ్చటనూ లేదోయ్' అని ఓ మహానుభావుడు అననే అన్నాడు.***
***ఆ మాటలు అక్షరాలా పాటిస్తూ, ఉన్న దాంట్లోనే నలుగురికి పెడుతూ, ఆస్తి కూడబెట్టకపోయినా ఆప్యాయతల మధ్య వర్ధనమ్మ చాలా హాయిగా ఉంది. పిల్లలు బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సంపాదించుకున్నారు. వాళ్లను చూసి మంచి సంబంధాలే వచ్చాయి.***
***పిల్లలే కాదు అల్లుడు, కోడలు కూడా ఆమెకు చాలా మర్యాద ఇస్తారు. ఇప్పటికైనా మించిపోయింది లేదు.***

"స్వాతీ, అపార్ట్‌మెంట్ తీసుకుంటామన్నారు. ఏమైంది? ఎంతవరకు వచ్చింది? ఏమన్నా చూస్తున్నారా?"

"ఆ విషయమే నీతో మాట్లాడదామని వచ్చానమ్మా"

పెరట్లో నుండి లోపలికి వెళ్ళబోతూ పక్కింటి వర్ధనం, వాళ్ళమ్మాయి స్వాతి మాటలు వినిపించి ఆగిపోయింది సుందరి. తనకులాగే వర్ధనమ్మకు కూడా ఒక కొడుకు, కూతురు. స్వాతి కూడా తన కూతురు శ్యామలలాగే ఇల్లు అమ్మమని అడగడానికి వచ్చిందా అన్న సందేహం కలిగింది సుందరికి.

ఎప్పుడో ముప్పయ్యేళ్ల క్రిందట పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు చౌకగా దొరికిందని ఈ స్థలం కొని, నెమ్మది నెమ్మదిగా ఇల్లు కట్టించుకున్నారు తాము, వర్ధనమ్మవాళ్లు. తన భర్త, వాళ్ళాయన ఆఫీసులో కొలీగ్స్. ఒకేసారి ఉద్యోగంలో జాయిన్ అయ్యారు. చెప్పుకోకూడదుగాని, తన భర్తకు పై సంపాదన ఎక్కువ. అందుకని ఏ రోజూ డబ్బుకి తడుముకోవాల్సిన అవసరం రాలేదు. పాపం వర్ధనమ్మ వాళ్ళాయనే, మడి కట్టుకొని జీతం రాళ్లతోనే కుటుంబాన్ని పోషించుకున్నాడు. తమ సంపాదన పెరిగిన కొద్దీ తమ ఇంటికి కూడా కొత్తగా గదులు, కొత్త హంగులు చేరి, నాలుగు బెడ్‌రూముల ఇల్లు అయింది. ఏవైనా ఫంక్షన్స్ అయినప్పుడు అందరూ వస్తారని పైన కూడా రెండు గదులు వేశారు. వర్ధనమ్మ వాళ్ళది మాత్రం ముందున్న సింగిల్ బెడ్‌రూముకి తోడుగా ఇంకొక బెడ్‌రూమ్ వేశారంతే. తన భర్త ఉన్నప్పుడే, కొడుకుకి రెవెన్యూ శాఖలో ఉద్యోగం వేయించారు. వాడిప్పుడు ఎమ్మార్వోగా ప్రమోషన్ తీసుకొని రెండు చేతులా సంపాదిస్తున్నాడు. బాగా కట్నమిచ్చి మంచి ఉద్యోగం చేస్తున్న అల్లుడిని కొన్నారు. అతగాడూ బాగానే సంపాదిస్తున్నాడు. ఇద్దరికీ డబ్బుకు లోటు లేదు. ఇప్పుడు వాళ్ళిద్దరి కళ్ళు తనుంటున్న స్థలం మీద పడింది. ఆ స్థలం డెవలప్మెంటుకి ఇచ్చేస్తే ఐదు అపార్ట్మెంట్స్ వస్తాయి. నువ్వొక అపార్ట్‌మెంట్లో ఉండొచ్చు. మిగిలిన వాటికి అద్దెలొస్తాయి. చెరొక రెండూ తీసుకుంటామని కొడుకు, కూతురు ప్రపోజ్ చేశారు. తనకు సుతరామూ ఇష్టం లేదు!

ఆ విషయం అలా పక్కన పెడితే, ఇప్పుడు ఇంకొక సమస్య వచ్చేటట్లు ఉంది.

"తలకొరివి పెట్టాల్సిన కొడుకుతో సమానంగా కూతురికి ఆస్తి ఎలా ఇస్తారు?" అని కోడలిని ఎగదోస్తుందట వియ్యపురాలు.

"అన్నయ్యతో సమానంగా నాకివ్వకపోతే, ఇక నాకు పుట్టిల్లు లేదనుకుంటాను!" అని మొన్ననే వచ్చిన కూతురు చెప్పి వెళ్ళింది.

ఇక కొడుకు... వారం రోజుల్లో వస్తానని కబురు పెట్టాడు. వాడి ఆలోచన ఎలా ఉందో మరి?

ఇప్పుడు స్వాతి కూడా అదే పని మీద వచ్చిందా! చిన్నప్పటినుండి స్వాతిని, వాళ్ళన్నయ్య కిషోర్‌ని చూసి వాళ్లు అలా అడిగి ఉండరనిపిస్తున్నా, 'ఏమో! రోజులు మారిపోతున్నాయి. ఎప్పుడు ఎవరికి ఎలాంటి బుద్ధి పుడుతుందో ఎలా చెప్పగలం? స్వాతి, కిషోర్ అడగకపోవచ్చు. కానీ స్వాతి వాళ్ళాయన, కిషోర్ వాళ్ళావిడ తన కొడుకు, కూతురులాగే ఆలోచించవచ్చు కదా?' అందుకని ఒక చెవి అటే వేసి అక్కడే నిల్చుంది సుందరి!

స్వాతి, వర్ధనమ్మల మాటలు వినిపిస్తున్నాయి.



"చెప్పవే?"

"అదేనమ్మా! సిటీలో ఎంత చిన్నదైనా టూ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్ అంటే ఏభై లక్షలకు తక్కువవదు..." ఆగింది స్వాతి.

"అయితే ఏం చేద్దామని?"

"అదేనమ్మా! అన్నయ్య కూడా ఇల్లు కట్టించుకోవాలనుకుంటున్నాడు కదా. వాడికి ఒక ఏభై లక్షలవుతుంది..." మాట పూర్తి చేయలేదు స్వాతి.

'ఇంకేముంది ఆ స్థలం అమ్మమని అడగడానికి వచ్చుంటుంది. నాన్చడమెందుకు? అడిగేస్తే సరిపోతుంది కదా!' మనసులో అనుకుంది సుందరి.

"మరి సిటీలో అపార్ట్మెంట్ అంటే ఆ మాత్రం అవుతుంది మరి. పోనీ ఈ స్థలం అమ్మేద్దామా? మీ ఇద్దరికీ కొద్దిగా వెసులుబాటవుతుంది." స్థలం అమ్మేద్దామన్న వర్ధనమ్మ ఆలోచన విని, సుందరి ఆశ్చర్యపోయింది. వర్ధనమ్మకు భర్త తాలూకు ఫించను, ఉంటున్న ఈ ఇల్లు తప్పించి వేరే ఆస్తిపాస్తులు లేవు తనకు లాగ.

"అమ్మా! ఈ స్థలం అమ్మాలన్న ఆలోచన కూడా రానీయకు. ఒకవేళ ఎవరైనా నిన్ను ఈ స్థలం గురించి అడిగితే మా పిల్లలకు ఇష్టం లేదని చెప్పు!" స్వాతి సమాధానం విని ఆశ్చర్యపోయింది సుందరి.

"ఎందుకే! ఇంత స్థలం ఖాళీగా ఉంది. ఏమి చేసుకుంటాం? అమ్మి ఆ వచ్చిన డబ్బులిద్దరూ పంచుకొని చక్కగా అపార్ట్‌మెంట్లు కట్టించుకోండి. రాను రాను రేట్లు పెరిగిపోతున్నాయి. లేటు చేస్తే కొనుక్కోవడం కష్టమవుతుంది!"

"అమ్మడం ఎందుకమ్మా? మంచి పూలతోట వేశావు. ఆ మొక్కల్ని చూస్తూ, ఇద్దరమూ ఎంత బాగా ఎంజాయ్ చేస్తున్నామో చూడు. అదీకాక, ఆ పిల్లలు కూడా అప్పుడప్పుడొచ్చి ఆడుకుంటున్నారు!" పిల్లలన్న మాటవిని ఉలిక్కిపడింది సుందరి.

'ఏకగర్భాన పుట్టినవాళ్లే ఒకరి గురించొకరు ఆలోచించడం లేదు. అటువంటిది, వాళ్లకోసం కూడా ఆలోచిస్తుందా స్వాతి?' ఆలోచనలో పడింది సుందరి.

'ఆ పిల్లలంటే...' అనాథాశ్రమం పిల్లలు. వర్ధనమ్మ మధ్య మధ్యలో అనాథాశ్రమానికి వెళ్లి కొన్ని గంటలు గడిపి వస్తుంది. అక్కడేమి చేస్తుందో మరి? తను విన్నదైతే, వర్ధనమ్మ అక్కడ వారికి వంటలో సాయం చేస్తుందని. తనెప్పుడూ అడగలేదు. అక్కడి పిల్లలు ప్రతి ఆదివారం వచ్చి ఆడుకుని వెళ్లిపోతారు. వాళ్ళ నవ్వులు, కేరింతలు విని.... అప్పుడప్పుడు తనకూ అనిపిస్తుంటుంది, తన ఇంటికి కూడా పిలుద్దామా అని. కానీ తన ఇంటినిండా ఖరీదైన వస్తువులు. పొరపాటున వాళ్ళ ఏ కాలో, చెయ్యో తగిలితే... అమ్మో... అని ఆ ఆలోచనను విరమించుకొని, తనే అప్పుడప్పుడు పక్కింటికి వెళ్ళేది, వాళ్లొచ్చినప్పుడు! అంతవరకు సరదాగా ఉన్నవాళ్లు, తనను చూసి ఆగిపోయేవాళ్ళు. అందుకే వెళ్లడం మానుకొని, ఈ గోడ దగ్గర కూర్చొని వాళ్ళ మాటలను వింటూ ఉంటుంది ఆ కాస్సేపు.

"అయితే మరేం చేద్దామంటావు?" అడిగింది వర్ధనమ్మ.

"అన్నయ్య ఉన్న ఊర్లో ఓ నలభై లక్షలకు స్థలం కొని, ఇంకో ఏభై లక్షలు పెడితే రెండంతస్తుల ఇల్లు కట్టుకోవచ్చు. ఇద్దరమూ ఒకే దగ్గర ఉండవచ్చు. నాకు ఎలాగూ వర్క్ ఫ్రం హోమే. విష్ణు అక్కడికి ట్రాన్స్ఫర్ చేయించుకుంటే సరిపోతుంది. నువ్వేమంటావమ్మా?"

"ఇద్దరూ ఒకే దగ్గర ఉంటే బాగుంటుంది. కానీ విష్ణు ఆలోచనేమిటో అడిగావా?"

"ఇంత మంచి ఆలోచన మనకి ముందెందుకు రాలేదన్నారమ్మా ఆయన!"

"మీ ఇద్దరికీ ఓకే అవ్వచ్చు. విష్ణు వాళ్ల అమ్మానాన్న ఏమంటారో అడిగారా?" సాలోచనగా అంది వర్ధనమ్మ.

"మంచి ఆలోచన. మీ అమ్మగారిని మీ ఇద్దరూ కలిసి చూసుకోవచ్చు, అన్నారమ్మా మా అత్తగారు!" ఆనందంగా చెప్పింది స్వాతి.

గోడ యివతల నుండి వింటున్న సుందరి ఆశ్చర్యపోయింది... వియ్యంకులు ఇలా కూడా ఆలోచిస్తారా? తన వియ్యంకులూ ఉన్నారెందుకు! తన ఆస్తి... ఆస్తంతా తన పేరునే ఉంది. మొత్తం కొడుకుకే దక్కాలని కోడలి తండ్రి, కూతురికీ సగం వాటా ఉండాలని అల్లుడి తండ్రి లోపాయకారీగా రాయబారాలు చేస్తూ, తన పిల్లల మధ్య గొడవలు పెడుతున్నారు. అయినా వాళ్లననే పనేముందిలే? మొన్నటి వరకు తనూ అలాగే ఆలోచించేది కదా? డబ్బుంటే చాలు, అన్నీ కాళ్ళ దగ్గరకి వస్తాయని... తన కళ్ళూ నెత్తిమీదే ఉండేవి. ఆ మధ్య తనకు ఆరోగ్యం బాగులేకపోతే.... చూడడానికి వచ్చిన కొడుకుతో... 'మనకేనా బాధ్యత? డబ్బుమూటలు పట్టుకెళ్తుంది కదా, కూతురికి లేదా బాధ్యత? నాలుగు రోజులుండి మీ అమ్మను చూసుకోమనండి' అని కోడలనగానే తలూపాడు కొడుకు. 'మీ అన్నయ్యతో సమానంగా, నీకొస్తుందా ఆస్తి? మీ అన్నయ్యని చూసుకోమను మీ అమ్మ బాగోగులు?' తన కూతురికి చెప్పాడు అల్లుడు. దాంతో కొడుకు, కూతురూ చెరో నాలుగు రోజులుండి, జాగ్రత్తమ్మా అని వెళ్ళిపోయారు. అంతేగాని 'అమ్మా! వచ్చి మా దగ్గర కొన్నాళ్లుండు' అని ఇద్దరూ అనలేదు. తప్పంతా తనదే!

వర్ధనమ్మలా పిల్లలను అనుబంధాలను నేర్పిస్తూ కాకుండా, డబ్బుతో పెంచింది. "మీకేమి లోటమ్మా! మీ నాన్నగారు సంపాదిస్తున్నది మీకోసమే కదా!" అని వాళ్ళు అడిగినవి, అడగనివి అన్నీ కొనిపెట్టేది. డబ్బుంటేనే జీవితం అనే లెక్కలో

పెంచింది. ఇప్పుడు తనేమిస్తుందోనని చూస్తున్నారే తప్పించి, తనెలా ఉందో కూడా ఎవరూ అడగడం లేదు. ఆఖరికెలా అయిందంటే... ‘వాళ్లకు ఎక్కువిచ్చావు, మాకు తక్కువిచ్చావు’ అని లెక్కలు వేసుకునే స్థితికి వెళ్ళిపోయారందరూ. తన పిల్లలు, వాళ్ల పిల్లలే కాదు, వియ్యంకులు కూడా అందులో భాగమైపోయారు. ఇంత ఆస్తి ఉండీ, లంకంత కొంపలో తను ఒక్కర్తే. వంట మనిషి, పనిమనిషి వచ్చి పనులు చేసి, కాస్సేపుండి వెళ్ళిపోతారు. పిల్లల దగ్గరకు వెళ్దామనిపించినా... వాళ్ల స్వభావాలు తెలిసాక వెళ్లాలనిపించడం లేదు.

తన పిల్లలకు తప్పించి ఏనాడూ ఎవరికీ పెట్టింది లేదు. అంతెందుకూ! ఏమైనా పెట్టాల్సి వస్తుందేమోనని ఏనాడూ ఎవరినీ ఆప్యాయంగా పలకరించిన పాపాన పోలేదు తాను.

వర్ధనమ్మ అందరినీ చేరదీస్తే, “లేనిపోని తద్దినాలు తలకెత్తుకుంటావెందుకు?” అని అనేది తాను.

“ఏదో వాళ్లకు లేకేకదా! మన దగ్గరకొచ్చారు” అనేది వర్ధనమ్మ.

“నాల్గు డబ్బులు మన దగ్గరుంటే, బెల్లం చుట్టూ చీమల్లా వాలిపోతారు చుట్టాలు. అవసరం తీరిపోయాక కన్నెత్తికూడా చూడరు. దగ్గరివాళ్లేనని అందరి అవసరాలు తీరుస్తుంటే... రేపు పిల్లలకేమిస్తావు?” అంటే, “చదువు చెప్పిస్తున్నాం. అదే వాళ్లకు మనమిచ్చే ఆస్తి” అని నవ్వేసేది.

“నువ్వేమంటే అను వర్ధనం. అన్నయ్యేమో మడి కట్టుకొని జీతం రాళ్లతోనే గడిపేస్తున్నాడు. నువ్వేమో ఆ జీతంరాళ్ళని పంచిపెడుతూ పిల్లలకేమీ లేకుండా చేస్తున్నావు! వచ్చిన జీతం గట్టి చేసుకోకుండా, అందరూ మనవాళ్లేనని ఖర్చు పెట్టేస్తే, ఆస్తి లేనినాడు పిసరంత విలువ కూడా మనకెవ్వరూ ఇవ్వరు. నన్ను చూసి నేర్చుకో! గట్టిగా ఉంటున్నాను కాబట్టే నా దగ్గరందరూ జాగ్రత్తగా ఉంటారు. రేపు పిల్లలకు మంచి సంబంధాలు రావాలంటే, డబ్బుతోనే అన్నీ ముడిపడతాయి!” అని చెప్పేది తాను.

“ఎవరి రాత ఎలా ఉంటే, అలా జరుగుతుందిలే వదినా. ఇప్పటినుండి దాని గురించి ఆలోచించడమెందుకు!” అనేసేది వర్ధనమ్మ.

ఇప్పుడాలోచిస్తుంటే అర్థమవుతుంది తనకు. నలుగురూ చుట్టూ ఉండాలనుకుంది వర్ధనం. నలుగురి పైనా ఉండాలనుకుంది తాను. ఇప్పుడు వర్ధనం చుట్టూ నలుగురు మనుషులున్నారు. ఆమెకు ఆరోగ్యం బాగులేకపోతే నలుగురు మనుషులొస్తున్నారు చూడడానికి.

మరి తనకో! ఎవరికీ అందనంత ఎత్తు ఎదిగాననుకుంది తాను. అందుకే తనకు ఆరోగ్యం బాగు లేకపోయినా, అంత ఎత్తు ఎక్కి పలకరించడం ఎందుకులే అనుకుంటున్నారందరూ! గట్టిగా చెప్పాలంటే... తల్లి గురించి పట్టించుకోకుండా ఆస్తుల గురించి తన కొడుకు కూతురు పంతాలు పోతున్నారని తెలిసి... ‘మంచి శాస్తే జరిగిందిలే, లేకపోతే ఒక్కరినైనా చేరదీసిందా! పిలిచి ఒక పూట భోజనం పెట్టిందా? మాట్లాడితే ఏమి అడిగేస్తామేమోనని పలకరించేదే కాదు. కూడబెట్టినదంతా కట్టుకుపోతుంది మరి...’ అని తన వెనుక నవ్వుకుంటున్నారు.

డబ్బు కూడగట్టి, గొప్పగా కట్టిన, ఖరీదైన తన లంకంత కొంప మనుషులు లేక బావురుమంటూ ఉంటుంది.

సలహా సంప్రదింపులకు, అవసరాలకు వచ్చిపోయే వాళ్ళతో వర్ధనం ఇల్లు ఎప్పుడూ కళకళ్ళాడుతూ ఉంటుంది.

'ఇచ్చుటలో ఉన్న హాయి వేరెచ్చటనూ లేదోయి' అని ఓ మహానుభావుడు అననే అన్నాడు. ఆ మాటలు అక్షరాలా పాటిస్తూ, ఉన్న దాంట్లోనే నలుగురికి పెడుతూ, ఆస్తి కూడబెట్టకపోయినా ఆప్యాయతల మధ్య వర్ధనమ్మ చాలా హాయిగా ఉంది. పిల్లలు బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సంపాదించుకున్నారు. వాళ్లను చూసి మంచి సంబంధాలే వచ్చాయి. పిల్లలే కాదు అల్లుడు, కోడలు కూడా ఆమెకు చాలా మర్యాద ఇస్తారు.

ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఒకప్పుడు తన మార్గమే సరైనదని నమ్మింది తాను. కాని ఇప్పుడది సరైన మార్గం కాదని అనుభవంలోకి వచ్చింది. తెలిసాక కూడా సరైన మార్గంలోకి వెళ్లకపోతే, ఇంత వయసు వచ్చి ఉపయోగమేమిటి?

ఇప్పుడు ఏమి చేయాలి తాను? ఆలోచిస్తున్న సుందరికి, "మా స్నేహితుల దగ్గర నుండి కొంత విరాళం సేకరించాను. సాయంత్రం అనాథాశ్రమానికి వెళ్లి, ఇచ్చి వద్దాం" స్వాతి అంటుంటే "అయితే కొద్దిగా స్వీట్ చేస్తాను. పట్టుకెళదాం" అంటూ పక్కింటి నుండి వినబడిన వర్ధనమ్మ మాటలు మార్గాన్ని ఉపదేశించాయి.

ఆస్తి మోజులో అనుబంధాలను మర్చిపోయిన తన పిల్లలకు ఇప్పటికి ఇచ్చింది చాలు. మిగిలిన ఆస్తిని అన్నార్తుల కోసం ఉపయోగిస్తే, ఆయన కష్టపడి సంపాదించినదానికి కొంత ప్రయోజనం ఉంటుంది. ఈ ఆలోచన వచ్చిందే తడవుగా, సుందరి మనసు తేలికైపోయింది. ఇచ్చుటలో ఉన్న హాయిని అనుభవించడానికి, తాను కూడా వర్ధనమ్మ వాళ్ళతో అనాథాశ్రమానికి వస్తానని చెప్పడానికి పక్కింటికి బయలుదేరింది సుందరి.



# నేను, నాన్న, బంగారం!

శ్రీసుధామయి



7981085444

**ఒక శోకం శ్లోకమై రామాయణం అయ్యింది. ఒక గీత భగవద్గీత అయ్యింది. తండ్రి హితబోధ మార్గదర్శకం అయ్యింది. స్వర్ణకారుడి జీవితానికి ధన్యత కూర్చే సువర్ణాక్షర లిఖితం అయ్యింది. కర్తవ్యానికి దారి చూపింది. కృష్ణమాచారి తన చేతిలో ఉన్న ఫార్ములా పేపర్లను ఆ మంటల్లో వేసాడు.**

స్వర్ణకారుడు బంగారాన్ని కొలిమిలో పుటం పెట్టి కాల్చితేనే అది మెరిసిపోతుంది. జీవితం కష్టాల కొలిమిలో పుటం పెట్టి కాలితేనే మెరిసిపోతుంది. బంగారం విలువైనదా? ఆబంగారాన్ని ఆభరణాలుగా మలిచి, స్వర్ణం అందాలను ద్విగుణీకృతం చేసే స్వర్ణ బ్రహ్మ స్వర్ణకారుడు విలువైనవాడా?

★★★

అమెరికా... లాస్ ఏంజెల్స్... ఇండియా కాలమానం ప్రకారం సమయం ఉదయం పదకొండు గంటలు. దాదాపు ముప్పై అంతస్తుల అపార్ట్మెంట్ అది. ముప్పయ్యవ అంతస్తులోని తమ అపార్ట్మెంట్ బాల్కనీలో నిలబడి ఉన్నాడు కృష్ణమాచారి. అక్కడ నుండి కిందకు చూస్తుంటే అంతా మినియేచర్ సెట్ లాగా కనిపిస్తోంది. లోపలికి వచ్చాడు. ఎదురుగా పెద్ద కంప్యూటర్ స్క్రీన్ మీద తాను చేసిన వర్క్ కనిపిస్తోంది. దాని మీద అన్ని బాణపు గుర్తులు వేసి ఉన్నాయి. వాటిని చూస్తూ పక్కకి నడిచాడు. అక్కడ రకరకాల గాజు బీకర్లలో ద్రావకం నింపి ఉంది. ఆ ద్రావకాన్ని గమనిస్తూ అలా ఉండిపోయాడు కృష్ణమాచారి. ఇంతలో అతడి భార్య అక్కడికి వచ్చింది. అతడిని చూసి "మీరింకా పడుకోలేదా?" అడిగింది. లేదన్నాడు.

"అయినా మీరు చదివిన చదువుకు, ఇప్పుడు మీరు చేస్తున్న పనికి కొంచెం కూడా సంబంధం లేదు. సాఫ్ట్‌వేర్ చేశారు. ఇప్పుడేమో ఇలాంటి పరిశోధనలు చేస్తున్నారు. మనకు వచ్చే జీతంతో మనకు రోజులు బాగా గడిచిపోయేవి. కానీ ఇప్పుడేమో వచ్చే జీతం మొత్తం ఈ పరిశోధనల కోసం ఖర్చు పెడుతున్నారు. ఇండియాలో ఉన్న అత్తమామలకు కూడా మనం ఏమీ పంపించడం లేదు. పోనీ వారిని ఇక్కడికే తీసుకురావచ్చు కదా...." భార్య మాటలు వింటూ అలా కంప్యూటర్ స్క్రీన్‌ను చూస్తూ ఉండిపోయాడు. అందులో... బంగారం తయారయ్యే విధానం ... ఇంకా వివిధ దేశాల్లో ఉన్న బంగారు గనులు ... వాటి వివరాలు అన్ని చూపిస్తోంది. ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు. ఆ కళ్ళ వెనుక కదలాడుతున్న గతం తాలూకు జ్ఞాపకాలు కంప్యూటర్ స్క్రీన్ మీద గీతలుగా ఏర్పడసాగాయి. ఆ జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ తన భార్యతో చెప్పడం ప్రారంభించాడు.

★★★

కృష్ణమాచారికి ఆ సంఘటన బాగా జ్ఞాపకం వుంది. తల్లి దగ్గరికి ఆమె చెల్లెలు వచ్చింది.

"అక్కా ఏమిటి, ఇంకా అలాగే ఉన్నావు? తొందరగా తయారవ్వు మనం పెళ్ళికి వెళ్ళాలి కదా" అన్నది.

ఆ మాటలకు ఆమె, "లేదులే చెల్లీ... నేను రావడం లేదు. మీ బావగారికి ఏదో పనుందట. నేను ఇంట్లోనే ఉండాల్సి వస్తుంది.

నువ్వెళ్లు!" అన్నది.

"అలా కాదక్కా, తొందరగానే వచ్చేద్దాం కదా..." అని ఇంకా ఏదో చెప్పబోతున్న చెల్లి మాటలకు అడ్డు వస్తూ, "నేను రాలేను... నువ్వెళ్లు!" చెల్లితో కచ్చితంగా చెప్పింది ఆమె.

అక్క మాటలకు ఏమి మాట్లాడలేక చెల్లి వెళ్ళిపోయింది.



శరభాచారి బయటకు వచ్చాడు. భార్యను చూస్తూ "ఎందుకు వెళ్ళలేదు లక్ష్మీ?" అంటూ, ఆమె చుబుకాన్ని పైకెత్తాడు. చిత్రంగా అతని కళ్ళలో కన్నీరు... ఆమె మనసులో బాధ అతడి కన్నుల్లో కన్నీరై కనిపించింది.

"నాకు తెలుసు! నీ మెడలో ఏం లేదు. బోసి మెడతో వెళ్ళడానికి బాధపడుతున్నావు కదా! నాకు చాలా బాధగా ఉంది. నువ్వు చేసుకోవాల్సిన కోటీశ్వరుల సంబంధాన్ని అనుకోని పరిస్థితుల్లో మీ చెల్లి చేసుకుంది. నువ్వేమో నాలాంటి సాధారణ జీవితం గడుపుతున్న స్వర్ణకారుడిని చేసుకున్నావు. అందుకే నీకిన్ని కష్టాలు... " అని ఇంకా ఏదో అనబోయేంతలో... లక్ష్మి చప్పున తన చేత్తో తన భర్త నోరు మూసింది. భర్త భుజం మీద తల వాల్చింది. "అలా మాట్లాడకండి... ఆ బంగారం కోసం ఈ బంగారంలాంటి మొగుడిని కాదంటానా? కాకపోతే చిన్నపాటి అసంతృప్తి. ఒంటిమీద కొంచెమైనా బంగారం లేకుండా ఎక్కడికి వెళ్లలేం కదా! ఎక్కడికైనా వెళ్తే, చెల్లి ఒంటి మీద బంగారు నగలు బోల్డన్ని ఉంటాయి. కానీ అక్కకి కొంచెం కూడా బంగారం లేదనుకుంటారు. అలా అని ఆ తప్పు మీ మీద పెడతారు. అది నేను భరించలేను!"

"ఇదంతా నా మూలంగానే కదా!" అన్నాడు శరభాచారి.

ఆ మాటలకు లక్ష్మి "మనం వృత్తినే నమ్ముకున్న స్వర్ణకారులం. మన వృత్తి మనకు ముఖ్యం. ఈ వృత్తిలో ఉండబట్టే కదా ఎంతోమందికి తాళిబొట్లు దగ్గరనుండి ఎన్నో నగలు తయారుచేసారు! మనకేమీ  మిగుల్చుకోకున్నా సరే, అందరి వద్దా

మంచి పేరు తెచ్చుకున్నారు!" అన్నది లక్ష్మి.

భార్య మాటలు వింటూనే ఏదో ఆలోచిస్తున్నాడు శరభాచారి.

"మన సర్పంచి గారి భార్యకు ఒక హారం తయారుచేసాను. అది వేసుకుని పెళ్ళికి వెళ్ళిరా! తర్వాత జాగ్రత్తగా వారి నగ వారికి అప్పచెబుదాం!" అన్నాడు.

భర్త మాటలకు అడ్డు వచ్చిన లక్ష్మి, "అలా వద్దండి. నగ వేసుకుని అక్కడికెళ్ళాక ఎవరైనా ఆ నగ గురించి అడిగితే, ఎవరైనా చూస్తే మీకు మాట పోతుంది. మీకున్న మంచి పేరు పోతుంది!" అని చెప్పింది.

తన తల్లి తాలూకు జ్ఞాపకాలు కృష్ణమాచారికి గుర్తొస్తున్నాయి. తన తండ్రి ఆ ఊరిలో పేరు మోసిన స్వర్ణకారుడైనా తమకు కొంచెమైనా బంగారం లేకపోవడం తనకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించేది. తన తండ్రి ప్రతిరోజూ ఎన్నో ఉంగరాలను, నగలను తయారు చేసేవాడు. కానీ తనకు చిన్న ఉంగరం కూడా లేకపోవడం తనకు అసంతృప్తిని కలిగించేది. తన తండ్రిని అప్పుడపుడు "నాన్నా నాకొక ఉంగరం చేసిపెట్టవూ?" అని అడగటం గుర్తొచ్చింది. అందుకు తన తండ్రి సమాధానం చెప్పలేక తనలో తానే మథనపడటం గుర్తొచ్చి కళ్ళు చెమ్మగిల్లాయి. కొడుకు పుట్టినరోజు రాబోతుందని తన తల్లిదండ్రులు మాట్లాడుకోవడం వింటున్న కృష్ణమాచారి 'నాన్నా ఈ పుట్టినరోజుకైనా నాకొక ఉంగరం కావాలి.' అని మారాం చేస్తున్న కొడుకును చూస్తూ తల్లి 'ఈసారి నీకు మీ నాన్న తప్పకుండా ఉంగరం చేస్తాడు' అని చెప్పింది. ఆ మాట వినగానే తనకు పట్టరాని సంతోషం కలిగింది. తరువాత తన తల్లిదండ్రులు ఏదో మాట్లాడుకుంటుంటే తనకేమీ అర్థం కాలేదు... తనకు ఉంగరం వస్తుందనే ధ్యాస తప్ప! తన తల్లి తండ్రితో ఏదో చెప్పింది. సరే అన్నట్టుగా తలూపాడు తండ్రి. వెంటనే అమ్మ తన మెడలో ఉన్న మంగళసూత్రాలను బయటకి తీసింది. తన తండ్రి చేతికి తన చేతిలో పట్టుకున్న పసుపుకొమ్మును అందించింది. ఆ పసుపుకొమ్మును తన తల్లి మెడలో కట్టాడు తండ్రి. తనకు ఉంగరం చేయడానికి వారెంత కష్టపడ్డారో తలుచుకుంటే, ఇప్పుడు కృష్ణమాచారికి బాధ కలుగుతోంది. ఆ రాత్రి తన తండ్రి ఉంగరం ఎలా తయారు చేస్తాడో ఉత్సాహంగా చూస్తుంటే దీపపు సెమ్మె వెలుగులో ఆ రాత్రంతా దీక్షగా ఉంగరాన్ని తయారుచేసాడు. తరువాత తన తల్లి మెడలో పసుపుకొమ్ము తాను చాలాసార్లు చూసాడు. తనకు ఉంగరం చేయించడానికి తన తల్లి మంగళసూత్రాలు తీసివ్వడం తానెప్పటికీ మర్చిపోలేదు. అందుకే తల్లిదండ్రుల కోసం చదువుని నిర్లక్ష్యం చేయకుండా మరోపక్క బంగారాన్ని తయారుచేసే విధానం కోసం తాను పరిశోధనలు మొదలుపెట్టాడు.

పై చదువుల కోసం అమెరికా రావడంతో తనకు బంగారం మీద పరిశోధన చేయడానికి మరిన్ని అవకాశాలు లభించినట్టయ్యింది. అతని ఆలోచనలను భగ్నం చేస్తూ కంప్యూటర్ స్క్రీన్ మీద ఏవో శబ్దాలు. తల తిప్పి కంప్యూటర్‌ను చూసిన అతడి కళ్ళు ఒక్కసారిగా ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. అక్కడ తాను బంగారం తయారీ మీద చేస్తున్న పరిశోధన ఒక కొలిక్కివచ్చి 'సక్సెస్' అని చూపిస్తోంది. చిన్నప్పటినుండి ఏ బంగారాన్ని అయితే తాము కనీసం కొనగలిగే స్తోమత లేదో... ఇప్పుడు అదే బంగారాన్ని తాను కొనడం కాదు తయారుచేయగలడు. వెంటనే ముందుగా తన తల్లికి బంగారాన్ని తయారు చేసివ్వాలని అనుకున్నాడు కృష్ణమాచారి. ఇప్పటికి కూడా తన తల్లి మెడలో పసుపుకొమ్ము మాత్రమే ఉంది. తన తల్లికి తాళిబొట్టుతో పాటు అనేక రకాల నగలను తయారుచేయాలని నిర్ణయించుకున్నాడు కృష్ణమాచారి.

★★★

పూర్వకాలంలో లోహాలను బంగారంగా మార్చడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. కొన్ని రకాలైన రాళ్లను ఇనుము సీసం వంటి లోహాలకు తాకిస్తే అవి బంగారంగా మారుతాయని విశ్వసించేవారు. అందులో భాగంగా ఎంతోమంది తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టారని ఒక సమాచారం. గ్రీకులు, అరబ్బులు, చైనీయులు, మెసపటేనియన్లు బంగారం తయారుచేయడంలో కొంతవరకు సఫలమయ్యారని చరిత్ర చెప్తోంది. ఇంగ్లాండ్ రాణి మొదటి ఎలిజబెత్, 22వ పోప్ జాన్ బంగారం తయారీకి అధికారికంగా ప్రయత్నించారు. యోగివేమన పరుసవేది విద్యను ఉపయోగించి బంగారాన్ని తయారుచేసాడని చెప్తారు. న్యూటన్ బంగారం తయారీకి విస్తృతంగా ప్రయత్నించాడని ఒక సమాచారం. పూర్వకాలంలో బంగారం తయారీ పద్ధతులను రహస్యంగా ఉంచి గ్రంథాల్లో కోడ్ భాషలో ఉంచేవారు. ఆచార్య నాగార్జునుడు అల్కెమి (పరుసవేది) విద్య ద్వారా పాదరసం, సీసం లోహాలనుండి బంగారాన్ని తయారుచేసాడని నమ్ముతారు. నాగార్జునుడు వ్రాసిన రస రత్నాకరం, రసేంద్ర మంగళ్ గ్రంథాల్లో స్పర్శవేది విద్య గురించి సమాచారం ఉంది. టోకియోలోని ఇంపీరియల్ యూనివర్సిటీలోని హాంటారో 1924 మార్చిలో అణువిద్యుత్ ఉపయోగించి బంగారాన్ని తయారు చేయడంలో విజయం సాధించాడు. నాలుగు గంటలపాటు 1,50,000 వోల్టుల విద్యుత్తును పారఫిన్ ఆయిల్ డై ఎలక్ట్రిక్ లేయర్ పై పంపి, పాదరసం నుండి 1 ప్రోటాన్ ను తొలగించడం ద్వారా బంగారాన్ని తయారుచేయగలిగాడు.

రష్యన్ శాస్త్రవేత్తలు 5000 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద రాగిని వేడిచేసి, బంగారంగా మార్చి ఒక మూలకం నుండి వేరొక మూలకాన్ని తయారుచేయవచ్చని నిరూపించారు.

★★★

తాను తయారు చేయాలనుకున్న బంగారం తయారీ విధానాన్ని వివరిస్తూ ఒక ఫార్ములా తయారుచేసాడు కృష్ణమాచారి. న్యూక్లియర్ ఫ్యూషన్ పద్ధతిలో లోహాల నుంచి బంగారాన్ని తయారుచేయవచ్చు. పూర్వం బంగారాన్ని తయారు చేయడానికి ఇనుము, ఆమ్లం, మరొక లోహాన్ని వాడేవారు. కొలిమి నుండి బయటికి తీసిన ముడిసరుకుకి పొటాషియం నైట్రేట్ ని కలిపేవారు. రసవాదంలో ఉమ్మెత్తాకుని తీసుకుని బాగా దంచుకొని, అందులో పాదరసాన్ని వేసి బాగా ఆరు గంటలపాటు నూరితే పాదరసం గట్టిపడి బంగారంగా మారుతుందని ఒక విశ్వాసం. బంగారం పుట్టుకకు మూలం... నక్షత్రం విస్ఫోటనం! నక్షత్రాలు చాలావరకు హైడ్రోజన్‌తో కూడుకుని ఉంటాయి. గురుత్వాకర్షణ ఒత్తిడి మూలంగా నక్షత్ర కేంద్రకంలో అణుసంయోగం (ఫ్యూజన్) ప్రేరేపితం అవుతుంది. దీనితో హైడ్రోజన్ నుండి శక్తి విడుదల అవుతుంది. అణుసంయోగం క్రమంగా హైడ్రోజన్‌ను హీలియం, కార్బన్, ఆక్సిజన్ వంటి మూలకాలుగా మారుస్తుంది. హీలియం తనకన్నా పెద్ద మూలకంతో కూడుతుంది. ఐరన్ ఏర్పడేవరకు ఇలా మూలకాలన్ని కూడుతూనే ఉంటాయి. ఐరన్ ఏర్పడ్డాక ఉన్న శక్తిని గ్రహించుకోవడం ఆరంభిస్తుంది. దీనితో తీవ్రమైన ఒత్తిడి... గురుత్వాకర్షణను ప్రతిఘటించడానికి అవసరమైన శక్తి నక్షత్రంలో ఉండదు. ఫలితం నక్షత్రం భారీ విస్ఫోటనం చెందుతుంది. అదే 'సూపర్‌నోవా' నక్షత్ర విస్ఫోటనం చెందే క్రమంలో వెలువడే తీవ్రమైన శక్తి మూలంగా కొన్ని సెకన్లలోనే బంగారం పుట్టుకొస్తుంది. సూపర్‌నోవా (నక్షత్రం పేలినపుడు) జరిగినపుడు లేదా 2 న్యూట్రాన్ నక్షత్రాలు ఢీకోట్టినపుడు సూర్యుడి మధ్య భాగంలో వేడి కన్నా 6000 రెట్లు విడుదలయినపుడు హైడ్రోజెన్, హీలియం వంటి మూలకాలు కలిసి ఎక్కువ సాంద్రత గల బంగారు మూలకాలు ఏర్పడతాయి. ఇలా ఏర్పడిన బంగారం విశ్వము మొత్తం వెదజల్లబడుతుంది. ఇదే పద్ధతిని ఉపయోగించి అణు రియాక్టర్లలో న్యూక్లియర్ రియాక్షన్‌ను కలిగించినట్టయితే ఇతర లోహాలను బంగారంగా మార్చవచ్చు.

ఇంకొక పద్ధతిలో స్పర్శవేది శిలలను ఉపయోగించి పరుసవేది విద్య ద్వారా బంగారాన్ని తయారుచేయవచ్చు.

కృష్ణమాచారికి పట్టరాని సంతోషం కలిగింది. తాను అనుకున్నది సాధించాడు. తాను ఇప్పుడు బంగారాన్ని సృష్టించగలుగుతున్నాడు. తన తల్లిదండ్రులను బంగారంలో ముంచెత్తగలడు. ఆ ఆలోచన అతడిని కుదురుగా ఉండనివ్వలేదు. వెంటనే ఇండియాలో ఉన్న తన తల్లిదండ్రుల వద్దకు బయలుదేరాడు.

★★★

కొడుకు రాకకు సంతోషిస్తున్న తన తల్లిదండ్రులను ఆశ్చర్యంలో ముంచెత్తాలనుకున్నాడు కృష్ణమాచారి. పక్క గదిలోకి వెళ్ళాడు. కొన్ని గంటల తర్వాత, బంగారపు ముద్దలను, కణికలను బయటకు తీసుకొచ్చాడు. అతని చేతిలో బంగారం... వాలు కుర్చీలో కూర్చున్న తండ్రి వద్దకు వచ్చాడు. బంగారం మొత్తం తన తండ్రి చేతుల్లో పెట్టాడు. తండ్రి ఒడిలో తల పెట్టుకుని కింద కూర్చున్నాడు కృష్ణమాచారి. తండ్రి చేయి తన తలను మెల్లిగా తాకడం తెలుస్తోంది. తన తండ్రి బంగారాన్ని చూసి ఎంతగానో సంతోషిస్తున్నాడని అనుకుంటూ తన తండ్రి కళ్ళలో ఆనందాన్ని చూడాలని తన తలను పైకెత్తాడు. అలా తలను పైకెత్తి చూడగానే అతని నుదుటిపై రాలిన ఒక కన్నీటి చుక్క. తండ్రి కళ్ళలో జాలువారిన ఆవేదన కన్నీటి చుక్కె, కొడుకు అంతరంగాన్ని స్పృశిస్తోంది. తండ్రి మాట్లాడటం మొదలుపెట్టాడు. అక్కడ వీచే గాలి సైతం ఆ తండ్రి చెప్పబోయే జీవిత రహస్యాన్ని, స్వర్ణ బోధను వినడానికి ఆయత్తమవుతోంది.

“ఇవి ఆనందబాష్పాలు మాత్రం కాదురా, నా కొడుకు తన మేధస్సుతో ప్రపంచంలో ఎవరు సృష్టించలేని పరుసవేదిని సాధించాడని గర్వపడాలా? ఈ సృష్టించిన బంగారంతో ఒకప్పుడు స్వర్ణకారులంటే ఉన్న విలువ తగ్గుతుందేమో అని బాధ పడాలా?” తండ్రి మాటలతో విస్తుపోయి చూసాడు కృష్ణమాచారి.

“మనం తయారు చేసే నగలు తాళిబొట్లు విలువ బంగారం అని పేరుతో రాదు. ఒక ఆడపడుచు మెడలో హారంగా మారినందుకు ఆ బంగారం మురిసిపోయింది. మనం తయారుచేసే తాళిబొట్టు ఒక జంటను ఏకం చేస్తుంది. ఒక అన్యోన్య బంధాన్ని ఏర్పరుస్తుంది. ఒక చేతి వేలికి ఉంగరంగా మారినందుకు బంగారం జన్మ ధన్యమైంది. నిశ్చితార్థం ఉంగరమై జ్ఞాపకంగా మిగిలిపోతుంది. అలా బంగారం ఎన్నో రకాలుగా రూపాంతరం చెంది అందరికి విలువైనదిగా మారింది. మన దేశ వ్యవస్థను మెరిసేటట్టు చేస్తున్న ఈ స్వర్ణాన్ని, అదే పేరుతో పిలుస్తున్న మన స్వర్ణకారుల జన్మ ధన్యం అయింది అనుకున్నాను. కానీ ఇప్పుడు నువ్విలా ఇంత బంగారాన్ని తయారుచేసావో మంచినీటి ప్రాయంగా అందరికి అందుబాటులోకి వస్తే దాని విలువ తగ్గిపోతుంది కదరా! ఎవరికి వారు బంగారాన్ని తయారు చేసుకుంటారు. నువ్వు సాధించిన ఫార్ములా కోసం యుద్ధాలు మొదలవుతాయి. బంగారం విలువ పడిపోయి, బంధాలు తెగిపోతాయి. ఇంత చిన్న సత్యం ఎలా వదిలేసావు నాన్నా! నీ తండ్రి దగ్గర బంగారం లేకపోవచ్చు. కానీ నన్ను అందరు స్వర్ణకారుడనే పిలుస్తారు. ఒక స్వర్ణకారుడు తాళిబొట్టు తయారుచేస్తే కాళ్లకు దండం పెట్టి, ఆ తాళిబొట్టు కళ్ళకు అద్దుకుంటారు! విడిగా చూస్తే బంగారం, స్వర్ణకారుడి చేతిలో రూపుదిద్దుకుంటే ఆభరణం... సప్తవర్ణ శోభితం. స్త్రీల అలంకారాలకు ఆనవాలు. మహారాజుల రారాజుల కిరీటాలను సైతం సృష్టించే స్వర్ణకారుడి పనితనం సృష్టికే శోభనిస్తుంది. స్వర్ణకారుడి చేతుల్లో ఒదిగిపోయి, సాగిపోయి, కొలిమిలో కరిగిపోయి, ఒక ఆకృతిగా నిలిచి శోభనిచ్చే బంగారం భూమి అట్టడుగు పొరల్లో, ప్రకృతి అందించిన బంగారంగా వస్తేనే బంగారానికి విలువ. స్వర్ణకారుడి జీవితం ధన్యం. భూమి అట్టడుగు పొరలనుండి వచ్చిన బంగారం, ఒక తల్లి తన బిడ్డను తొమ్మిదినెలలు మోసి కన్నబిడ్డతో సమానం. ఎక్కడో గాజు బీకరులో పుట్టిన బిడ్డకు,

తొమ్మిదినెలలు మోసి కన్న బిడ్డకు ఎంత తేడా ఉంటుందో ఈ బంగారానికి కూడా అంతే తేడా ఉంది. నువ్వు సృష్టించిన ఈ బంగారం జీవం లేనిది. తప్పనిసరి పరిస్థితుల్లోనో, అనివార్య పరిస్థితుల్లోనే ఇలాంటి బంగారం పనికి రావచ్చు. ప్రతి వ్యక్తి దగ్గర విరివిగా బంగారం ఉన్న తరువాత ఇక మన ఆర్థిక వ్యవస్థ ఏమవుతుంది? నేను నీలా చదువుకోలేదు. ఈ బంగారం ఉన్న తరువాత మనం కష్టపడి పనులు చేసుకోగలమా? తన భార్యకు భర్త ఒక నగ తయారు చేయిస్తే ఆ భార్య ఎంతగానో మురిసిపోతుంది. తమ బిడ్డకు చిన్న బంగారు వస్తువు చేయించినా ఆ తల్లిదండ్రులు ఎంతగానో మురిసిపోతారు. మనం తాళిబొట్లను తయారు చేసి ఇస్తే మనకు పాద నమస్కారం చేస్తారు. ఇంత విలువను మనం కోల్పోగలం కదా! నేను మీ అమ్మకు బంగారు నగలు చేయించలేక బాధపడ్డాను తప్ప ఏ రోజు కూడా ఈ బంగారం లేదని బాధ పడలేదు. మీ అమ్మ పసుపుకొమ్ము కట్టుకుని తన తాళిబొట్టుతో నీకు ఉంగరం చేయించింది ఎందుకో తెలుసా? తన కొడుకుకు బంగారం లాంటి భవిష్యత్తుకు గుర్తుగా ఉండాలని కోరుకుంది. నువ్వు సాధించిన విజయం గొప్పదే కానీ అది నిరర్థకం అవుతుంది. ఇప్పుడు నేను చెప్పిన విషయాలన్నీ బాగా ఆలోచించు!" అంటూ కొడుకు తలను ముద్దు పెట్టుకున్నాడు తండ్రి... ఇక సెలవంటూ!

★★★

చితిమంటలు ఎగసిపడుతున్నాయి. దూరంగా ఉన్న చీకటిని చీలుస్తున్నట్టున్నాయి. ఒక శోకం శ్లోకమై రామాయణం అయ్యింది. ఒక గీత భగవద్గీత అయ్యింది. తండ్రి హితబోధ మార్గదర్శకం అయ్యింది. స్వర్ణకారుడి జీవితానికి ధన్యత కూర్చే సువర్ణాక్షర లిఖితం అయ్యింది. కర్తవ్యానికి దారి చూపింది. కృష్ణమాచారి తన చేతిలో ఉన్న ఫార్ములా పేపర్లను ఆ మంటల్లో వేసాడు. మరుక్షణం ఆ మంటలు తన అజ్ఞానాంధకారాన్ని చీల్చే జ్ఞానజ్యోతులై ఒక జీవిత సత్యాన్ని, అర్థాన్ని, పరమార్థాన్ని విశదీకరిస్తూ స్వర్ణకాంతులీనుతూ స్వర్గానికి చేరుతున్నట్టుగా ఉన్నాయి. అప్పటివరకు రాని దుఃఖం ఒక్కసారిగా అతడిని కమ్మేసింది.

ఆకాశానికి ఎగసిపడుతున్న ఎర్రటి ఆ అగ్నికీలలు స్వర్ణకాంతుల్లోకి మారిపోయి, తండ్రి ఆత్మ శాంతించినట్టు, బిడ్డను ఆశీర్వదిస్తున్నట్టు చల్లదనం ఆవరించుకుని తన తండ్రి స్పర్శ తనకు తాకుతున్నట్టుగా అనిపించింది. తన తండ్రి ఫోటో పక్కన తల్లి ఏడుస్తూ ఉండటం కనిపించింది. తన తల్లి ఒడిలో తల పెట్టి బాధగా కళ్ళు మూసుకున్నాడు. తన చేతివేలికి ఉన్న ఉంగరం తీసి తన తండ్రి ఫోటో ముందు పెట్టాడు. తల్లి అతడిని చూస్తూ, "తండ్రి ఋణం తీర్చుకున్నావు! రాత్రి మీ ఇద్దరిమధ్య జరిగిన సంభాషణని విన్నాను. మీ నాన్న ఎక్కడికి పోలేదు మన మధ్యనే ఉంటాడు. నీ బిడ్డగా పుట్టే మీ నాన్నను బొమ్మగా నా ఒడిలోకి తీసుకునే వరకు, నేను జీవించే ఉంటాను!" కన్నీటితో చెప్పింది తల్లి.

# శతమానం భవతి


పి. రాజేంద్రప్రసాద్



9492525607


***భారతదేశంలో లక్షలాది తలిదండ్రులు ఒంటరిగా ఉన్నారు. పిల్లలు ఉండీ అనేకమంది వృద్ధాశ్రమాలలో ఒంటరి జీవితం గడుపుతున్నారు. నేనూ ఒంటరినే కావచ్చు. ఈ దేశాన్ని శత్రుమూకల నుండి కాపాడడానికీ, నాలాంటి మీలాంటి... ఇంకెందరో అనేకమంది స్వేచ్ఛగా హాయిగా స్వతంత్రంగా బ్రతకడం కోసం దేశానికి నేను ఇద్దరు వీరులనిచ్చాను. వీరపత్నిగానే కాక, వీరమాతగా కూడా గౌరవింపబడడం ఈ దేశంలో ఎంతమందికి సాధ్యం?"***

"అన్నయ్యా! కొంచెం పెన్నివ్వరా... నా పెన్నులో ఇంకయిపోయింది!" కాలేజీ ఫీజు కట్టడానికి కౌంటర్ దగ్గర నించుని, అది ఇంకా తెరుచుకోక ఏదో ఆలోచనలో పడ్డ నేను ఉలిక్కిపడ్డాను. ఎదురుగా నిలుచున్నదొక అందమైన అమ్మాయి. ఆమెకు పెన్నిచ్చి ఇటు తిరగ్గానే కౌంటర్ తెరుచుకుంది. హడావుడిగా ఫీజు కట్టేసి, ఇంకా హడావుడిగా క్లాసుకి వెళ్ళిపోయాను. కాలేజీ అయ్యాక ఇంటికి వెళుతుంటే గేటు దగ్గర కాచుకుని, ఎవరో పిలుస్తున్నట్టనిపించి వెనక్కు తిరిగి చూసి తనను గుర్తుపట్టాను.

"సారీ అన్నయ్యా! అప్లికేషన్ పూర్తి చేసి చూస్తే అప్పటికే మీరు వెళ్లిపోయారు. మీరు ఏ క్లాసో తెలీక ఇంటికి వెళ్ళిపోయి, కాలేజీ మూసేసే టైములో అయితే దొరుకుతారు కదా అని ఇలా వచ్చాను." తన పెద్ద పెద్ద కళ్ళు నన్ను కనిపెట్టిన సంతోషంతో మెరుస్తుండగా పెన్ను నా చేతిలో పెడుతూ అంది ఆ అమ్మాయి.

"నీ పేరేంటమ్మా!" అభిమానంగా. అడిగాను.

"శ్రీదేవి అన్నయ్యా!" అంది.

ఆ ఒక్కరోజు పెన్ను పరిచయమూ, విదిలించిన సిరాచుక్కల్లాంటి చెదురు మదురు సంఘటనలు తప్ప తను ఎప్పుడూ నాకు దగ్గరయ్యింది లేదు. అయినా ఇన్నేళ్ల తర్వాత కూడా ఆమె జ్ఞాపకాలు నాకు సజీవంగానే ఉన్నాయి. దానికి కారణం ఉంది. అది అందరితోనూ పంచుకోవాలి.

శ్రీదేవి... అందమైన పేరు... అంతకంటే అందమైన అమ్మాయి! నేను ఫైనల్ ఇయర్ డిగ్రీ చదువుతుండగా తను ఫస్ట్ ఇయర్‌లో చేరింది. నా పదేళ్ల వయసులో నన్ను విడిచి పై లోకాలకు వెళ్లిపోయిన నా చెల్లెలి పోలికలతో ఉన్న శ్రీదేవిని నేను చూసినప్పుడల్లా, నాకు మా చెల్లెలే గుర్తొచ్చేది! అప్పటికీ ఇప్పటికీ ఆమె నా చెల్లెలుగానే నా మనస్సులో స్థిరంగా ఉండిపోయింది. ఫైనల్ ఇయర్ చదివిన ఆ ఒక్క సంవత్సరమే నాకు శ్రీదేవి కనిపించింది. మళ్లీ తను కనిపించడం... ఆరేళ్ళకి మా ఫ్రెండు ఆనంద్ పెళ్లిలో పెళ్లికూతురిగా మండపంలో తలవంచుకొని కూర్చుని ఉన్నప్పుడే. మిలిటరీలో షార్ట్ సర్వీస్ కమీషన్ ఆఫీసరుగా మంచి పొజిషన్‌లో ఉన్న ఆనందూ, తనూ కాలేజీలో ఉన్నప్పుడే ప్రేమలో పడ్డారన్న విషయం నాకు తెలియనే తెలియలేదు. డిగ్రీ ఇలా అయ్యీ అయిపోగానే నేను సివిల్స్ రాసి ఐ.ఏ.ఎస్ ఆఫీసరుగా ఢిల్లీ వెళ్ళిపోయాను. అప్పట్నుంచీ నాకు ఇక్కడి విషయాలేమీ తెలియకుండా పోయాయి.

జీవితపు ఆటుపోట్లు, ఒడిదుడుకులలో నేనూ, ఆనంద్ శ్రీదేవిలను మళ్లీ కలవడం చాలాకాలం కుదరనే లేదు. ఢిల్లీ

సెక్రటేరియట్లో ఆఫీసరుగా ఉన్న నాకు ఓ దుర్దినాన ఫైల్‌లో తన పేరు... శ్రీమతి అవసరాల శ్రీదేవి వైఫ్ ఆఫ్ లేట్ ఆనంద్... అని కనిపించగానే ఒక్కసారిగా నా కళ్లముందు ప్రపంచం గిర్రుమని తిరిగినట్టయింది. రిపబ్లిక్ డే ఉత్సవాలలో ప్రభుత్వం ఇచ్చే సాహస వీరుల అవార్డుకి రికమెండ్ చేసిన లిస్టు అప్రూవల్‌కి ఆర్థికశాఖలోని నాకు సంతకం కోసం వచ్చిన ఫైలు అది! అడ్రసు చూసి మర్నాడే ఫ్లైట్‌లో బయలుదేరాను. లంకంత ఇంట్లో కన్నీరు మున్నీరై ఏడుస్తున్న అత్త మామలతో పాటు నిలువెత్తు శోక సంద్రంలా శ్రీదేవి!

“అమ్మా... దేవీ!” నా నోటినుంచి అప్రయత్నంగా ఆ మాట వచ్చింది.

నన్ను చూడగానే ఆమెలోని శోకసంద్రపు చెలియలికట్ట ఒక్కసారిగా తెగిపోయింది. నాలో నేనే ఆపుకోలేని దుఃఖాన్ని తనని ఆపుకోమని, ఎలా అని, ఏమని చెప్పి ఓదార్చాలో నాకు అర్థం కాలేదు.



ఎలాగోలా నన్ను నేను తమాయించుకొని “ఎలా జరిగిందమ్మా!” గొంతు పెగల్చుకుని అడిగాను. బంగ్లాదేశ్‌లో పాకిస్థాన్‌తో జరిగిన ఆ యుద్ధంలో, తను ఎలా వీరమరణం పొందాడో అన్నీ వివరంగా నాకు తెలిసినా... ఆమె శోకాన్ని కొద్ది సేపైనా ఆపడానికి నాకు వేరే మార్గం కనిపించలేదు. అయినా ఆగని ఆ దుఃఖప్రవాహంలోనే తనకు తెలిసినంతా చెప్పింది. ఆ శోకసంద్రాన్ని నా సాంత్వన వచనాల ద్వారా ఎలాగో కొద్ది మాత్రం తగ్గించగలిగాను.

ఆ రోజు అక్కడ గడిపి ఆమెనూ, ఆనంద్ తల్లిదండ్రులకూ వీడ్కోలు చెప్పి ప్రభుత్వపరంగా, నాకున్న అధికార పరిధిమేరకు చేతనైనంత సహాయం చేస్తానని మాట ఇచ్చి తిరిగి వచ్చేశాను. వారి కుటుంబానికి నా వల్ల అయ్యిందంతా చేశాననే నేను అనుకున్నాను కానీ, యాంత్రిక జీవితంలో పడిపోయి తనకు అంతకంతకూ దూరమయ్యాననే చెప్పాలి. మొదట్లో అప్పుడప్పుడూ వెళ్లి రావడం, తరవాత ఉత్తరాలూ, ఆ తరువాత కొన్నాళ్ళు ఫోన్లూ... వీటి మధ్య నెమ్మది నెమ్మదిగా ఎడం ఎక్కువవుతూ వచ్చింది. కాలక్రమేణా అవి కూడా తగ్గిపోయి, తను నా పాత జ్ఞాపకాల పుటలలో ఒకటైపోయింది.

కాగితం పడవలాంటి మన జీవితం, వాన నీటిలో ఎటో ఒక వైపు కొట్టుకుపోతున్న వేళ, చిన్న పుల్లముక్క అడ్డువచ్చినా జీవనగమనాన్ని మార్చేస్తుంది. ఇక ఏదో పెద్ద రాయి అడ్డం వస్తే ఆ గమనమే స్తంభించిపోతుంది. రిటైర్మెంట్ అయ్యిన కొన్ని రోజులకే నా శ్రీమతి నన్ను వదలి అనంతలోకాలకు పోవడం... నాకు జీవితంలో పెద్ద శూన్యాన్నే మిగిల్చి, ఎప్పుడో

కౌలుకిచ్చేసిన పొలాల మధ్యలో కట్టుకున్న ఓ కుటీరంలాంటి ఇల్లు, నా విశ్రాంతజీవనానికి తోడూ నీడా అయ్యింది. భవబంధాలను సాధ్యమైనంత దాకా తగ్గించుకుని వానప్రస్థాశ్రమం గడపడం ప్రారంభించాను. నా సెల్‌ఫోనును నోరు నొక్కేసి మూలపడేశాను.

ఆ రోజు ఉదయం దైవప్రార్థన చేసుకుని తీరిగ్గా ఆరుబయట కుర్చీ వేసుకుని కూర్చున్న వేళ, వేగంగా అడుగులు వేస్తూ వస్తున్న, మా పొలాన్ని కౌలు చేస్తున్న ధర్మయ్య కనబడ్డాడు! అతని ముఖంలో ఏదో ఆదుర్దా గోచరిస్తోంది.

"ఏంటి ధర్మయ్యా! ఏమిటి హడావుడి?" ప్రశ్నించాను.

"అయ్యా! తమరి పెద్దబ్బాయిగారు మా ఇంటికి ఫోన్ చేశారు. తమర్ని అర్జంటుగా మీ ఇంటికి రమ్మంటున్నారు. ఒక్కసారి ఆయనతో మాట్లాడండి!"

"అలాగా! అంత అర్జంటు విషయం ఏమై ఉంటుంది?" అనుకుంటూనే అతన్ని వెళ్ళిరమ్మని చెప్పి, నా సెల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి పెద్దాడికి ఫోన్ చేశాను.

"నాన్నా! శ్రీదేవి అత్తయ్య వచ్చింది. మిమ్మల్ని చూడాలని అంటోంది. మీరు ఢిల్లీ రావాలి నాన్నా!" ఇది వాడి నుంచి అభ్యర్థనలాంటి ఆర్డర్.

"ఎందుకు నాన్నా! వాళ్ళ ఊరు ఇక్కడికి దగ్గరే కదా... నేను వెళ్లి చూసొస్తాలే!" నెమ్మదిగా అన్నాను. నిజానికి ఎవరు ఎక్కడికి వచ్చినా ఈ ప్రశాంతమైన వాతావరణంలోంచి బయటపడటం నాకు ఇష్టం లేదు.

"అలా కాదులెండి నాన్నా! వేరే పని కూడా ఉంది. మాధవరావు అంకుల్ కారులో వచ్చి మీకు ఫ్లైట్ టిక్కట్లు ఇచ్చి, మిమ్మల్ని ఎయిర్‌పోర్టుకి తీసుకెళతారు. ఇంకో గంటలో వస్తారు. వచ్చెయ్యండి నాన్నా!" మరో మాటకి అవకాశం లేకుండా ఫోన్ పెట్టేశాడు.

వాడు చెప్పినట్టుగానే ఇంకో గంటలో మా ఫ్యామిలీ ఫ్రెండ్ మాధవరావు కారులో వచ్చి, నన్ను ఎయిర్‌పోర్టుకి తీసుకుని వెళ్ళాడు. మా పల్లెటూరు నగరానికి దూరంగా ఉన్నా ఎయిర్‌పోర్టుకి దగ్గరగా ఉండడం ఒకందుకు లాభమే అనుకున్నాను. ఆ రోజు మధ్యాహ్నానికి కల్లా ఢిల్లీ చేరి, శ్రీదేవిని చూసినప్పుడు... వయసు తెచ్చిన మార్పు తప్ప తనలో ఏమీ మారలేదు. అదే ఆప్యాయత. అదే అనురాగం!

"అన్నయ్యా! ఎలా ఉన్నారు?" తనని చూస్తూ అలాగే గుమ్మంలో నిలబడిపోయిన నన్ను తనే మొదట పలకరించింది. మాటల మధ్యలో యథాలాపంగా అడిగాను.

"నీకు ఒక బాబు కదూ! ఎలా ఉన్నాడు? పెళ్లి చేశావా?" అంటూ.

ఆమె కళ్ళల్లో సన్నని నీటి పొర కనిపించింది. ఏమైందో అర్థం కాలేదు. తను మౌనంగా సోఫాలో తన పక్కనే ఉన్న ఫైల్ తెరిచి ఒక వార్తాపత్రిక అందించింది. చేతికి అందించగానే, ఇక ఎవరినీ ఏమీ అడగనవసరం లేని సమాధానం దొరికింది. తాటికాయలంతటి అక్షరాలలో నా చెల్లెలి ఎనలేని దుఃఖం కనపడింది. "కార్గిల్ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులలో ఆంధ్రప్రదేశ్ కాకినాడకు చెందిన మేజర్ అవసరాల విజయకుమార్..' అంటూ ఫోటోతో సహా! కిందనే

రాష్ట్రపతి, ప్రధానుల సంతాపాలు. చెంప మీద ఛెళ్లున దెబ్బ తగిలినట్టయింది.

నాగరిక ప్రపంచాన్నొదిలేసి ఎక్కడో పల్లెటూళ్ళో గడుపుతున్న నాకు ఈ విషయాలేమీ తెలియకుండా పోయాయి. నిలువెల్లా చలించిపోయాను. ఏమనాలో, ఎలా ఏది అడగాలో, ఎలాగ తనని సాంత్వన పర్చాలో అర్థం కాలేదు!

"మా అబ్బాయికి స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మిలిటరీ అవార్డు ప్రకటించారన్నయ్యా! దాని నిమిత్తమే నేనిక్కడికి వచ్చాను. ఇంత దూరమూ వచ్చాక నువ్వు కనిపించలేదు. ఈ ప్రపంచంలో నాకు మిగిలిన ఆత్మీయుడవు నువ్వొక్కడివే అన్నయ్యా! మిగతా ఎంతమంది ఉన్నా, వాళ్ళందరూ కేవలం చుట్టాలు మాత్రమే!" తన గొంతు రుద్ధమైంది. ఒక్క క్షణం నిశ్శబ్దం. తనలో వస్తున్న దుఃఖపు పొంగును చల్లారనిచ్చి అడిగాను.

"అమ్మా! శ్రీదేవీ! ఆనంద్ బావ అలా అయిపోయాక ఉన్న ఒక్కగానొక్క గుర్తయిన కొడుకునీ కూడా మిలిటరీ కే పంపావు. నీ ధైర్యం మెచ్చుకోదగిందే గాని, అలా చేసి ఉండాల్సింది కాదు. ఈ వయసులో నీకు తోడుంటూ నిన్ను చూసుకునే వాళ్ళు లేని పరిస్థితి తెచ్చుకున్నావు కదా!" ఆమె గడపబోయే ఒంటరి జీవితాన్ని గురించి మనసులో బెంగ కదలాడుతుండగా అన్నాను.

తను నా వైపు ఒక్కసారి చూసి కళ్ళు తుడుచుకుని స్థిరంగా అన్నది. "అన్నయ్యా! భారతదేశంలో లక్షలాది తలిదండ్రులు ఒంటరిగా ఉన్నారు. పిల్లలు ఉండీ అనేకమంది వృద్ధాశ్రమాలలో ఒంటరి జీవితం గడుపుతున్నారు. నేనూ ఒంటరినే కావచ్చు. ఈ దేశాన్ని శత్రు మూకల నుండి కాపాడడానికీ, నాలాంటి మీలాంటి... ఇంకెందరో అనేకమంది స్వేచ్ఛగా హాయిగా స్వతంత్రంగా బ్రతకడం కోసం దేశానికి నేను ఇద్దరు వీరులనిచ్చాను. వీరపత్నిగానే కాక, వీరమాతగా కూడా గౌరవింపబడడం ఈ దేశంలో ఎంతమందికి సాధ్యం? అటువంటి గౌరవమూ, తృప్తితో నేను కడదాకా సంతోషంగా హాయిగా బ్రతకగలనన్నయ్యా! నా అంతటి అదృష్టవంతురాలిని ఇంకొకరిని నీవు చూపించగలవా!" తన కళ్ళు ఆనందంతో చెమరుస్తున్నాయి.

ఈ మాటలు వింటున్న నాకు ఆనందంతో, ఉద్వేగంతో ఒళ్ళంతా పొంగిపోయింది. గగుర్పాటుతో మాటలు తడబడుతుండగా అన్నాను.

"చెల్లాయ్! నీ భర్తకంటే, కొడుకు కంటే కూడా నీవే గొప్ప దేశభక్తురాలివి. నిన్ను కన్న భారతమాత ఆనందంతో పులకించిపోతుందమ్మా! నిన్ను చూసి, నీ ధైర్య సాహసాలు చూసి, నిన్ను నా చెల్లెలిగా పొందినందుకు గర్వపడుతున్నాను. దేశంలో ప్రతి భార్యా, ప్రతి తల్లీ నీలా ఆలోచించి తనవాళ్లను కొంతకాలమైనా దేశ రక్షణకోసం పంపించాలి. నా దేశం ఎప్పుడూ గొప్పదే! నీలాంటి వీరమాతల్నీ, వీరపత్నుల్నీ కన్నది!"

"అంత పెద్ద మాటలెందుకులే అన్నయ్యా! నా మనసుకి తోచింది చేశాను. ఎందుకని నువ్వడిగితే, నాకు సరి అనిపించింది చెప్పాను." తలవంచుకొని అన్నది.

వినయమన్నది విద్యతో మాత్రమే కాదు. ప్రాజ్ఞతతో కూడా వస్తుందని అనిపించింది ఆమెను చూసి. తన తల మీద చెయ్యి వేసి "తల్లీ! నీ ధైర్యమూ, తృప్తీ నీకు ఆలంబనగా నీవు సుఖంగా ఉండాలమ్మా!" మనస్ఫూర్తిగా ఆశీర్వదించాను.

# విగ్రహ సంకల్పం

**దేవులపల్లి దుర్గాప్రసాద్**



97010 96699

***బొమ్మల అవుసొరం సానామందికి ఉన్నాదనిపించింది. మనమే బొమ్మలు సేసి అమ్మితే ఎలాగుంటదనుకున్నా! మా అక్క బొమ్మలు బాగా సేస్తాది. కానీ ఇలా అమ్మకానికంటే, 'నాను సెయ్యలేన్రా. నీర్సంగా ఉన్నాదంటాది'! మా అయ్యా, అక్క కూడా కేకలేస్తారు సదువుకోమనీ! ఏదో సెప్పి, ఆ అరదరాతిరి ఒక దజను బొమ్మలు మా అక్క సేత సేయించా!***

'వెంకట్రావు చాలా తెలివైన కుర్రాడు. బుద్ధిమంతుడు. అలాంటివాడు ఇలా ఇల్లొదిలి పారిపోవాల్సిన అగత్యమేమొచ్చింది?' ఆందోళన నిండిన ఆలోచనలలోంచి అసలు కారణాన్ని అన్వేషిస్తున్నాడు కోదండరామస్వామి ఆలయ అర్చకుడు రమణాచారి.

గర్భగుడి వైపు నుండి మండపం వైపుగా వెళ్తూ, కొడుకుని కేకేసి గర్భగుడి దగ్గర ఉండమన్నాడు. ఆ విశాలమైన మంటపంలో ఒక మూల కూర్చుని మూగ వేదనతో కుమిలి పోతున్నాడు నారాయణ.

లోకానికంతా గుడ్డి నారిగాడే కానీ, రమణాచారి మాత్రం వాడిని 'నారాయణా' అని అసలు పేరుతోనే ఆప్యాయంగా పిలుస్తాడు. ఆ ఆప్యాయతకు మూలకారణం, నారాయణ గాన మాధుర్యమే! వాడి గొంతులో ఆర్ద్రత ఉంటుంది. భాషాసౌందర్యాన్ని మించిన భావావేశం ఉంటుంది. నారిగాడి పాటల్ని వినడం ఆ ఊరువారి అదృష్టంగా భావిస్తుంటారందరూ!

ఎలెక్ట్రిక్ పనుల్లో సహాయంగా వెళ్ళే నారాయణ ఒకసారి ఆ పనిలోనే ప్రమాదానికి గురయ్యాడు. గుడ్డివాడయిపోయాడు. అప్పటికి అతనికి ఇద్దరు పిల్లలు. పెద్దది సుశీల. రెండోవాడు వెంకట్రావు. అంతవరకూ అడపదడపా సాయంత్రాలవేళ కోవెల్లో తను పాడే భజన పాటలే... అప్పటినుండీ తన బ్రతుకు బండికి ఇంధనాలయాయి. భార్య నాలుగిళ్ళలో పనులు చేస్తూ సంపాదిస్తే, తను బజార్లలోనూ, సంతల్లోనూ పాటలు పాడి దాతలు ఇచ్చిన డబ్బులతో వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు తోడేసేవాడు.

మూడోకానుపులో పిల్లాడిని కని, భార్య చనిపోయింది. దాంతో మరింతగా చితికిపోయిందా కుటుంబం! తల్లి చేసే పని కూతురందుకుని, కుటుంబ భారాన్ని తన చున్నీతో నడుముకు కట్టుకుని, హైస్కూలు చదువును ఆ బడి మెట్లదగ్గరే వదిలేసింది. రెండోవాడు వెంకట్రావు, చదువులో చురుకైనవాడు. ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్నాడు.


వాడినెలాగైనా పెద్ద చదువులు చదివించాలన్నదే తండ్రీ కూతుళ్ళ ధ్యేయం. వాడిమీదే వాళ్ళ ఆశలన్నీ! మూడోవాడు రాజా ఐదేళ్ళవాడు. తన ముద్దు మాటలతో, చిలిపి చేష్టలతో ఆ ముగ్గురినీ నవ్విస్తూ వాళ్ళ శ్రమనీ, కష్టాలనీ తాత్కాలికంగానైనా మరిపిస్తూ ఉంటాడు.

పెద్ద పెద్ద అంగలతో నారాయణని సమీపించిన రమణాచారి, "ఏమైందిరా... అసలు ఏం జరిగింది?" అని ప్రశ్నించాడు.

వెంటనే ఘొల్లుమన్నాడు నారాయణ. "ఈ గుడ్డెదవ బతుకు పూర్తిగా సీకటై పోనాదండీ! మా యెంకట్రావు రాతిరి నుండీ కనబడ్డం నేదండీ బాబూ!" బెక్కుతూ చెప్తున్నాడు.

"ఈ రోజు వినాయకచవితి కదరా! మీ ఇంట్లోనే బొమ్మ పెట్టి పూజ చేస్తానని నిన్ననే నాదగ్గర వినాయక వ్రతకల్పం పుస్తకం కూడా పట్టుకెళ్ళాడు. బహుశా ఏ పత్రి గురించో, పువ్వుల గురించో వెళ్ళుంటాడులే!"

"అది కాదు బాబూ! ఈ రోజు పూజకి మాంచి రంగురంగుల ఇనాయకుడి బొమ్మ కావాలన్నాడు బాబూ! నిన్న రాత్రి సంతలో నాలుగు డబ్బులు ఎక్కువ వస్తాయి కదాని, గుడ్డెదవనికదా... పాటల మీద పాటలు పాడుకుంటూ ఆలీసం సేసీసేను. రాతిరి పది గంటలకి మా యెంకట్రావు నన్ను తీసుకెల్లనానికి ఒచ్చీదాకా నాకొంటి మీద తెలివినేదు. అప్పుడు సూద్దుం



కదా, బొమ్మలేటీ నేవు. ఉన్న ఒకటీ, రెండూ బొమ్మలు ఒక్కోటీ నలభై రూపాయలు సెప్తన్నారు. నా కాడ కూడినవే అరవై రూపాయలు. అంత సొమ్ములు బొమ్మకెట్టేస్తే ఇంక బువ్వేటి తింటాం అనుకుంటా ఆలోసిన్నేలోపు, అయి కూడా ఐపోనాయి. దాంతో నామీద సిర్రు బుర్రు లాడీసినాడు బాబూ!"

"అవున్రా! ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకో, ఏమిటో... ఈసారి వినాయక విగ్రహాలు అట్టే మార్కెట్టులోకి రాలేదు. చాలామంది ఈరోజు ఇదిగో ఇంతవరకూ కూడా అటూ, ఇటూ పరుగెడుతున్నారు ఆ బొమ్మలకోసం! అయినా లోకమంతా కొరత ఏర్పడితే నువ్వుమాత్రం ఏంచేస్తావ్?"

“రాతిరి ఇంటి కొచ్చినాక కూడా ఆడు అదే గుర్రుమీదున్నాడు. బువ్వ కూడా తిన్నేదు” అంటూ దుఖం పొంగుకొచ్చి ఆయాసం తన్నుకు రావడంతో దగ్గుతున్నాడు నారాయణ.

“దీనికంతా నాదిరా తప్పు!” సాలోచనగా అన్నాడు రమణాచారి.

“అదేటి బాబూ, తమరేటి చేస్తారు! ఏటో ఎప్పుడూ లేంది ఈపాలి సానా పట్టుమీదున్నాడండీ ఆడు... ఇనాయక పూస్సెయ్యాలని!”

“అదే చెప్తుంటా! వారం రోజుల క్రితం, మీవాడు సాయంత్రం ప్రసాదం పట్టుకెళ్ళడానికి వచ్చినపుడు మాటలమధ్యలో వినాయకుడి పూజచేస్తే చదువు బాగా వస్తుంది, అంతా మంచే జరుగుతుందని చెప్పా. అది వాడి బుర్రకి బాగా ఎక్కేసినట్టుంది!” అన్నాడు రమణాచారి.

ఇంతలో సుశీల వచ్చింది. రాగానే ఇద్దరూ ఆత్రుతగా అడిగారు, “కనిపించాడా?” అని. లేదంటూ బుర్ర అడ్డంగా ఊపుతూ స్తంభానికి చేరబడి కూలబడింది నీరసంగా.

“అవునే సుశీలా! నువ్వు మట్టితో బొమ్మలు బాగా చేస్తావుకదా, మీ తమ్ముడికి మాంఛి వినాయకుడి బొమ్మ చేసివ్వలేకపోయావా?” అడిగాడు రమణాచారి.

“ఆ ముస్సటా అయింది బాబూ! అరద రాతిరి పన్నెండు గంటలదాకా ఇదిలా బంకమన్నుతో ఇనాయకుడి బొమ్మలు సేస్తానే ఉంది, పతి దానికీ ఆడు ఏదో వంక పెడతానే ఉన్నాడు. ఈది దీపం కింద కూకుని అక్కా తమ్ముల్లు రెండో జాము రాతిరి దాకా ఇయే గుంజాటనలు పడతన్నారు. అంతేనండీ! అదే సూద్దం! మరి అగుపడనేదండీ!” గొంతు గాద్గదిక మయిపోయింది నారాయణకి.

“నేనేసిన బొమ్మలు బాలేవనీ, రంగులు నేవని అలిగెలిపోనాడు బాబూ! ఈ గుడిలోకే వచ్చి తొంగున్నాడనుకుని నానూ ఎల్లి ఇంటో తొంగున్నాను. ఇలా సేస్తాడనుకోలేదు!” ఏడుపు గొంతుతో చెప్తోంది సుశీల.

“సర్లెండ్రా! ఇప్పటికీ అట్టే టైమేం అయిపోలేదు. ఉదయం పది గంటలయింది. మధ్యాహ్నం భోజనానికైనా వచ్చి తీరతాడు. మీరేం దిగులు పడకండి. అంతకీ రాకపోతే నలుగురం నాలుగు దిక్కులా వెళ్ళి వెతుకుదాం. మన కోవెలకి వస్తుంటారు కదా ఎస్.ఐ. గారు, ఆయనికి కూడా చెప్దాం. కొద్దిగా ఓపికపట్టండి. వాడెక్కడికీపోడు. సుశీలా... అమ్మగారు నిన్ను పన్నెండుకల్లా రమ్మంది. పండగ స్పెషల్స్ ఏవో ఉన్నాయట, తీసుకెళ్ళడానికి...”

“ఆడు లేనిదే మాకెందుకు బాబూ, ఈ తిల్లూ, తిప్పలూ...”

“ఏమిటి, మీతోపాటూ ఆ పసివాడిని కూడా మాడ్చేస్తారేమిటి? అయినా తిండి మానేస్తే వెళిపోయిన వాళ్ళు తిరిగి వస్తారనుకుంటే సీతాదేవి దూరమైన తరువాత శ్రీరాముల వారూ కూడా అదే పని చేసుండేవారు. ఆంజనేయుడి అవసరమూ ఉండేది కాదు. రామరావణ యుద్ధమూ జరిగేదికాదు!” అని మందలింపుగా అంటూ సుశీలని తరువాత రమ్మని సైగ చేస్తూ ముందుకు కదిలాడు రమణాచారి.

★★★

వినాయకచవితి సాయంత్రం. అంతటా పండుగ కోలాహలం! వీధి వీధినా కొలువుతీరిన గణనాథులు! ఆడంబరాలతో హోరెత్తిస్తూ, అసలైన భక్తిని అడుగుకు నెట్టేస్తున్న మైకు సెట్లూ... రంగు రంగుల ఎలెక్ట్రిక్ లైట్లూ!

కోదండరామస్వామి కోవెల కూడా సందడిగా ఉంది భక్తులతో. తీర్థప్రసాదాలు ఇస్తున్న రమణాచారి ముఖంలో ఇంతలో వేయి దీపాల వెలుగు కనిపించింది.

నారాయణ పిల్లలతో గుడిలోకి వస్తూ కనిపించాడు. అందులో వెంకటరావు కూడా ఉన్నాడు!

“ఏరా వెంకట్రావ్, ఏమిటైపోయావు? నారాయణా ఎప్పుడొచ్చావ్రా వీడు?” అంటూ సంతోషంతో ప్రశ్నల వర్షం కురిపించేసాడు.

వాళ్ళకి దర్శనం చేయించాక, గర్భగుడి బాధ్యతను పక్కనే ఉన్న కొడుకుని చూసుకోమని, వాళ్ళతో పాటూ మంటపంలోకి వచ్చాడు రమణాచారి.

ఆ కుటుంబం అంతా రమణాచారి కాళ్ళకి దండం పెట్టి, అక్షతలతో ఆశీర్వాదం అందుకున్నారు. అపుడు చెప్పాడు వెంకట్రావు.

“నా సదువు గురించి మా అయ్యా, అక్కా కట్టపడ్డం నాకు బాదగా ఉండేది బాబూ! నానేటైనా పనిసేసి ఈల్లకి సాయపడదామంటే, ఈల్లొప్పుకోరు. సదువు సెడిపోద్దంటారు. మా కట్టాలు తీరాలంటే మీరు సెప్పినట్టుగా ఇనాయకుడి పూజ మాంచి రంగు రంగుల ఇగ్రహం యెట్టి మా ఇంటో బాగా సేద్దాం అనుకున్నానండీ! ఆ ముందురోజు సంతలో నా కల్ల ముందే బొమ్మలయిపోనాయి. మా అయ్యమీద సెడ్డ కోపం వస్సీసినాది. కాపోతే మా అయ్యని సంత నుండి తీసుకొస్తునపుడు కూడా కొంతమంది బొమ్మలు దొరకలేదని అనుకోడం ఇన్నాను. ఇంటికాడ కొచ్చిన తర్వాత కాస్త నిమ్మలంగా ఆలోసింసాను. బొమ్మల అవుసొరం సానామందికి ఉన్నాదనిపించింది. మనమే బొమ్మలు సేసి అమ్మితే ఎలాగుంటదనుకున్నా! మా అక్క బొమ్మలు బాగా సేస్తాది. కానీ ఇలా అమ్మకానికంటే, ‘నాను సెయ్యలేన్రా. నీర్సంగా ఉన్నాదంటాది’! మా అయ్యా, అక్క కూడా కేకలేస్తారు సదువుకోమనీ! ఏదో సెప్పి, ఆ అరదరాతిరి ఒక దజను బొమ్మలు మా అక్కసేత సేయించా!” విజయగర్వంతో, నవ్వుముఖంతో చెప్తున్నాడు వెంకట్రావు.

“ఆ బొమ్మలన్నీ అట్టుకెల్లి మన ఊరిసివర అఫిసియల్ కోలనీ వోల్లకి ఒకో బొమ్మా ముప్పై రూపాయలకి అమ్ముకొచ్చీనాడు బాబూ! ఆ రాతిరంతా కూకుని మంటెట్టి ఆటిని కాల్సి, తెల్లవారగట్టే ఆడకెల్లి అమ్ముకుని పదకొండుగంటలకొచ్చినాడండీ” కొడుకుని గూర్చి గర్వంగా చెప్తున్నాడు తండ్రి.

“ఇంత ఘనకార్యం చేసాడనుకోలేదు” ఆనందంగా అన్నాడు రమణాచారి.

“నాకు మంచి చెప్పులూ, మా అయ్య ఆయాసానికి మందులూ, మా తమ్ముడికి కొత్త బట్టలూ, ఆడి కోసం కొత్త పెన్నూ కొనుక్కొచ్చీనాడండీ.” వెలుగు నిండిన కళ్ళతో చెప్తోంది సుశీల.

‘మీరు సెప్పినట్టుగా ఇనాయకుడి పూజ మా ఇంటో సాన బాగా సేసామండీ. ఈ రోజు. మా అక్క సేత మరొక మంచి బొమ్మ చేయించుకుని మరీ.” సంతృప్తిగా సంతోషంగా చెప్తున్నాడు వెంకట్రావు.

“నీ సంకల్ప బలం ఆ వినాయక విగ్రహమంత గొప్పదిరా వెంకట్రావ్! మీ వాళ్ళందరినీ ఆనందింప చేద్దామనే నీ ఆలోచన

ఉన్నతమైనది. ఇదే స్ఫూర్తి నీ చదువులో కూడా కొనసాగించు. బాగా చదువుకుంటే నువ్వూ సుఖపడొచ్చు. నీ వాళ్ళనీ సుఖపెట్టొచ్చు. కానొరేయ్, డబ్బు పాపిష్టిది సుమా. ఇలాంటి సంపాదనలకలవాటు పడితే చదువు సన్నగిల్లొచ్చు. జాగ్రత్తగా ఉండు. అయినా నీకు అండగా ఆ దైవబలముంటుందిలే. ఈ రోజు అసలైన పండగలా ఉందిరా!" అంటూ ఆనందభాష్పాలతో ఆశీర్వదించాడు రమణాచారి.



0014088291925

# ఆ ఇంట్లో ఒకరోజు

సాయి బ్రహ్మానందం గొర్తి

## విశిష్ట అతిథి కథ

“చాలా ఏళ్ళుగా అంతకంటే పెద్దది మమ్మల్ని పట్టి పీడిస్తోంది. దాని ముందు...” మధ్యలో ఆపేశాడు స్టీవ్.

ఏమిటన్నట్టు కళ్ళు చిట్లించి చూశాను.

అతను చెయ్యూపుతూ, వెనుదిరిగి, తనలో తానే గొణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

‘వృద్ధాప్యం’ అన్నమాట చిన్నగా వినబడింది నాకు.

★★★

విశాలమైన ఆ భవంతి ముందు కారు ఆపాను. గేట్ ఇంటర్‌కామ్ బజ్జర్ నొక్కి, ‘మిస్టర్ స్టీవెన్సన్, నేను హారీ’ అని చెప్పగానే, “వెల్‌కమ్” అంటూ గేటు తెరిచాడు.

మెల్లగా గేటు తెరుచుకోగానే కారు లోపలికి పోనిచ్చాను. ఇంటిముందు డ్రైవేలో స్టీవ్ నాకోసం ఎదురు చూస్తూ కనిపించాడు. కారు దగ్గరకి వచ్చి నన్ను ఆలింగనం చేసుకున్నాడు.

స్టీవ్ చూడ్డానికి క్లింట్ ఈస్ట్‌వుడ్‌కి మరింత ముసలితనం వస్తే ఎలా ఉంటుందో అలా ఉన్నాడు. స్టీవ్‌కి ఎనభై అయిదేళ్ళు పైనే వయసు ఉంటుంది. ఆర్మీలో పనిచేయడం వల్లనేమో శరీరం ఇంకా దృఢంగానే ఉంది. మొహంలో ముడతలు తెల్లని గీతలు గీసినట్టు స్పష్టంగా కనిపిస్తున్నాయి. డెల్ కంప్యూటర్స్‌లో నేనూ, బిల్ కలిసి పనిచేస్తాం. అట్లాంటాలో ఒక పెద్ద కంపెనీలో వ్యాపార నిమిత్తమై ఇద్దరం వచ్చాం. మా కంపెనీకి పది మిలియన్ల డీల్ వచ్చింది. థాంక్స్ గివింగ్ హాలిడేస్ రావడంతో కొన్ని పరిస్థితుల వల్ల అది సోమవారానికి వాయిదా పడింది. నేను సోమవారం వరకూ ఉండాల్సి వచ్చింది. మాకు ఆ కంపెనీ సీ.ఈ.ఓ తో మీటింగ్ ఉంది.

వెనక్కి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళి రావడం కంటే ఇక్కడే అట్లాంటాలో ఉండిపోదామని అనుకున్నాం. అసలు బిల్ అట్లాంటాలో ఉండి, నేను వెనక్కి వెళ్ళిపోవాలి. థాంక్స్ గివింగ్‌కి బిల్ భార్య లోరా షికాగో రావలసిందేనని పట్టుబడితే, బిల్ నన్ను పని ముగించుకు రమ్మన్నాడు.

అనుకోని పరిస్థితుల్లో నేను ఈ ఊరు మాంట్ గోమరీ వచ్చాను.

ఇంటి ప్రధాన ద్వారం బయట “స్టీవ్ మెకెన్నా, క్రిస్టీ మెకెన్నా” పేర్లు చెక్కి ఉన్న ఒక ఉడెన్ బోర్డ్ ఒకటి కనిపించింది.

లోపలికి తీసుకెళ్ళి సోఫాలో కూర్చోబెట్టాడు స్టీవ్.

"నువ్వు రావడం చాలా సంతోషంగా ఉంది. బిల్ నాకు ఫోనులో అంతా చెప్పాడు!" అంటూ నారింజరసం ఇచ్చాడు. కుశలప్రశ్నల తరవాత క్రిస్టీని ఒక వీల్‌చైర్లో తోసుకుంటూ తీసుకొచ్చాడు. ఆమెను చూడగానే సినిమా తార మెరిల్ స్ట్రీప్ గుర్తొచ్చింది. ముఖ కవళికలు అలానే ఉన్నా, ముడతలు పడ్డ చర్మం ఆమె వయసుని చెబుతూనే ఉంది. క్రిస్టీ చూడ్డానికి స్టీవ్ కంటే పెద్దదానిలాగే కనబడింది. మాట కూడా వణుకుతూ ఉంది.

నన్ను చూసి, ఒక్కసారిగా లేవబోయి, పడిపోతుండగా స్టీవ్ వచ్చి పట్టుకున్నాడు.

"హనీ! నన్ను పిలవచ్చుగా...?" అంటూ చికాగ్గా ఆమె కేసి చూసాడు.



నేను వస్తున్నానని తెలిసి నిన్న రాత్రినుండి తెగ ఆరాట పడి ఏర్పాట్లు చేసేటప్పుడు కాలు జారి పడిందని చెప్పాడు.

భోజనానంతరం వ్యాహ్యాళిలో బిల్ వాళ్ళ అమ్మా, నాన్నల గురించి నాకు చాలా చెప్పేవాడు.

"డ్రైవ్ ఎలా ఉంది?నువ్వు హైవే 85 మీద వచ్చావా?కొంచెం వైన్ తీసుకుంటావా?" స్టీవ్ ప్రశ్నల మీద ప్రశ్నలు. సాయంత్రం తీసుకుందామని చెప్పాను.

స్టీవ్ వాళ్ళ ఇల్లు చూపించాడు. అది ఇల్లు కాదు. పది బెడ్‌రూములున్న విశాలమైన పెద్ద భవంతి. నాకు బిల్ స్టడీ రూమూ, బెడ్రూమూ అన్నీ చూపించాడు.

బిల్ చిన్నప్పటి ఫోటోలూ, సర్టిఫికేట్లూ ఫ్రేముల్లో పెట్టి, ఆ గది గోడలమీద కనిపించాయి. బిల్ రూమ్ రాక్ ఎన్ రోల్ సింగర్ ఎల్విస్ ప్రెస్లీ ఫోటోలతో నిండిపోయింది.

"బిల్ గిటార్ బాగా వాయిస్తాడు" స్టీవ్ చెప్పాడు. నాకూ తెలుసు, నేనూ బిల్ గిటార్ ప్రోగ్రాములకి వెళ్ళాను.

మేడ మెట్ల దగ్గర ఒక గది వైపు వెళ్ళి తలుపు తీయబోతూ ఉండగా "స్టీవ్" అంటూ వద్దన్నట్టు తలాడించింది క్రిస్టీ.

వెంటనే అతను వెనక్కి వచ్చేశాడు.

స్టీవ్ నాగురించీ, ఇండియా గురించీ అడిగాడు. బిల్ లాగే నేనూ మా తల్లిదండ్రులకు ఒక్కడ్నే కొడుకుననీ, ఒక చెల్లెలు ఆస్ట్రేలియాలో ఉంటోందని చెప్పాను. మా అమ్మా, నాన్నా రాజమండ్రిలో ఉంటారని చెప్పాను.

"ఇంత పెద్ద ఇంట్లో మీరిద్దరే ఉంటారా? ఎలా మేనేజ్ చేస్తారు?" ఆశ్చర్యం వేసింది నాకు. నెలనెలా పనివాళ్ళు వస్తారనీ,

చిన్నచిన్న పనులు తనే చేస్తాననీ చెప్పాడు. ఎంతైనా కొన్ని పనులు మనమే చేసుకోక తప్పదని నవ్వుతూ అన్నాడు.

"ఈ ఇంట్లోనే నేను పెరిగాను. బిల్ కూడా. మాకు చాలా జ్ఞాపకాలు ఈ ఇంటితోనే ముడిపడి ఉన్నాయి. బిల్ మమ్మల్ని కేలిఫోర్నియా వచ్చేయమంటాడు!" అన్నాడు.

నేనూ అదే అన్నాను కూడా. వచ్చేయచ్చుగా అన్నట్లు. అతను గట్టిగా నవ్వాడు.

"మనమందరం మనుషుల్ని ప్రేమిస్తాం అన్న భ్రమలో ఉంటాం. కానీ – వస్తువుల్నీ, ఊళ్ళనీ, ఇళ్లనీ ప్రేమించినంతగా దేనినీ ప్రేమించం" కళ్ళు ఎగరేస్తూ అన్నాడు. గట్టిగా నవ్వేసాను.

మరలా అతనే అన్నాడు.

"ఇల్లు వదలడం అన్నది ఒక మానసిక సమస్య. పరాయి వాళ్ళింట్లో ఉంటే, స్వేచ్ఛ ఉండదేమోనన్న పిరికితనం".

"బిల్ పరాయివాడు ఎలా అవుతాడు? మీ కొడుకే కదా?" నవ్వుతూ రెట్టించాను.

"వాడు పరాయి కాదు. వాడిల్లు పరాయిది. పనికిరాని ఎన్నో మానసిక అంశాలూ, అహాలూ ఉంటాయి. అంతే!"

అతను చెప్పింది పొడిగించక, నేను వేరే విషయం మీదకి దృష్టి మరల్చాను.

భోజనం చేశాక స్టీవ్ బయటకి వెళదామ్ అంటే నేనూ వస్తానని బయల్దేరాను. స్టోరులో ఉండగా క్రిస్టీ కాల్ చేసింది.

"మనం వెంటనే వెనక్కి వెళ్ళాలి, క్రిస్టీ పడిపోయిందట".

హుటాహుటిన వెనక్కి వెళ్ళాం. వెళ్ళేసరికి క్రిస్టీ నేలమీద పడిపోయి ఉంది. అంతా బాగానే ఉంది. కానీ లేవలేక పోతోంది. దూరంగా వీల్‌చైర్ ఒరిగిపోయి పడుంది.

నేనూ, స్టీవ్ మెల్లగా లేవనెత్తి, వీల్‌చైర్లో కూర్చో బెట్టాం.

"నీకెన్నిసార్లు చెప్పినా బుద్ధిరాదు!" అంటూ క్రిస్టీ మీద కసురుకున్నాడు స్టీవ్.

సాయంత్రం థాంక్స్ గివింగ్ డిన్నర్ కని ఏదో చేద్దామని కిచన్లోకి వెళ్లిందట. ఫ్రిజ్ డోరు తీస్తుండగా జారి పడిపోయిందనీ చెప్పింది.

ఆ సాయంత్రం థాంక్స్ గివింగ్ డిన్నర్ కలిసి చేశాం. స్టీవ్, క్రిస్టీ నేను వచ్చినందుకు చాలా సంతోషించారు. వాళ్ళ ఆనందం ప్రతీమాటలోనూ, ముఖ్యంగా వారి కళ్ళల్లోనూ కనిపిస్తూనే ఉంది. స్టీవ్ కోసం ఒక స్క్రీమింగ్ ఈగిల్ వైనూ, క్రిస్టీకి స్వెటరూ బహుమతులు తీసుకెళ్ళాను. అవి చూసి వాళ్ళ ఆనందానికి అవధుల్లేవు. క్రిస్టీ అయితే కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"ఇంత ఎక్స్పెన్సివ్ వైన్..." అంటూ స్టీవ్ అనబోతే అది నేనూ, బిల్లూ కలిసి కొన్నాం అని చెప్పాను. ఆ సాయంత్రం ఎంతో సంతోషంగా గడిచిందని వాళ్ళిద్దరూ ఒక టికి పదిసార్లు అన్నారు. వాళ్ళని చూస్తే నాకూ ముచ్చటేసింది.

క్రిస్టీకి త్వరగా నిద్రపోయే అలవాటట. ఆమెను స్టీవ్ పడకగది వైపుగా తీసుకెళ్ళాడు.

"రాత్రి ఎనిమిదైతే చాలు. క్రిస్టీ నిద్రకు ఆగలేదు. అయ్యో... మందులు ఇవ్వడం మరచిపోయాను.." అంటూ మరలా వెనక్కి వెళ్ళి కొద్ది సేపయ్యాక తిరిగి వచ్చాడు.

ఇద్దరం కాసేపు ప్రెసిడెంట్ ఎలక్షన్ గురించీ, పొలిటిక్స్ గురించీ మాట్లాడుకున్నాం. ఇరవయ్యేళ్ళ వయసులో స్టీవ్ తను రెండో ప్రపంచ యుద్ధంలో పని చేసానని ఆ సంగతులనీ చెప్పుకొచ్చాడు. మాటల్లో బిల్ చదువూ, క్రిస్టీతో తన పెళ్లీ, ఇవన్నీ ప్రస్తావనకు వచ్చాయి.

"బిల్ మమ్మల్ని కాలిఫోర్నియా వచ్చేయమంటాడు. ఎలా రావడం? అలవాటైన ఊరు. ఇక్కడ కొంతమంది ఫ్రెండ్స్ ఉన్నారు. రోజూ మధ్యాహ్నం బిలియర్డ్స్ ఆడడానికి వెళతాను. క్రిస్టీకి ఆరోగ్యం చెడిపోయాక వెళ్ళడం తగ్గించేసాను. ఒక్కతినీ వదిలి వెళ్ళలేను" చెబుతుంటే స్టీవ్ గొంతు మారింది.

"నిజానికి ఇవాళ బిల్ వద్దామనే అనుకున్నాడు. మీ గురించి తరచూ చెబుతూనే ఉంటాడు. మీరంటే అతనికి చాలాప్రేమ. తను రాలేక నన్నువెళ్ళమని అడిగాడు. నేనూ ఖాళీగానే ఉన్నాను కనుక వచ్చాను. మీకు అనవసరంగా నా వల్ల ఇబ్బంది కలిగింది. సారీ..." నొచ్చుకుంటూ అన్నాను.

"నాట్ ఎటాల్! నిజానికి నువ్వు వస్తున్నావని తెలిసి క్రిస్టీ చాలా సంతోషించింది. తనకీ అన్నీ ఒక పద్ధతి ప్రకారం ఉండాలి. ఆ హడావిడిలో జారి పడి కాలు బెణికింది. అందుకే వీల్‌ఛైర్లో ఉంది. ఈ వయసులో మతిమరుపొకటి. అందుకే ఆమెను వదిలి బయటకు వెళ్ళడం తగ్గించేసాను. రెండ్రోజుల క్రితం బిల్ వస్తున్నాడనీ, వాడికోసం ఇల్లు శుభ్రం చేద్దామని మొదలుపెట్టింది. నేను ఇక్కడ టీవి చూస్తున్నాను. వంటింట్లోనుంచి ఒకటే కాలిన వాసన. వెళ్ళి చూస్తే స్టవ్ మీద నల్లగా మాడి మసైన చికెన్. ఒక్క క్షణం ఆలస్యం అయ్యుంటే మంటలు వచ్చుండేవి. స్టవ్ మీద పెట్టానన్న సంగతే మర్చిపోయింది. సారీ... మా చెత్తంతా నీకు చెప్పి బోర్ కొట్టిస్తున్నా" అంటూ నాకేసి చూసాడు.

లేదన్నట్టు తలూపాను. మీరు కాలిఫోర్నియా వస్తే బావుండేదికదా? అని మరోసారి అన్నాను.

"చెప్పినంత సులభం కాదు, ఇక్కడ్నుండి కదలడం ఒప్పు కుంటాను. బిల్ ఉంటే కాస్త బాసటగా ఉంటుంది. వాడున్న ఇంటి వెనుక ఇన్–లాస్ ఎపార్ట్మెంట్ కట్టిస్తానని అన్నాడు. ఒక్కోసారి అనిపిస్తూ ఉంటుంది. మా నాన్న నాగురించి వర్రీ అయ్యేవాడు. నేను యుద్ధాలూ, సైన్యం అంటూ ఎపుడూ వాళ్ళని పట్టించుకోలేదు. నేను కూడా చాలా ఆలస్యంగా పెళ్ళి చేసుకున్నాను. క్రిస్టీతో పెళ్ళయిన కొన్నే ళ్ళకి మా అమ్మా, నాన్నా పోయారు. బిల్ పుట్టేసరికి నాకు నలభై అయిదేళ్లు. వాడికీ వాడి కెరీర్ ముఖ్యం కదా? ఇక్కడ మా మాంట్ గోమరీలో వాడికి నచ్చే ఉద్యోగం ఎక్కడా దొరకదు. చిన్నప్పటినుండీ వాడికి కంప్యూటర్ల పిచ్చి. వాడి భార్య కూడా అదే ఉద్యోగం! వాడి జీవితంలోకి మేం చొరబడ కూడదనుకున్నాం. నువ్వు చెప్పినట్టు రావచ్చు. రాలేని పరిస్థితి... అంతే!" చెబుతుంటే అతని గొంతు గాద్గదమయ్యింది. అనవసరంగా అతన్ని మరోసారి కెలికి బాధ పెట్టేనా అనిపించింది.

మెల్లగా అతను సోఫాలోంచి లేచి హాలులో మెట్ల వైపుగా నడిచాడు. వెనక్కి తిరిగి నన్ను కూడా రమ్మన్నట్టు సైగ చేసాడు. నేనూ లేచి వెళ్ళాను.

ఒక గది తలుపు దగ్గర ఆగిపోయాడు. ఇంతకుముందు ఆ గది తెరవబోతుంటే క్రిస్టీ వద్దని వారించడం గుర్తొచ్చింది.

'యూ మేడ్ మై డే, జెంటిల్మన్...!' అంటూ నన్ను ఆలింగనం చేసుకొని మెల్లగా తలుపు తెరిచి లైటు వేసాడు.

ఆ గదంతా లైట్లతో మిరిమిట్లు గొనుపుతూ ఉంది. చాలా పెద్ద గదిలో ఒక వైపుగా పెద్ద క్రిస్మస్ ట్రీ అలంకరించబడి ఉంది. ఆ చెట్టు చుట్టూ చాలా గిఫ్ట్స్ పేరుకు పోయి ఉన్నాయి. ఆ చెట్టు దగ్గర నేల మీద కూర్చున్నాడు స్టీవ్. నన్నూ కూర్చోమని సైగ చేసాడు.

"మా ఇంట్లో క్రిస్మస్ అతి పెద్ద పండగ. ప్రతీ ఏటా ఘనంగా జరుపుకునే వాళ్ళం. మా కజిన్స్, రెలటివ్స్ అందరూ వచ్చే వారు. చాలామంది కజిన్స్ పోయారు. ప్రతీ ఏడూ అందరికి గిఫ్ట్స్ కొన్నట్టే బిల్ కోసమూ గిఫ్ట్స్ కొంటాం. వాడు క్రిస్మస్‌కి వచ్చి పన్నెండేళ్ళ పైన దాటింది. ఈ గిఫ్ట్స్ అన్నీ గత పన్నెండేళ్ళగా వాడికోసం కొన్నవి. ఏటా వాడి కోసం రెండు గిఫ్ట్స్ కొంటాం. ఒకటి ఈ క్రిస్మస్ చెట్టు దగ్గర, మరోటి వాడు రాకపోతే పంపడానికి. ఎప్పుడైనా క్రిస్మస్‌కి వాడు వస్తే వాడిచేత ఓపెన్ చెయ్యిద్దామని నేనూ, క్రిస్టీ అనుకుంటూ ఉంటాం. వాడు క్రిస్మస్‌కి వచ్చే సంవత్సరం వస్తానంటూ వాయిదా వేస్తాడు. చాలా ఏళ్లుగా ఇదే వరస. మేమూ అడగడం మానేసాం. వీలు కుదిరితే వాడు రాకుండా ఉంటాడా? అని సర్ది చెప్పుకుంటూ ఉంటాను. ఇవాళ అనుకోకుండా నువ్వొచ్చావు. ఈ గిఫ్ట్స్‌లో కొన్ని నువ్వు ఓపెన్ చెయ్యి. కొన్ని నువ్వు తీసుకో, బిల్‌కి కొన్ని ఇయ్యి. ఇదంతా నేను క్రిస్టీకి చెప్పదలచుకోలేదు. చెప్పినా తనకి గుర్తుంటుందని అనుకోను. ఈ వ్యాధితో ఎన్నాళ్లు బతుకుతుందో తెలీదు. ఈ అల్జీమర్స్ తనే కాదు, నేనూ భరించలేక పోతున్నాను. ఏదీ గుర్తుండదు. ఏం చేస్తోందో కూడా తనకి తెలియదు. తరచూ న్యూమోనియా జ్వరం వంట్లో శక్తినంతా తినేస్తోంది. ఎన్నో చేయాలని ఉంటుంది కానీ, శరీరం సహకరించదు. ఒక్కోసారి బతకడం ఇంత అవసరమా? అనిపిస్తూ ఉంటుంది.." చెబుతున్నంత సేపూ అతని కళ్ళలో నీళ్ళు గమనిస్తూనే ఉన్నాను.

నేను వెంటనే లేచి అనునయంగా భుజం తట్టాను. అక్క డున్న గిఫ్ట్ ఒకటి చేతిలోకి తీసుకొని, బిల్‌కి ఇస్తానని చెప్పాను. అతని ఎదుటే గిఫ్ట్ చుట్టూ కట్టిన రంగు కాగితాలు చించి తెరచి చూసాను. ఆశ్చర్యంగా అది ఒక గోల్డ్‌కలర్ వాచ్. అది అసలు సిసలైన గోల్డేనని స్టీవ్ అన్నాడు. అక్కడ గిఫ్ట్స్ అన్నీ పరికించి చూశాను. కొన్నింటి మీద బిల్ పేరూ, బిల్ భార్య లోరా పేరునా చాలానే ఉన్నాయి.

"ప్రతీ ఏటా థాంక్స్ గివింగ్ అవ్వగానే ఈ గది తెరుస్తాం. ఏడాది పాటు పేరుకున్న దుమ్మునీ, ధూళినీ క్రిస్టీ స్వయంగా శుభ్రపరుస్తుంది. పని వాళ్ళని పెట్టమన్నా వినదు. అదో రకం పిచ్చి. క్రిస్మస్ ట్రీ డెకరేషన్ పనుల్లోనే మా కాలం గడిచిపోతుంది. ప్రతీ ఏటా వాడూ మాకు బహుమతులు పంపుతాడు. కానీ వాడు లేకుండా... ఇవి..." అతనికి మాటలు పెగల్లేదు.

"స్టీవ్.." అతన్ని చూస్తే బాధ కలిగింది.

వెంటనే అతను సంబాళించుకుని, "నా మనసులోని చెత్తంతా నీమీద కుమ్మరిస్తున్నాను... క్షమించు.. ఒంటరితనం క్రూరమైంది.." అన్నాడు.

ఒక్కసారి తలుపు దగ్గర శబ్దం అయితే ఇద్దరం అటుగా చూశాం.

తలుపు దగ్గర వీల్‌ఛైర్లో క్రిస్టీ... ఆమె నిస్తేజంగా మాకేసి చూస్తూ ఉంది.

★★★

ఆ మర్నాడు ఉదయం వెళ్తూ ఉండగా వాళ్ళు నాకు గిఫ్ట్ ఇచ్చారు. వద్దని అంటే ఇది థాంక్స్ గివింగ్ ఆనవాయితీ అన్నారు. వాళ్ళని కష్టపెట్టడం ఇష్టం లేక తీసుకున్నాను.

"నిన్ను కలవడం చాలా సంతోషంగా ఉంది హరీ! చాలా రోజుల తరవాత క్రిస్టీ కళ్ళలో సంతోషం చూసాను. అఫ్ కోర్స్! నాక్కూడా..." అంటూ ఇద్దరూ ఆలింగనం చేసు కున్నారు.

కార్ స్టార్ట్ చేస్తూ ఉండగా ఉండమన్నట్టు సైగ చేసాడు స్టీవ్. కారు అద్దాల కిటికీ తెరిచాను.

"నీ నుండి నాకొక ప్రామిస్ కావాలి" నాకేసి చూస్తూ అన్నాడు. అలాగేనన్నట్లు తలాడించాను.

"క్రిస్మస్ ట్రీ గురించా?" సందేహంగా చూస్తూ అడిగాను.

కాదన్నట్టు తలాడించాడు.

"క్రిస్టీకి అల్జీమర్స్ అన్న విషయం బిల్‌కి చెప్పొద్దు. వాడికి తెలీదు. వాడు వచ్చీ చాలా ఏళ్ళయింది. ఎప్పుడైనా స్కైపులో మాట్లాడినప్పుడు అది తెలియకుండా మేనేజ్ చేసాను. దయచేసి వాడికి చెప్పొద్దు. చెప్పి వాడిని కష్టపెట్టడం మాకు ఇష్టం లేదు. ప్లీజ్".

"అల్జీమర్స్, అదేం చిన్నది కాదు.." అప్రయత్నంగా అన్నాను. అతను విరక్తిగా నవ్వాడు.

"చాలా ఏళ్ళుగా అంతకంటే పెద్దది మమ్మల్ని పట్టి పీడిస్తోంది. దాని ముందు..." తలూపుతూ మధ్యలో ఆపేశాడు స్టీవ్.

ఏమిటన్నట్టు కళ్ళు చిట్లించి చూశాను.

అతను చెయ్యూపుతూ వెనుతిరిగి, గొణుగుతూ లోపలికి వెళ్లిపోయాడు. 'వృద్ధాప్యం..'

మెల్లగా కారు పోనిచ్చాను.

స్టీవ్ పరిస్థితి చూస్తే జాలేసింది. ఒక పక్క ఇల్లు వదిలి వెళ్లలేడు. మరో పక్క కొడుకు కోసం ఆరాటం. వీటి మధ్య నలిగిపోయే రోజు వారీ సమస్యలు. బిల్ గురించి నాకు బాగా తెలుసు. రోజూ తలచుకుంటూ ఉంటాడు. ఎన్నో సార్లు తన తల్లిదండ్రుల గురించి చెప్పాడు. ఇప్పుడు కళ్ళారా స్టీవ్, క్రిస్టీల పరిస్థితి చూసాక చెప్పాలా? వద్దా? అన్నది నా మనసుని దొలిచివేస్తోంది.

ప్రతీ క్షణం వాళ్ళు బిల్ వస్తే బావుండును. తమతో ఉంటే బాగుండుననీ కాలం వెళ్ళబుచ్చుతుంటారు. ఒక్కోసారి బిల్ వస్తున్నట్లుగానే భ్రమిస్తారు. క్రిస్మస్ ట్రీ చుట్టూ వాళ్ళ ఎదురుచూపులు తిరుగుతూ ఉంటాయి.

స్టీవ్ బిల్ కోసం తాపత్రయ పడ్డట్టు నా కోసం మా నా... ఒక్కసారి ఆలోచన్ల అగ్నిపర్వతం బ్రద్దలయ్యింది.

పంట కాలవ మీదుగా నన్ను బడికి దించుతూ నాన్న కనిపించాడు.



# బోన్సాయ్ బ్రతుకు

**అబ్బూరి ఛాయాదేవి**

**కథామార్గదర్శి కథ**

> ***"ఆ తురాయి చెట్టు ఎంత పెద్ద చెట్టు అయిందో చూడు.***
> ***బయట విశాలంగా ఉన్నచోట స్వేచ్ఛగా పెరిగింది కదూ, ఎంతటి గాలిదుమారం వచ్చినా... అది కించిత్తు చలించలేదు. పైగా అంతమంది జనానికి ఆశ్రయం కల్పించి వాళ్ళకి ఆసరాగా నిలిచింది. ఎండవేళల ఎంత మంది దాని నీడలో సేద తీర్చుకుంటూ ఉంటారో!"***
> ***"అందులో వింత ఏముందే?"***

ఆఫీస్ నుంచి ఇంటికి వచ్చేసరికి గుమ్మంలో ఎదురుగా ఉత్తరాలు కనిపిస్తే ఏదో చెప్పలేనంత ఉత్సాహం పుట్టుకొస్తుంది. ఆత్మీయులు ఎదురై ఆప్యాయంగా పలకరించినట్లే అనిపించి ఆఫీస్ పని వల్ల కలిగిన అలసట అంతా ఇట్టే మాయం చేసినట్లు హాయిగా ఉంటుంది మనసుకి. ఆఫీసు నుంచి రాగానే ఈదురో దేముడా అంటూ వంటింట్లోకి అడుగుపెట్టేందుకు బదులు, కూనిరాగం తీస్తూ కులాసాగా కాఫీ చేసుకొని తాగబుద్ధి అవుతుంది. అందులోనూ పరిచితమైన దస్తూరితో ఇన్లాండ్ లెటర్స్ గాని, కవర్లు గాని వస్తే చకచకా పకోడీలో, బజ్జీలో చేసుకుని తినేటంత ఓపిక, ఉత్సాహం పుట్టుకొస్తాయి. ఉత్తరాలు రాయటానికి బద్ధకం అనిపించినా ఎక్కడ నుంచైనా రోజూ ఉత్తరాలు రావాలనే ఆశ మాత్రం ఉంటుంది!

అనుకోని ఉత్తరం అది! అక్కయ్య ఏనాడు ఉత్తరం రాయనిది ప్రత్యేకంగా రాసిందంటే ఏదో విశేషం ఉండి తీరాలి. ఉత్తరం విప్పుతుంటే కొంచెం భయంలాంటిది వేసింది... 'ఏమైనా దుర్వార్త కాదు కదా' అని! అవును మరి, అంతా సవ్యంగా ఉంటే ఒక్కళ్లూ ఒక్క ఉత్తరం ముక్క రాయరు.

"అమ్మలూ,

నా ఉత్తరం నీకు చాలా ఆశ్చర్యం కలిగించిందనుకుంటాను. నేనూ, మీ బావగారూ అక్కడికి మీ ఊరికి రాబోతున్నామని చెబితే మరింత ఆశ్చర్యపోవచ్చు. కాశీ, హరిద్వారం వెళ్లాలని ఎన్నాళ్ల నుంచో అనుకుంటున్నాము. ఈనాటికి వీలు చిక్కింది. మేము రావడం వల్ల మీకు ఏ విధమైన ఇబ్బంది కలగదనుకుంటాను.."


"ఏమండీ, మా అక్క, బావగారు వస్తున్నారట ఇక్కడికి" అన్నాను ఉత్సాహంగా.

"నిజంగానా! ఎప్పుడు? ఏది ఉత్తరం ఇలాతే" అంటూ నా చేతిలోంచి లాక్కున్నారాయన. నేను వంటింట్లోకి వెళ్లాను కాఫీ వగైరాలు రెడీ చెయ్యటానికి.

నా పెళ్లయిన తరువాత మొట్టమొదటిసారిగా ఈ ఊరికి మా ఇంటికి వస్తున్నారు మా అక్క, బావ గారూ. ఎన్ని సంవత్సరాల

నుంచో ఎదురు చూసిన సంగతి. ఎప్పుడూ ఆ పల్లెటూరు వొదిలి కదలరు వాళ్ళిద్దరు. పిల్లా పీచూ, గొడ్లు గోతం, పంటలూ కోతలూ అంటూ ఏవో వంకలు పెట్టి వాళ్ల ఊరు వదిలి ఎక్కడికి వెళ్ళరు. అటువంటిది వాళ్లు ఈ మహా పట్నానికి మా ఇంటికి వస్తున్నారు ఈనాటికి.

అక్కయ్య నాకు మల్లే చదువుకోలేదు. చదువుకోలేదంటే... దాన్ని ఐదో క్లాసుతోటే చదువు మాన్పించేసారు మా నాన్నగారు. ఆడపిల్లకి చదువేమిటి? చాకలి పద్దు రాయగలిగితే చాలదా అనుకునే రోజులవి. ఒక దశాబ్దం తరువాత పుట్టిన నాటికి, ఆడపిల్లకి చదువు అనవసరమా అనే మీమాంస తగ్గిపోయింది. కాలంతో పాటు నాన్నగారు కూడా మారటం నా అదృష్టం.



నన్ను కాలేజీలో చేర్పించడానికి కూడా వెనుకాడలేదు. పెద్ద చదువు చదివిం తరువాత పెళ్లి చేసుకుని ఇల్లు వాకిలి చూసుకుంటూ, కేవలం గృహిణిగా ఉండిపోవడానికి ఏ ఆడపిల్లకి మనస్కరించదు. చదివిన చదువు సద్వినియోగం చేసుకోవాలనీ, జీవితంలో స్వయంగా ఏదో సాధించాలనే తపన బయలుదేరుతుంది. అదే విధమయిన తపన నాలోనూ రేగింది. ఆయన మంచి ఉద్యోగంలో ఉన్నప్పటికీ నేనూ ఉద్యోగంలో చేరాను!

అక్కకి చదువు లేకపోవటంతో పల్లెటూరి సంబంధం కుదిరింది. బావగారు చదువుకున్న వాడే అయినా, ఆదర్శ భావాలతో

వ్యవసాయాన్నే వృత్తిగా ఎన్నుకుని, సొంత పొలాన్ని పండించుకుంటూ పల్లెటూరులోనే మకాం స్థిరపరచుకున్నారు. అక్కయ్య ఆ పల్లెటూరికే అలవాటు పడిపోయింది.

అక్కయ్య వచ్చేటప్పుడు దోసకాయలూ, గోంగూర, ములక్కాడలూ, అప్పడాలు, వడియాలు, కొబ్బరి ఉండలు లాంటివి ఎన్నో తెచ్చింది. "ఏవిటోనే, కుచేలుడి లాగా పట్టుకొచ్చాను ఇవన్నీ. మీకు నచ్చుతాయో లేదో?" అంది మొహమాటపడుతూ.

"అయ్యో, అదేం మాటే! సరిగ్గా మాకు కావాల్సిన వస్తువులన్నీ తెచ్చిపెట్టావు. మాకు ఇక్కడ దొరకని వస్తువులివన్నీ! మీ మరిదికి గోంగూర పులుసు, దోసకాయ పప్పు, ములక్కాడల చారూ ఉంటే చాలు పంచభక్ష్య పరమాన్నాలు పెట్టినట్లు సంబరపడతారు. నాకు ఆఫీసు పని తోటి అప్పడాలు, వడియాలు పెట్టడం అసలే పడదు. ఒకవేళ తీరిక దొరికినా... అటువంటి పనులు చేయాలంటే బద్ధకం నాకు! నా సంగతి నీకు తెలుసుగా!" అన్నాను నవ్వుతూ.

"అవును మరి, ఆఫీసు నుంచి వచ్చేసరికి ప్రాణం సోలిపోయి ఉంటుంది. ఇక అప్పడాలూ వడియాలూ పెట్టాలి, ఇడ్లీలూ దోసెలూ వెయ్యాలి అంటే మాటలేమిటి? అసలు ఎలా నెట్టుకొస్తున్నావో ఇంటిపనీ ఆఫీసు పనీను!" అంది అక్కయ్య ఓదార్పుగా.

"ఏమిటో, వెధవ ఉద్యోగం... ఒక్కొక్కప్పుడు మానెయ్యాలనిపిస్తుందే అక్కా! ఇంట గెలిచి, రచ్చ గెలవమన్నట్లు, ఇల్లూ వాకిలీ సరిగ్గా చూసుకోకుండా ఆఫీసులో వ్యవహారాలు చూడబోవటం ఆడదానికి తలకి మించిన పనే!" అన్నాను స్వానుభవం మీద.

"అలా అనకొసేవ్ అమ్మలూ... నువ్వెంత అదృష్టవంతురాలివి! అనకూడదు గాని, హాయిగా చదువుకుని మగవాడితో సమానంగా ఉద్యోగం చేసి, చేతి నిండా సంపాయిస్తున్నావు. 'దేహీ' అని ఒకళ్ళని అడగాల్సిన పని లేదు దేనికి... మాకుమల్లే! కరివేపాకుకి కానీడబ్బు దగ్గర్నుంచీ, మొగుడి మీద ఆధారపడకుండా దర్జాగా బ్రతగ్గలవు!" అంది అక్కయ్య.

'దూరపు కొండలు నునుపు' అనుకున్నాను మనస్సులో. "మీ పాప ఏం చదువుతోందే ఇప్పుడు?" అన్నాను ధోరణి మార్చటానికి.

"స్కూలు ఫైనలు చదువుతోంది. దేవుడి దయవల్ల గట్టెక్కితే కాలేజిలో చేర్పించాలనే నా పట్టు. పొరుగూరు పంపించి హాస్టల్లో ఉంచటం ఆయనకి అంత ఇష్టం లేదు. అయినా ఆడదాన్ని చదువు లేకుండా ఇంట్లో కూర్చోబెట్టటం నాకిష్టం లేదే. నే పడుతున్న పాట్లు చాలవూ! ఆడదానిక్కూడా ఈ రోజుల్లో, ఓ డిగ్రీ చేతిలో లేకపోతే ఎందుకూ కొరగాదు. లేకుంటే మగవాడి చెప్పు కింద తేలులాగ పడి ఉండాల్సిందే!" అంది ఉద్రేకంతో.

అక్కయ్యకి మొదటి నుంచీ చదువంటే ఇష్టం. కానీ నాన్నగారు దానికి చదువు చెప్పించలేదు. ఏదో నోటి లెక్కకి తక్కువని సమాధానం చెప్పలేక పోయిందని 'ఆఁ, ఆడదానికి దీనికి చదువెలా వస్తుంది' అని నాన్నగారు అక్క చదువు ఆపించేసి, అన్నయ్య మీదే అత్యంత శ్రద్ధ చూపించారు. అక్కయ్యకి చదువు లేకపోబట్టే ఆ పల్లెటూరు సంబంధం చేసుకోవాల్సి వచ్చిందనీ, ఇంట్లో పాడి చూసుకోవటం, పొయ్యి అలుక్కోవటం, నూతిలోంచి నీళ్ళు తోడుకోవటం... అలా గొడ్డు చాకిరీ చెయ్యాల్సి వస్తోందని అమ్మ కూడా ఎప్పుడూ అక్కయ్య గురించి బాధ పడుతూ ఉంటుంది.

గతమంతా తలుచుకుని అక్కయ్య బాధ పడుతోందని గ్రహించి, దాన్ని కాస్త మరిపించాలని "అలా అవతలకి పోయి కూచుందాం రావే అక్కా!" ఆంటూ బాల్కనీకి తీసుకువెళ్ళాను.

అక్కడ పూలకుండీల్లో మొక్కలు చూడటం మొదలు పెట్టింది అక్కయ్య. తను తీసుకొచ్చిన దోసకాయలూ, ములక్కాడలూ, గోంగూర అన్నీ వాళ్ళ పెరట్లోవేట. ఈసారి ఎవరైనా వస్తూంటే కాసిని గోంగూర విత్తనాలు పంపించమన్నాను.

"అవునుగాని అమ్మలూ... ఇదేమిటే, ఈ తురాయి చెట్టునీ, దానిమ్మ చెట్టునీ పూలకుండీల్లో వేశావు. ఎట్లా మరుగుజ్జుల్లా తయారయినాయో చూడు! నిక్షేపంలా క్రింద పెరట్లో పెరగనివ్వాల్సిన చెట్లని, పూలమొక్కల్లా కుండీల్లో వేస్తే ఇక అవి ఎట్లా పెరుగుతాయే?" అంది ఆశ్చర్యపోతూ, ఆ చెట్లకోసం బాధపడిపోతూ.

నేను పకపకా నవ్వాను, అక్కయ్య తెల్లబోతూ నావంక చూసింది.

"కావాలనే వేశానక్కా, అదొక స్పెషల్ పద్ధతి. దాన్ని 'బోన్‌సాయ్' అంటారు జపాను దేశంలో! మర్రిచెట్టులాంటి మహావృక్షాన్నికూడా పూలకుండీలో పెంచవచ్చు. ఊడలు కూడా దిగేట్టు పెంచవచ్చు. చిన్న పూలతొట్టెలో దానిమ్మ మొక్కని ఎప్పటి కప్పుడు కొమ్మలు కత్తిరిస్తూ, మధ్యమధ్య తొట్టె మారుస్తూ చిన్న సైజు చెట్టుని చేసి కాయలు కాయనిస్తే చూడటానికి ఎంత ముచ్చటగా ఉంటుందనుకున్నావ్! ఎంత జాగ్రత్తగా పెంచాలో తెలుసా ఈ చిన్న వృక్షాన్ని? 'బోన్‌సాయ్' ఒక గొప్ప కళ." అన్నాను.

అక్కయ్య నా మాటల్ని మెచ్చుకున్నట్లు కనిపించలేదు.

"ఏమిటో, మేడంత ఎత్తు పెరగాల్సిన తురాయి చెట్టుని ఈ కుండీలో బంధించావు!" అంది నిట్టూర్చుతూ.

అక్కయ్యని నా 'బోన్సాయ్' తో మెప్పించలేకపోయినందుకు నిరుత్సాహపడుతూ నీరసంగా కుర్చీలో చతికిల పడ్డాను. నేను నేర్చుకున్న 'కళ' అంతా బూడిదలో పోసిన పన్నీరు అయిందని నీరు కారిపోయాను. అంతలోనే పెద్ద గాలి దుమారం రేగింది. విసురుగా ఇసుక వచ్చి మా మొహాల్ని కొట్టింది. అక్క రెక్క పుచ్చుకుని గదిలోకి లాక్కు వెళ్ళాను. గబగబా కిటికీలూ తలుపులూ మూసేశాను. క్షణాల మీద జరిగిందంతా చూసి అక్కయ్య నిర్ఘాంతపోయింది.

"అదేమిటి? ఇంతవరకూ మామూలుగానే ఉంది. అంతలోనే ఈ దుమ్మూ, గాలీ ఎక్కణ్ణించి వచ్చాయే, తారురోడ్లు కూడానూ?" అంది.

"ఈ మహాపట్నంలో ఇంతేనే తల్లీ. రాజస్థాన్ ఎడారిలో ఉన్న ఇసుకంతా లేవదీసుకొచ్చి మా మొహాన కొట్టి పోతుంది గాలి దుమారం..." ఇంకా నా మాటలు పూర్తి కాలేదు. అవతల టపటపమని వాన చినుకుల చప్పుడైంది. నేను తలుపు తెరిచి బాల్కనీలో ఉన్న బోన్సాయ్ చెట్లకుండీలనీ, పూలకుండీలనీ లోపలికి చూరు క్రిందికి లాగాను. గాలివాన మొదలయింది.

అక్కయ్య కిటికీ రెక్క తెరిచి వీధిలోకి చూసింది... భారత రాజధాని వాతావరణాన్ని!

"'చూడు అమ్మలూ, అటు చూడు!" అంది. అక్కయ్య గొంతులో ఏదో నూతనోత్సాహం తొంగి చూచినట్లనిపించింది. నేను కుతూహలంగా కిటికీలోంచి వీధివైపు చూశాను. అర్థం కాలేదు. అక్కయ్య మొహంలోకి చూశాను. అంతుపట్టక "ఏమిటే?" అన్నాను.


"ఆ చెట్టు చూడు... దారి పక్కన, ఎంతమంది తలదాచుకున్నారో తడిసిపోకుండా!" అంది అదేదో వినూత్న విషయమైనట్లు. నాకు మాత్రం అది అతి సామాన్యమైన సంగతిలా తోచింది. తన మనస్సులోని భావాన్ని నేను గ్రహించలేదని తెలుసుకుందిలా వుంది. తనే మళ్ళీ అంది.

"ఆ తురాయి చెట్టు ఎంత పెద్ద చెట్టు అయిందో చూడు. బయట విశాలంగా ఉన్నచోట స్వేచ్ఛగా పెరిగింది కదూ, ఎంతటి గాలిదుమారం వచ్చినా... అది కించిత్తు చలించలేదు. పైగా అంతమంది జనానికి ఆశ్రయం కల్పించి వాళ్ళకి ఆసరాగా నిలిచింది. ఎండవేళల ఎంత మంది దాని నీడలో సేద తీర్చుకుంటూ ఉంటారో!"

"అందులో వింత ఏముందే?" అన్నాను.

"వింత ఉందని కాదు అమ్మలూ. నువ్వు అపురూపంగా పెంచిన నీ బోన్సాయ్ చూడు! చూట్టానికి కుదురుగా ముచ్చటగానే ఉంది సంసార పక్షపు స్త్రీలాగ. కానీ ఎంత సుకుమారమో చూడు. నువ్వు వెయ్యి కళ్ళతో కాపాడాలి దాన్ని. కాస్త తుఫానుకి కూడా తట్టుకోలేదు. తనే ఒకరి మీద ఆధార పడినప్పుడు మరొకరికి నీడ కూడా ఏమివ్వగలదు? మగవాడికీ, ఆడదానికీ పెంపకంలో ఉన్నతేడా వల్లనే కదుటే... ఆడదాని బ్రతుక్కూడా 'బోన్సాయ్' మాదిరియింది!" అంది.

అక్కయ్య మాటలకి నా మనస్సు ఆర్ద్రమయింది. పంజరంలో బంధించిన చిలకని విడిచి పెట్టి, స్వేచ్ఛావిహంగాన్ని చేసినట్లుగా నా 'బోన్సాయ్' చెట్లకి పూలకుండీల్లోంచి విముక్తి కలిగించాలన్నంత ఆవేశం కలిగింది నాలో!


‘చెప్పాలని ఉంది… దేవతయే దిగివచ్చి మనుషులలో కలిసిన
కథ చెప్పాలని ఉంది’ అన్నాడో సినీ కవి.

ఓ దేవత గురించి చెప్పాలన్నా,
ఓ దేవుడి గురించి చెప్పాలన్నా,
ఓ మహనీయుని గురించి చెప్పాలన్నా,
ఓ మనిషి గురించి చెప్పాలన్నా,
అది కథే అవుతుంది.

మానవ జీవితంతో అంతగా ముడిపడి పోయింది కథ.
ఎంతగా అంటే …
కొందరి జీవితాలు కథల్లా స్ఫురిస్తాయి.
కొన్ని కథలు జీవితాలకు స్ఫూర్తినిస్తాయి.

వ్యథల రాపిడి నుంచి ఎదల సవ్వడి వరకు,
పచ్చని పల్లెల నుంచి పరువంపు ప్రణయాల వరకు,
ఉరిమే మేఘాల నుంచి ఊపిరాడని నగరాల వరకు ..
కథలే కథలు!

ఆ కథలకు కాణాచి కథామంజరి.
చదవండి… చదివించండి.